శ్రీ వేదవ్యాస విరచిత

యక్షప్రశ్నలు

శ్రీవేద వ్యాసుల శ్లోకములు, తెలుగున అర్థ తాత్పర్యములు నీలకంఠీయ వ్యాఖ్యా
ను వాదము, శ్రీ ఎఱ్ఱయ తెలుగు పద్యములు అనువానితో

అనువక్త

ఆచార్య శలాక రఘునాథ శర్మ

శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయము

అనంతపురం

ప్రచురణ :

ఆనందవల్లీ గ్రంథమాల

శ్రీ వేంకటేశ్వరపురం - అనంతపురం

47-50

ద్వితీయముద్రణ-ఈశ్వర-కార్తీకము
నవంబరు - 1997

ప్రతులు : రెండు వేలు

©'గ్రంథకర్త :

ప్రతులకు :

శ్రీమతి శలాక రాజేశ్వరి
ఎ. 2. స్టాఫ్ క్వార్టర్సు
శ్రీ కృష్ణదేవరాయ విశ్వవిద్యాలయము
శ్రీ వేంకటేశ్వరపురం
అనంతపురం - 515 003.
ఫోన్ - 55226

శ్రీగోపాల్ పబ్లికేషన్సు
3-3-860 కుత్బిగూడ
Opp. lane Arya Samaja Mandir
Kacheguda
HYDERABAD-500 027
Phone: 557579

మూల్యం రు. 24-00

ముద్రణ :
© 31575
శ్రీ లక్ష్మీగణపతి బైండింగ్ వర్క్స్,
కొవ్వూరు - 534 350.

ఓమ్

సౌజన్య సంభావనము

శ్రీమద్వేదవ్యాసరూప శ్రీమన్నారాయణార్చనలో ఈ 'యక్షప్రశ్నలు' అయిదవ కుసుమం. దీనితరువాత పుష్పించిన ఆరవకుసుమం 'సనత్సుజాతీయ సౌరభం. 'దానిని ఉచితంగా తెలుగుజాతికి అందించిన వారు శ్రీరాజాలక్ష్మీ ఫౌండేషన్ అధినేత శ్రీ పి.వి.రమణయ్యరాజాగారు.

దీని ప్రథమముద్రణ విషయంలో నాకు ఎంతో ప్రోత్సాహాన్నిచ్చినవారి నందరినీ స్మృతిపథంలో నిలుపుకుంటూ ఉంటాను.

ఈ రెండవముద్రణకు నన్ను ప్రోత్సహించి కావలసిన ధనసాహాయ్యం అందించినవారు 'సంఘోద్ధారక' శ్రీ జి.వి. సుబ్బయ్యగారు. వారిని గురించి చెప్పదగిన ముఖ్య విషయాలు ఈ గ్రంథంలో అక్షరబద్ధా లయ్యాయి. వారికీ, వారికుటుంబ సభ్యులకూ పరమాత్మ సర్వదా ఆయురారోగ్యభాగ్యాలు ప్రసాదించుగాక! అస్మత్ప్రియ సుహృద్వరులు పూజ్య శ్రీ కుమ్మెత రామారావుగారు (అనంతపురం శ్రీ శారదా శంకరమందిరం మేనేజరు) ఈ సత్కార్యంలో కారయిత్ర స్థానంలో ఉన్నారు. వారికి నమోవాకములు.

కొవ్వూరు శ్రీ లక్ష్మీగణపతి బైండింగ్ వర్క్సువారు నా గ్రంథ ముద్రణ విషయంలో సర్వదా ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. వారికీ వారి ముద్రణాలయ పరివారానికీ భగవంతుడు ఆయురారోగ్యభాగ్యాలను అనుగ్రహించుగాక!

ఈశ్వర కార్తీకము
నవంబరు - 1997

శరశర్మ

తీర్థము

శ్రీ వేదవ్యాసులవారు మానవ సమాజమునందు పరమ దయాపూర్ణులై దాని సముత్తరణముకొరకు జ్ఞాన విజ్ఞానములను అనేక రూపములతో అందించిన మహాత్ములు. వారు నిర్మించిన శ్రీమన్మహాభారతము ప్రధానముగా అధ్యాత్మ విద్యాశాస్త్ర గ్రంథము. అందు కథ కేవలము ఔషధము కొనవలసిన ఆతురునకు మొదట నాలుకకు అంటించుకొనెడు తేనె వంటిది. తత్వము అతిగహనమైనది. సాధారణముగా మానవునకు దానియందు అభిరుచి యేర్పడుట దుర్లభము. ఈ మానవనైజ మెరిగిన శ్రీకృష్ణద్వైపాయనులు పుత్రహితము మాత్రమే యెఱిగి యెట్టైన దానినే సాధించు తల్లివలె మానవ జాతి సముద్ధరణమునకు కావలసిన అమృతమును ఆ గ్రంథమునందు నిక్షేపించిరి. కొంచెము పాటి ప్రయత్నముతో ఆ అమృత భాండము నందుకొనువారికి అది ఇహపర సౌఖ్యములను అనంత ముఖములతో ప్రసాదించును.

మఱియొక రహస్యము. అల్పశక్తియుక్తులు ఆభాండమునందలి సిద్ధాన్నమును ఏ పుడిసెడు గ్రహింప గల్గినను వారికి పూర్ణఫలము కలుగుట తథ్యము.

ఆ విధమైన దివ్యమైన ఓజస్సుగల గ్రంథ భాగములలో యక్షప్రశ్న ఘట్టమొకటి.

ఈ ఘట్టము వనపర్వమునందు మూడువందల పదుమూడవ అధ్యాయముగా రూపొందినది. వనపర్వము భారతమునందలి మూడవ పర్వము. దీనిని అరణ్య పర్వమనియు నందురు. నూరు పర్వముల లెక్కలో అరణ్యపర్వమునందు ఇరువది రెండు ఉపపర్వములు గలవు. వానిలో చివరిది ఆరణేయ పర్వము. ఇది అయిదధ్యాయముల గ్రంథభాగము.

దీనిలో మూడవది అనగా నమముగా మధ్యమన్నది యక్షప్రశ్న ఘట్టము.

స్థూలముగా కథా సందర్భము. పాండవులు అజ్ఞాతవాసము చేయుచున్న సమయము. ఎన్నో యిడుములు పడి తుది ఘట్టమున వారు కామ్యకవనమునుండి ద్వైతవనమునకు వచ్చిరి. ఒక బ్రాహ్మణుని అరణిని (అగ్నిని సాధించు పనిముట్టును) మృగ మపహరించుకొని పోయినది. అతని ప్రార్థనపై కొనితెచ్చు ప్రయత్నము నందు వారు మిక్కిలి శ్రమాకులులైరి. యుధిష్ఠిరుని మాటమేరకు వారు నీరుత్రావి యితరులకు తెచ్చుటకై ఒక సరస్సు కడ కరిగి ఒక్కొక్కరు యక్షుని ఎచ్చరికను సరకుగొనక నీరు త్రావబోయి నిశ్చేష్టులై పడిపోయిరి. కడకు ధర్మరాజు ఆ తావునకు వచ్చి వారిని చూచి పరమ దుఃఖమంది విలపించెను. ఎన్నోకారణముల నభ్యూహ చేసెను. దాహము తొందరించుటచే నీరుత్రావి ఆ పిదప కర్తవ్యమును నిర్ణయించు కొనదలచి త్రావబోగా యక్షుని ఎచ్చరిక వినవచ్చెను. 'నా ప్రశ్నలకు సదుత్తరము లొసగి మాత్రమే యిందలి నీరు త్రావవలయును. ఈ కాసారము నాది. విరుద్ధముగా ప్రవర్తించినచో నీకు నీ తమ్ములగతియే పట్టును.'

ధర్మరాజు సర్వ విషయములందును సమగ్రమైన నిగ్రహము గలవాడు. యక్షుడడిగిన ప్రశ్నలన్నింటికి సరియైన సమాధానములు చెప్పి యక్షుని తృప్తి పరచెను.

ఇచట మనమాలోచింపవలసిన మహా విషయమొకటి కలదు. ఆతడు పడరాని శ్రమపడి పిపాసార్తుడై యున్నాడు. అనగా అతని దేహము వివశమై యున్నది. నలువురు ప్రాణపదముల వంటి తమ్ములు తనకనుల యెదుట నిర్జీవులై పడియున్నారు. దానివలన ఆతని హృదయము వికలమై వివశమై యున్నది. కాయము, మనస్సు, వివశములైన వానికి వాగ్వృత్తి స్తిమితమై యుండుట సాధారణముగా పొసగని విషయము. ఇట్లాతని త్రికరణములు పరమక్షోభకు తావలమునై యుండగా యక్షుడు పరీక్షా బుద్ధియై ప్రశ్నలను గుప్పించెను. అయినను తడబడక, తప్పక తగిన ఉత్తరములను ఇచ్చెను.

అంతటి మానసక్షోభలో ఆతని హృదయమంత విద్యాదీప్తులను విరజిమ్మెననగా సావధాన హృదయుడైనచో ఆతని జ్ఞానసంపద యెంతగా మిన్నులు ముట్టెడిదో మనము సంభావింప వలయును. పైగా యక్షుడడిగిన ప్రశ్నలు తత్త్వజ్ఞానమునకు సంబంధించినవి. అందు పారమ్యము గడించుట యనగా నాతడు ఋషి తుల్యుడగుట యని నిశ్చప్రచమైన అభిప్రాయము.

ఈ ఘట్టమున మఱియు నాశ్చర్యకరమైన విషయము మఱియొకటి కలదు. విద్యకు అధీతి, బోధ, ఆచరణము, ప్రచారము అని నాలుగు దశలు. సాధారణముగా చదివిన పంక్తులు వల్లెవేయుటకు, బుద్ధిప్రాబల్యమును బట్టి వ్యాఖ్యానించుటకు చాలమంది సమర్థులే యగుదురు. కాని తదాచరణము దగ్గరకు వచ్చుసరికి వారి వారి నైజములు బయటపడును. యక్షుడు ధర్మజుని ధర్మశాస్త్రాధిగమము మాత్రమే కాదు, దానియందలి ఆతని ఆచరణనిష్ఠను గూడ పరీక్షించెను. నీయుత్తరములు అన్నియు యథాతథముగా సత్యములు. ఒక్క సోదరుని బ్రతికింతును. కోరుకొమ్మనెను. ధర్మరాజు క్షణమైన ఆలోచింపక నకులుని బ్రతికింపు మని కోరెను.

యక్షుడు భీమార్జునుల బలాదులను ప్రశంసించి ప్రలోభ పెట్టుటకు గట్టిగ ప్రయత్నించెను. ధర్మజుడు 'నాకు కుంతి యెట్టిదో మాద్రియు నట్టిదే. మా యిద్దరు తల్లులు పుత్రవతులగుటయే నా అభీష్టము' అని సుదృఢముగా పలికెను.

ఇది ధర్మాచరణమునందలి యాతని పరీక్షావిజయమునకు పరమ నిదర్శనము. ఈ విజయము ఆతని నలుగురు సోదరులను జీవింప జేసినది. యక్షరూపమున వచ్చిన దాక్షిణ్య ప్రభువు యముడు తన తనయుని ధర్మనిష్ఠ నీవిధముగా లోకమునకు చాటెను.

జాగ్రత్తగా పరిశీలించి చూచినచో ధర్మరాజు ఇట్టి పరీక్షలెన్నింటినో ఎదుర్కొనెను. పై చూపునకు అవి యన్నియు అతని అశక్తతా స్ఫోరకములనిపించును. కాని తత్త్వమరసినచో అవి యన్నియు నాతని విజయపరంపరలే. (1) ద్యూతమున ఓడుట, (2) రాజ్యము కోల్పోవుట (3) వస్త్రాపహరణము పొందుట (4) అరణ్య అజ్ఞాతవాసములు చేయుట (5) రాయబారములు విఫలమగుట (6) యుద్ధమున ఆత్మీయుల నెందరనో కోల్పోవుట (7) సర్వసమర్థుడగు శ్రీకృష్ణభగవానుని అండదండలుండియు సుఖపడకుండుట (8) తల్లి, తాను మహారాజైనపుడు గాంధారీ ధృతరాష్ట్రులను సేవించుకొనుచు బ్రదుకుట (9) తాను చూచుచుండగా పత్నియు సోదరులు పడిపోవుట, ఇంకను మరెన్నియో కలవు. వాని నన్నింటిని తడవనేల? ఇవి యన్నియు స్వర్గారోహణ పర్వములో ఫలితమునకు వచ్చిన ఆతని జీవయాత్రలో విజయములే. యుధిష్ఠిరుని చుట్టు అల్లుకొనిన ఈ మహాగాథయే శ్రీ వేదవ్యాస నిర్మిత మహాభారతము. అదియొక ఆశ్చర్యకరమైన అగాధ అమృతసాగరము. అందులోని యొక సన్నని కమనీయ కుల్య ఈ యక్షప్రశ్నము.

ఇదిగో అందుకొనుడు. ఆస్వాదింపుడు. ఆనందసాంద్ర స్థితినమభవింపుడు.

❀ ❀ ❀

ఓమ్

యక్ష ప్రశ్నము - విశ్లేషణ

ఈ ఘట్టము శ్రీమహాభారతము అరణ్య పర్వమునందలి మూడువందల పదు మూడవ అధ్యాయమున మనకు గోచరించును. ఇందు మొత్తము 133 శ్లోకములు గలవు. ఇందు 1వ శ్లోకము మొదలుకొని 44వ శ్లోకము వరకు పూర్వ పీఠిక వంటి గ్రంథము. ధర్మరాజ శోకము ఇందు ప్రధాన విషయము. యక్షుడు ప్రశ్నింతుననుట, ధర్మరాజు ఉత్తరము లొసగుటకు సిద్ధపడుట అనునది యిందు ప్రస్తావన వంటిది.

ఇందు యక్షుని ప్రశ్నలు మొత్తము ముప్పది నాలుగు శ్లోకములలో కలవు. ప్రశ్నల సంఖ్య నూటయిరువది నాలుగు. యుధిష్ఠిరుడు ఉత్తరములుగా పలికిన శ్లోకములు నలువదిమూడు.

సమాధానములు అన్ని ప్రశ్నలకు ప్రత్యేకముగా కలవు కాని ఒక్క ప్రశ్నకు మాత్రము సమాధానము సూటిగా లేదు.

97వ శ్లోకములో పండితుడు, నాస్తికుడు, మూర్ఖుడు, కామము, మత్సరము అనునైదింటిని గూర్చి ప్రశ్నింపగా ధర్మజ్ఞుడే పండితుడు, నాస్తికుడే మూర్ఖుడు, సంసారహేతువే కామము, హృత్తాపమే మత్సరము అని నాలుగే సమాధానములు మనకు కానవచ్చును. కాని అందు నాస్తికుడే మూర్ఖుడు కనుక మరల మూర్ఖుడెవ్వడో చెప్పబనిలేదన్న భావముతో ఒక సమాధానము సంగ్రహింపబడినది. కనుక ధర్మజుడు చెప్పిన సమాధానములు కూడ నూట యిరువది నాలుగేయని మనము గ్రహింపవలయును.

వీనిలో "ఆదిత్యుని ఉదయింపజేయునది ఎవరు?" అన్న ప్రశ్న మొదలుకొని యక్షుడడిగిన ప్రశ్నలన్నియు ఆత్మతత్త్వమునకు, దాని సాధనజాతమునకు సంబంధించినవే.

నలువదియైదవ శ్లోకము మొదలుకొని అరువది యెనిమిదవ శ్లోకము వరకు ఈ ఆత్మ తత్త్వ విచారము సాగినది.

ఆటుపై కింస్విదేకపదమ్ అనునది మొదలుకొని యేడు శ్లోకములు (ప్రశ్నలకు సంబంధించి యేడు, సమాధానములకు సంబంధించి యేడు) త్వం పదార్థ చర్చకు సంబంధించినవి. అనగా జీవలక్షణమును వివరించునవి.

తరువాతి మూడు శ్లోకములు తత్ పదార్థ విచారణను జేయునవి. అనగా పరమాత్మ బోధకములు - వీనిలో సాధన పరంపర కూడ ప్రస్తావనకు వచ్చినది.

88, 90 శ్లోకములలో జ్ఞాన సాధనములగు తపము మున్నగు వాని తత్త్వమును వివరించిరి.

ఆ తరువాతి శ్లోకములలో దైవాసుర సంపద్విభాగమునకు సంబంధించిన అంశములు కలవు. కర్మ ఉపాసనా జ్ఞాన మార్గములకు అంతరంగ సాధనమైన వైరాగ్యమును 115, 116, 117, 118 శ్లోకములలో నిరూపించిరి.

120, 121 శ్లోకములు పురుషుని, సర్వధనిని వివరించి చెప్పినవి.

122 నుండి చివరి శ్లోకము వరకు ధర్మజుని ధర్మనిష్ఠా పరీక్ష. అనగా అది ఉత్తరపీఠిక వంటిది.

ఈ విధముగా ఈ యక్షప్రశ్న ఘట్టమున 1 నుండి 44వ శ్లోకము వరకు పూర్వపీఠిక - 45 నుండి 121 వరకు ప్రధాన గ్రంథభాగము. తరువాతిది ఉత్తరపీఠిక. ప్రధానముగా ఇందు ప్రతిపాదింపబడినది అధ్యాత్మ విద్యా స్వరూపము, తన్నిష్ఠాక్రమము అనునవి.

ఇట్లిది ఇహపరములకు రెంటికిని కావలసిన జ్ఞానవిజ్ఞానముల అమృతమును అందించు సువర్ణపాత్రము.

వ్యాసాయ విష్ణురూపాయ వ్యాసరూపాయ విష్ణవే
నమో వై బ్రహ్మనిధయే వాసిష్ఠాయ నమో నమః

❀ ❀ ❀

ఓమ్

విఘ్నేశ్వరం విఘ్ననాశ్యై వాణీం వాచః ప్రవృత్తయే
గురూన్ గూఢార్థభానాయ ప్రణమామి పునః పునః

నమోఽస్తుతే వ్యాస! విశాలబుద్ధే ఫుల్లారవిందాయత పత్ర నేత్ర!
యేన త్వయా భారత తైల పూర్ణః ప్రజ్వాలితో జ్ఞాన మయప్రదీపః

నారాయణం నమస్కృత్య నరం చైవ, నరోత్తమమ్
దేవీం సరస్వతీం వ్యాసం తతో జయ ముదీరయేత్.

ఓమ్

శ్రీః
శ్రీ మన్మహాభారత
ఆరణ్యకే పర్వణి ఆరణేయ పర్వణి

త్రయోదశాధిక త్రిశతతమోధ్యాయః

యక్షప్రశ్నాః

వైశమ్పాయన ఉవాచ - వైశంపాయనుడు చెప్పెను.

స దదర్శ హతాన్ భ్రాతౄన్ లోకపాలానివ చ్యుతాన్,
యుగాన్తే సమనుప్రాప్తే శక్రప్రతిమ గౌరవాన్. 1

అర్థః సః- ఆ ధర్మరాజు; యుగాంతే-యుగము చివరికాలము; సమను ప్రాప్తే - రాగా; చ్యుతాన్-జారిన; శక్రప్రతిమ గౌరవాన్ -ఇంద్రునికి సాటియైన గొప్పదనముగల; లోకపాలాన్ ఇవ-లోకపాలురవలెనున్న; హతాన్-మూర్ఛనందియున్న; భ్రాతౄన్-తమ్ములను; దదర్శ - చూచెను.

తా: ప్రళయకాలమున జారి క్రిందపడిన, దేవేంద్రుని వంటి మహిమగల లోకపాలురవలె పడియున్న తమ్ములను ధర్మరాజు చూచెను.

వినికీర్ణ ధనుర్బాణం దృష్ట్వా విహత మర్జునమ్,
భీమసేనం యమౌ చైవ నిర్విచేష్టాన్ గతాయుషః. 2

అర్థ : వినికీర్ణ, ధనుర్, బాణమ్ -చెదరిపడియున్న విల్లు, బాణములు గలిగి; నిహతమ్ - చచ్చిపడి యున్న; అర్జునమ్ - అర్జునుని; భీమసేనమ్ - భీమసేనుని; చ-మరియు; యమౌ, ఏవ -కవలలను, నిర్విచేష్టాన్-చేష్టలు లేనివారిని; గతాయుషః - పోయిన ఆయువు కలవారిని, దృష్ట్వా-చూచి.

తా: చెదరిపడియున్న విల్లంబులతో, ఉడిగిన చేష్టలతో, ఆయువుతీరి యున్న అర్జునుని, భీమును, నకులసహదేవులను చూచి.

స దీర్ఘ ముష్ణం నిఃశ్వస్య శోకబాష్ప పరిప్లుతః,
తాన్ దృష్ట్వా పతితాన్ భ్రాతౄన్ సర్వాం శ్చిన్తా సమన్వితః,
ధర్మపుత్రో మహాబాహు ర్విలలాప సువిస్తరమ్. 3

అర్థ: మహాబాహు:-గొప్ప భుజములు కల; స:=ఆ; ధర్మపుత్ర:-ధర్మరాజు; దీర్ఘమ్ - పొడవుగా; ఉష్ణమ్-వేడిగా; ని:శ్వస్య -నిట్టూర్చి; శోక, బాష్ప, పరిప్లుత:-దు:ఖముచేత వెలువడిన కన్నీటితో తడిసినవాడై; పతితాన్-పడియున్న; భ్రాతౄన్ - తమ్ములను, తాన్-ఆ; సర్వాన్ - అందరను; దృష్ట్వా-చూచి, చిన్తా సమన్విత:-చింతతో కూడినవాడై; సువిస్తరమ్-చాల ఎక్కువగా; విలలాప-ఏడ్చెను.

తా: మహాబలశాలి అయిన ఆ ధర్మరాజు దీర్ఘముగా వేడిగా నిట్టూర్చి, పడియున్న ఆ తమ్ముల నందరను గాంచి పరమదు:ఖముతో పెద్దగా ఏడ్చెను.

నను త్వయా మహాబాహో ప్రతిజ్ఞాతం వృకోదర, 4
సుయోధనస్య భేత్స్యామి గదయా సక్థినీ రణే,
వ్యర్థం తదద్య మే సర్వం త్వయి వీరే నిపాతితే. 5

అర్థ: వృకోదర -భీమసేనా! మహాబాహో-గొప్ప భుజములు గలవాడా! రణే - యుద్ధమున; గదయా - గదతో; సుయోధనస్య-దుర్యోధనుని; సక్థినీ - తొడలను; భేత్స్యామి - విఱుగగొట్టెదను; అని, త్వయా - నీచేత; ప్రతిజ్ఞాతం, నను- ప్రతిజ్ఞచేయబడినది కదా; వీరే - వీరుడవైన; త్వయి - నీవు; నిపాతితే - కూల్పబడగా, అద్య-ఈనాడు; మే-నా; తత్-ఆ; సర్వమ్-మొత్తము; వ్యర్థమ్ - వ్యర్థమైనది.

తా: ఓ! భీమసేనా! నీవు యుద్ధమున దుర్యోధనుని తొడలను విఱుగ గొట్టెదనని ప్రతిజ్ఞచేసితివి. వీరుడవు నీవిట్లు కూలిపోగా నా ఆశ యంతయు వ్యర్థమైనది.

మహాత్మని మహాబాహో కురూణాం కీర్తివర్ధనే,
మనుష్యసంభవా వాచో విధర్మిణ్య: ప్రతిశ్రుతా: 6

అర్థ: మహాబాహో! - ఓయి గొప్పభుజములు గలవాడా! మహాత్మని-మహాత్ముడు; కురూణామ్-కురువంశమువారి; కీర్తివర్ధనే-కీర్తి పెంపొందించువాడు అగు అర్జునునియందు; మనుష్యసంభవా:-సాధారణ జనులయందు పుట్టెడు; విధర్మిణ్య:-అసత్యములైన; వాచ: - వాక్కులు; ప్రతిశ్రుతా: - వినబడినవి.

తా: ఓ మహాబాహూ! ఆ అర్జునుడు మహాత్ముడు. కురువంశమువారి కీర్తిని పెంపొందించువాడు. అట్టివాని విషయమున సాధారణ జనులయందు పుట్టెడు అసత్యపు మాటలు ఇప్పుడు వినవలసి వచ్చినది.

భవతాం దివ్యవాచస్తు తా భవన్తు కథం మృషా,
దేవాశ్చాపి యదా వోచన్ సూతకే త్వాం ధనఞ్జయ. 7

అర్థ: ధనంజయ! -ఓ అర్జునా! ; యదాసూతకే - నీ పుట్టిన ఏసమయమున; దేవా: - దేవతలు; త్వాం-నిన్ను గూర్చి; అవోచన్ - పలికిరో; తా:-ఆ; దివ్యవాచ:-దివ్యములగు మాటలు; కథం-ఎట్లు; మృషా-అసత్యములు; భవన్తు-అగును?

తా: అర్జునా! నీ పుట్టుక సమయమున దేవతలు నిన్ను గూర్చిపలికిన దివ్యమైన పలుకులు అబద్దము లెట్లగును?

సహస్రాక్షా దనవరః కున్తి పుత్ర స్తవేతి వై,
ఉత్తరే పారియాత్రే చ జగు ర్భూతాని సర్వశః. 8

అర్థ: కున్తి - ఓ కుంతీ; తవ-నీ; పుత్రః -కొడుకు; వై-నిశ్చయముగా: సహస్రాక్షాత్ - వేయికనులుగల దేవేంద్రుని కంటె; అనవరః-తక్కువవాడు కాడు; ఇతి-అని; ఉత్తరే - ఉత్తరమున నున్న; పారియాత్రే-పారియాత్రమను కొండమీద; సర్వశః - అన్నివిధములుగా; భూతాని-భూతములు; జగుః -గానము చేసెను.

తా: ఓ కుంతీ! ఈ నీకుమారుడు దేవేంద్రునకు తీసిపోని వాడగును అని ఉత్తరపారియాత్రమున భూతములన్నియు పలికెను.

విప్రణష్టాం శ్రియం చైషా మాహర్తా పున రజ్జసా,
నాస్య జేతా రణే కశ్చి దజేతా నైష కస్యచిత్. 9

అర్థ: ఏషామ్-వీరి; విప్రణష్టామ్-పోయిన; శ్రియమ్ - సంపదను; పునః-మరల; అజ్జసా - వేగముగా; ఆహర్తా-తెచ్చువాడగును; రణే - యుద్ధమున; అస్య-ఇతనిని; జేతా - గెలుచువాడు; కశ్చిత్-ఎవ్వడును; న - లేడు; ఏషః - ఇతడు; కస్యచిత్-ఎవ్వనికి; అజేతా - గెలువనివాడు; న-కాడు?

తా: ఈతడు ఈ పాండు పుత్రులు కోల్పోయిన సంపదను మరల సంపాదించును. యుద్ధమున నితనిని గెలుచువాడు ఎవ్వడు నుండడు. ఎట్టివానినైనను ఈతడు గెలుచువాడే.

సోఽయం మృత్యువశం యాతః కథం జిష్ణు ర్మహాబలః,
అయం మమాశాం సంహత్య శేతే భూమౌ ధనఞ్జయః. 10

అర్థ: మహాబలః -గొప్పబలము కలవాడు; జిష్ణుః - జయించు స్వభావము గలవాడు అగు; సః, అయమ్-ఆ యీతడు; కథమ్-ఎట్లు; మృత్యువశమ్-మృత్యువునకు వశమై; యాతః-పోయినవాడాయెను? అయమ్ - ఈ; ధనఞ్జయః - ధనంజయుడు; మమ-నా; ఆశామ్-ఆశను; సంహత్య -సర్వనాశనము చేసి ; భూమౌ-నేలపై; శేతే-పడియుండెను.

తా: గొప్పబలముకలవాడు జయించుటయే శీలముగాగలవాడు అగు ఈ అర్జునుడు ఎట్లు మృత్యువునకు వశమై పోయెను? నా ఆశనంతటిని వమ్ముచేసి నేలపై పడియుండెను.

ఆశ్రిత్య యం వయం నాథం దుఃఖా న్యేతాని సేహిమ.

అర్థ: వయమ్-మేము; యమ్-ఏ; నాథమ్-రక్షకుని; ఆశ్రిత్య-ఆశ్రయించి; ఏతాని - ఈ; దుఃఖాని-దుఃఖములను, సేహిమ-సహించితిమో.

తా: మేము ఎవ్వనిని నాథునిగా ఆశ్రయించి ఈ దుఃఖములన్నింటిని సహించితిమో ఆ ధనంజయుడు నేల కూలెను.

రణే ప్రమత్తౌ వీరౌ చ సదా శత్రు నిబర్హణౌ,
కథం రిపువశం యాతౌ కున్తీపుత్రౌ మహాబలౌ,
యౌ సర్వాస్త్ర ప్రతిహతౌ భీమసేన ధనఞ్జయౌ. 12

అర్థ: యౌ - ఏ; భీమసేన ధనంజయౌ-భీమార్జునులు; సర్వ, అస్త్ర, అప్రతిహతౌ - అన్ని అస్త్రముల ఏటు పొందనివారో; రణే-యుద్ధమున; ప్రమత్తౌ-ఒడలెరుగని వారో; వీరౌ - వీరులో; సదా-ఎల్లప్పుడు; శత్రు నిబర్హణౌ -శత్రువులను చీల్చిచెండాడు వారో; మహాబలౌ - గొప్పబలము గలవారో; తౌ-అట్టి; కున్తీ పుత్రౌ - కుంతి కొడుకులు; కథమ్-ఏవిధముగా; రిపువశమ్-శత్రువులకు వశమగుటను; యాతౌ-పొందిరి.

తా: కుంతీతనయులగు ఈ భీమార్జునులు వీరులు. యుద్ధమున ఒడలెరుగక పోరాడువారు. ఎప్పుడును శత్రువులను చీల్చి చెండాడువారు. గొప్పబలము గలవారు. ఏ అస్త్రములును వారిని దెబ్బగొట్టజాలవు. అట్టివీరు ఇప్పుడెట్లు శత్రువులకు వశమైరి?

అశ్మసార మయం నూనం హృదయం మమ దుర్భుదః,
యమౌ యదేతౌ దృష్ట్వాద్య పతితౌ నావదీర్యతే. 13

అర్థ: దుర్భుదః-దుష్టుడనైన; మమ-నా; హృదయమ్-హృదయము; నూనమ్ - నిశ్చయముగా; అశ్మసారమయమ్-వజ్రముతో ఏర్పడినది;యత్-ఏలయనగా; అద్య - నేడు; పతితౌ-నేలఁగూలిన; ఏతౌ-ఈ; యమౌ-కవలలను; దృష్ట్వా-చూచి; న, అవదీర్యతే - ముక్కలు కాలేదు.

తా: పాడుమనసుగల నా గుండె నిక్కముగా వజ్రముతో నేర్పడినది కాబోలు. ఈ విధముగా నేలగూలిన కవలలు సకుల సహదేవులను చూచి ముక్కలు కాకున్నది.

శాస్త్రజ్ఞా దేశకాలజ్ఞా స్తపోయుక్తాः క్రియాన్వితాः,
అకృత్వా సదృశం కర్మ కిం శేధ్వం పురుషర్షభాः. 14

అర్థ: పురుష - ఋషభాः - పురుషులలో శ్రేష్ఠులారా! (మీరు) శాస్త్రజ్ఞాः - శాస్త్రములను చక్కగా ఎఱిగినవారు; దేశ, కాల, జ్ఞాः - దేశము, కాలము అనువానిని బాగుగా తెలిసినవారు; తపోయుక్తాः - తపస్సుతో కూడినవారు; క్రియా అన్వితాः - ఆయా కార్యములతో ప్రవర్తించువారు; సదృశమ్ - మీకు యోగ్యమైన; కర్మ - పనిని, అకృత్వా - చేయక; కిమ్ - ఏల; శేధ్వమ్ - పడియుంటిరి?

తా: పురుషవరేణ్యులారా! మీరు శాస్త్రములు చక్కగా ఎఱిగినవారు దేశ కాలముల తత్త్వమెరిగినవారు. తపస్సంపదకలవారు. క్రియలలో దక్షత గలవారు. ఇట్టి మీరు మీకు యోగ్యమైన ప్రతిక్రియ చేయక పడియుంటి రేల?

అవిక్షత శరీరా శ్చ ప్యప్రమృష్ట శరాసనాः,
అసంజ్ఞా భువి సంగమ్య కిం శేధ్వ మపరాజితాः. 15

అర్థః అ, విక్షత శరీరాః - దెబ్బతగులని దేహములు గలవారు; చ, అపి - మరియును; అప్రమృష్ట శర - ఆసనాః - తాకుచు నుండని విండ్లుకలవారు, అగు మీరు; అపరాజితాః - ఎవ్వరికిని ఓడని వారైయుండియు; భువి - నేలపై; సంగమ్య - అంటిపెట్టుకొని; అసంజ్ఞాః- తెలివిమాలినవారై; కిమ్ - ఏల; శేధ్వమ్-పడియున్నారు.

తాః మీ దేహములపై దెబ్బలులేవు. విండ్లు దూరముగా పడియున్నవి (వానిని ప్రయోగించిన జాడలు లేవు) ఎవరో పోరొనరించి మిమ్ములను గెలిచిన గుర్తులును లేవు. మఱి నేలకంటిపెట్టుకొని తెలివి తప్పిపడియున్న కారణమేమి?

సానూ నివాద్రేః దృష్ట్వా భ్రాతౄన్ మహామతిః,
సుఖం ప్రసుప్తాన్ ప్రస్విన్నః ఖిన్నః కష్టాం దశాం గతః. 16

అర్థః మహామతిః - దొడ్డబుద్దిగల ధర్మరాజు; అద్రేః - కొండయొక్క; సానూన్ ఇవ - చరియలవలె; సంసుప్తాన్ - నేల గూలియున్నవారును; సుఖమ్ - సుఖముగా; ప్రసుప్తాన్ - గాఢనిద్రలో నున్నవారును అగు; భ్రాతౄన్ - తమ్ములను; దృష్ట్వా - చూచి; ప్రస్విన్నః ముచ్చెమటలు పోసినవాడై; ఖిన్నః - కుమిలిపోయినవాడై; కష్టామ్ - జాలిగొలిపెడు; దశామ్ - దశను; గతః - పొందిన వాడాయెను.

తాః దొడ్డబుద్దిగల ధర్మరాజు విరిగిపడిన కొండచరియలవలె కూలియున్నవారు, సుఖనిద్రలో మునిగినట్లున్న వారు నగు తమ్ములను చూచి చెమటలు క్రక్కుచు, కుమిలిపోవుచు జాలిగొలుపు దశకు వచ్చెను.

ఏవ మేవేద మిత్యుక్త్వా ధర్మాత్మా స నరేశ్వరః,
శోక సాగర మధ్యస్థో దధ్యౌ కారణ మాకులః. 17

అర్థః ధర్మాత్మా - ధర్మమైన ఆత్మకలవాడు; సః - ఆ; నర - ఈశ్వరః - రాజు; ఇదమ్ - ఇది; ఏవమ్, ఏవ - ఇట్టిదే; ఇతి - అని; ఉక్త్వా - పలికి; ఆకులః - చెదరిన గుండె కలవాడై; శోక, సాగర, మధ్యస్థః - శోకమనెడు సముద్రము నడుమ నున్నవాడై; కారణమ్ - (తమ్ములట్లు పడియుండుటకు) కారణమును; దధ్యౌ - విచారించెను.

తాః ధర్మాత్ముడైన ధర్మరాజు 'ఇది యిట్టిదే' అనుకొనుచు కలతపడిన గుండెతో శోకసముద్రము నడుమ నున్నవాడై తమ్ముల పాటునకు కారణమేమై యుండునా అని విచారించెను.

ఇతికర్తవ్యతాం చేతి దేశకాల విభాగవిత్,
నాభిపేదే మహాబాహు శ్చిన్తయానో మహామతిః. 18

అర్థః మహామతిః - దొడ్డబుద్ది కలవాడు; మహాబాహుః - గొప్పభుజబలము కలవాడు; దేశ, కాల, విభాగవిత్ - దేశము, కాలము అనువాని విభాగముల సూక్ష్మజ్ఞానము కలవాడు అగు ధర్మరాజు; చిన్తయానః - దుఃఖించుచు; ఇతికర్తవ్యతామ్ - చేయదగినపని; ఇతి - ఇట్టిదని; న+అభిపేదే - తెలియకుండెను.

తా: గొప్పబుద్ధిబలము, భుజబలము, దేశకాలజ్ఞానము కలవాడైనను ధర్మరాజు తమ్ములను గూర్చి శోకించుచు చేయవలసిన పనియేమో తోచని వాడాయెను.

అథ సంస్తభ్య ధర్మాత్మా తదాఽఽత్మానం తపః సుతః,
ఏవం విలప్య బహుధా ధర్మపుత్రో యుధిష్ఠిరః, 19
బుద్ధ్యా విచిన్తయామాస వీరాః కేన నిపాతితాః. 20

అర్థ: అథ-పిదప; ధర్మాత్మా-ధర్మబుద్ధికలవాడు, తపఃసుతః-ధర్ముని పుత్రుడు; ధర్మపుత్రః - ధర్ముని మరియొక రూపమైనవాడు; యుధిష్ఠిరః-యుధిష్ఠిరుడు; ఏవమ్-ఇట్లు; బహుధా-పెక్కుతీరుల, విలప్య-ఏడ్చి;తదా-అప్పుడు; ఆత్మానమ్-తన్ను; సంస్తభ్య-ఓదార్చుకొని; బుద్ధ్యా - బుద్ధితో; వీరాః - ఈ వీరులు; కేన - ఎవనిచేత; నిపాతితాః - కూల్పబడిరి - అని; విచిన్తయామాస - ఆలోచించెను.

తా: ధర్మబుద్ధి కలవాడు, యముని కుమారుడు, ధర్ముని మరియొక రూపమైనవాడునగు యుధిష్ఠిరుడు ఇట్లు పెక్కుతీరుల విలపించి తన్నుతానూరడించుకొని యీ వీరులను కూలనేసిన వాడెవ్వడో యని తలపోసెను.

నైషాం శస్త్ర ప్రహారోఽస్తి పదం నేహాస్తి కస్యచిత్,
భూతం మహా దిదం మన్యే భ్రాతరో యేన మే హతాః. 21

అర్థ: ఏషామ్ - వీరికి; శస్త్రప్రహారః - ఆయుధముల దెబ్బ; న, అస్తి - లేదు; ఇహ - ఇక్కడ; కస్యచిత్ - ఎవని యొక్కయు, పదః - కాలు (కాలిగుర్తు); న, అస్తి - లేదు; యేన - దేనిచేత; మే - నా; భ్రాతరః - తమ్ములు; హతాః - కొట్టబడిరో; ఇదమ్ - ఇది; మహత్ - గొప్పదైన; భూతమ్ - భూతము అని; మన్యే - తలతును.

తా: వీరి దేహములపై ఆయుధముల దెబ్బలేదు. ఇక్కడ ఎవ్వని కాలిగుర్తును లేదు. నా తమ్ములను కూలవేసిన దేదో మహాభూతమై యుండునని భావింతును.

ఏకాగ్రం చిన్తయిష్యామి పీత్వా వేత్స్యామి వా జలమ్,
స్యాత్తు దుర్యోధనే వేద ముపాంశు విహితం కృతమ్. 22

అర్థ: ఏకాగ్రమ్ - చెదరని మనస్సుతో; చిన్తయిష్యామి-ఆలోచించెదను; వా-లేదా; జలమ్ -నీటిని; పీత్వా-త్రావి; వేత్స్యామి-తెలిసికొనెదను; ఇదమ్-ఈ; విహితమ్ - అపకారము; దుర్యోధనేన - దుర్యోధనునిచేత; ఉపాంశు - గుట్టుగా; కృతమ్ - చేయబడినది; స్యాత్ - తు-అగునేమో!

తా: మనస్సు నిశ్చలము చేసికొని ఆలోచించెదను. పోనీ నీరు త్రావి దీనిసంగతిని తెలిసికొందును. ఇది దుర్యోధనుడు గుట్టుగా మాకు చేసిన అపకారమగునా?

గాన్ధారరాజ రచితం సతతం జిహ్మబుద్ధినా,
యస్య కార్య మకార్యం వా సమ మేవ భవత్యుత. 23

అర్థః యస్య - ఎవని; కార్యమ్ - పనియు; అకార్యమ్, వా - చెడుపనియు; సమమ్, ఏవ- సమానమే; భవతి - అగునో; సతతమ్ - ఎల్లప్పుడు; జిహ్మబుద్దినా - కపట బుద్ధిగల; ఆ; గాంధార రాజ - గాంధారరాజు శకునిచేత; రచితమ్ - చేయబడినది; ఉత - ఏమో!

తాఃఆ శకుని మంచి చెడులలో ఏ పని చేసినను ఒక్కవిధముగనే యుండును. వాడు ఎల్లవేళల కపటబుద్ధి. ఇది వాని పని అయియుండునా?

కస్తస్య విశ్వసే ద్వీరో దుష్కృతే రకృతాత్మనఃr,
అథవా పురుషై ర్గూఢైఃr ప్రయోగోఽయం దురాత్మనఃr,
భవే దితి మహాబుద్ధి ర్బహుధా తదచిన్తయత్. 24

అర్థః దుష్కృతేః - పాపకర్ముడు; అకృతాత్మనఃr - ఆత్మశుద్ధి లేనివాడు; (మంచి బుద్ధిలేనివాడు) అగు; తస్య - ఆ శకుని విషయమున; కఃr - ఏ; వీరఃr - వీరుడు; విశ్వసేత్ - నమ్మియుండును? అథవా - అట్లుగాక; అయమ్ - ఈ; ప్రయోగఃr - ప్రయోగము (కుట్ర); దురాత్మనఃr - దుష్టబుద్ధియగు ఆ శకునియొక్క; గూఢైఃr - గుట్టుగానుండు; పురుషైఃr - సేవకులచేత; భవేత్ - అయి ఉండును; ఇతి - అని; మహాబుద్ధిఃr - గొప్పబుద్ధి విశేషము గల ధర్మరాజు; తత్ - దానిని గూర్చి; బహుధా - పెక్కువిధముల; అచిన్తయత్ - విచారించెను.

తాఃబుద్ధిలేని వాడు, పాపకర్ముడు అగు ఆ శకునిని నమ్మి వాడెవడు? ఆదురాత్ముడు తన రహస్య సేవకులచేత ఇట్టి పని చేయించి యుండునా? అని ధర్మరాజు పరిపరివిధముల చింతించెను.

తప్యాసీ న్న విషేణేద ముదకం దూషితం యథా. 25

అర్థః ఇదమ్ - ఈ; ఉదకమ్ - నీరు; విషేణ - విషము చేత; దూషితమ్ - చెడినది; యథా - అనుతలపు; తస్య - ఆ ధర్మరాజునకు; న, ఆసీత్ - రాలేదు.

తాఃఈ నీరు విషము చేత చెడిపోయినదేమో అను భావము అతనికి కలుగలేదు.

మృతానా మపి చైతేషాం వికృతం నైవ జాయతే,
ముఖవర్ణాఃr ప్రసన్నా మే భ్రాతౄణా మిత్యచిన్తయత్. 26

అర్థః మృతానామ్, అపి - మరణించిన వారైనప్పటికిని; ఏతేషామ్ - వీరికి; వికృతమ్ - వికారము (ముఖములు కళాకాంతులు తప్పిన లక్షణము) న, జాయతే, ఏవ - కలుగనే లేదు; మే - నా; భ్రాతౄణామ్ - తమ్ముల; ముఖవర్ణాఃr - మొగము రంగులు; ప్రసన్నాఃr - నిర్మలముగా నున్నవి; ఇతి - అని; అచిన్తయత్ - భావించెను.

ఏకైక శ్చోఘబలా నిమాన్ పురుషసత్తమాన్,
కోఽన్యఃr ప్రతిసమాసేత కాలాన్తకయమా దృతే. 27

అర్థః ఏక, ఏకశఃr - ఒక్కొక్కడుగా చూచినను; ఓఘబలాన్ - మహా ప్రవాహపు బలముగల; పురుష సత్తమాన్ - పురుషులలో శ్రేష్ఠులైన; ఇమాన్ - వీరిని; కాలాంతక

యమాత్, ఋతే - కాలాంతకుడగు యమునికంటె; అన్యః - వేరువాడు; కః - ఎవడు; ప్రతిసమాసేత - ఎదుర్కొనగలడు?

తా: నా తమ్ములలో ఒక్కొక్కడు ఒక మహాప్రవాహపు బలము వంటి బలముగల పురుషశ్రేష్ఠుడు. అట్టి వీరిని కాలాంతకుడైన యముడు కాక మరియొక డెవ్వడు ఎదుర్కొన గలడు?

ఏతేన వ్యవసాయేన తత్ తోయం వ్యవగాఢవాన్,
గాహమానశ్చ తత్రైయ మన్తరిక్షాత్ న శుశ్రువే. 28

అర్థ: ఏతేన-ఈ; వ్యవసాయేన - భావనతో; తత్ - ఆ; తోయమ్-నీటిని; వ్యవగాఢవాన్ - ప్రవేశించెను; తత్-ఆ; తోయమ్-నీటిలోనికి; గాహమానః, చ-దిగుచు; సః-ఆ ధర్మరాజు; అన్తరిక్షాత్-ఆకాశమునుండి; శుశ్రువే-(ఒక శబ్దమును) వినెను.

తా: ఇట్టి తలపులతో ఆ ధర్మరాజు నీటిలోనికి దిగెను. దిగుచుండగా ఆకసమునుండి ఒక శబ్ద మాతనికి వినవచ్చెను.

యక్ష ఉవాచ - యక్షుడిట్లు పలికెను.

అహం బకః శైవల మత్స్య భక్షో నీతా మయా ప్రేతవశం తవానుజాః,
త్వం పఞ్చమో భవితా రాజపుత్ర న చేత్ ప్రశ్నాన్ పృచ్ఛతో వ్యాకరోషి.29

అర్థ: రాజపుత్ర-రాజకుమారా! అహమ్-నేను; శైవల, మత్స్య, భక్షః-నాచు చేపలు మొదలగువానిని తినెడు; బకః-కొంగను, తవ-నీ; అనుజాః-తమ్ములు; మయా-నాచేత; ప్రేతవశమ్-చావునకు వశమగుటను; నీతాః-పొందింపబడిరి; పృచ్ఛతః-అడుగుచున్న (నాయొక్క); ప్రశ్నాన్-ప్రశ్నలను; న, వ్యాకరోషి చేత్-వివరించి చెప్పనివాడవైనచో; త్వమ్-నీవు; పఞ్చమః-అయిదవవాడవు; భవితా-అగుదువు.

తా: రాజకుమారా! నాచుచేపలు తినుచుండు కొంగను నేను. నీతమ్ములను చంపినది నేనే. నేనడుగు ప్రశ్నలను చక్కగా వివరించి చెప్పకున్నచో నీవును వారితో పాటు అయిదవ వాడవగుదువు. (వారు నలువురు అయినట్లే నీవును అగుదువు.)

మా తాత సాహసం కార్షీ ర్మమ పూర్వ పరిగ్రహః,
ప్రశ్నా నుక్త్వా తు కౌన్తేయ తతః పిబ హరస్వచ. 30

అర్థ: తాత-నాయనా! సాహసమ్-తొందరపాటుతనమును; మా కార్షీ:-చేయవలదు; (ఈ జలాశయము) మమ-నా(నేను); పూర్వపరిగ్రహః-ముందు కైకొనినట్టిది; కౌన్తేయ-కుంతీకుమారా! ప్రశ్నాన్-ప్రశ్నలకు; ఉక్త్వా, తు-సమాధానములు చెప్పి; పిబ-త్రావుము; చ-మరియు; హరస్వ-తీసికొని పొమ్ము.

తా: బాబూ! తొందరపడకు. ఈ చెరువు నేను ముందు ఆక్రమించుకొనినట్టిది (నాది) నా ప్రశ్నలకు సమాధానము లొసగి నీరు త్రావుము. కైకొనిపొమ్ము.

యుధిష్ఠిర ఉవాచ - ధర్మరాజిట్లు పలికెను.

రుద్రాణాం వా వసూనాం వా మరుతాం వా ప్రధానభాక్,
పృచ్ఛామి కో భవాన్ దేవో నైత చ్ఛకునినా కృతమ్. 31

అర్థ: రుద్రాణాం, వా-రుద్రుల యొక్కయో; వసూనాం, వా- వసువుల యొక్కయో; మరుతాం- వా-మరుత్తుల (వాయువుల) యొక్కయో; ప్రధానభాక్- నాయకుడవు; దేవ:-దివ్యలక్షణములుగల; భవాన్-నీవు; క:-ఎవరు? పృచ్ఛామి-అడుగుచున్నాను; ఏతత్-ఈపని (నాతమ్ములను పడగొట్టుట), శకునినా-ఒక పక్షిచేత; న కృతమ్-చేయబడలేదు.

తా: స్వామీ! తాము రుద్రులు, వసువులు, మరుత్తులు అనువారిలో ఏదో ఒకజాతి వారికి నాయకులై యుందురు. తామెవరో, అడుగుచున్నాను. చెప్పుడు. ఇది (ఇట్లు నా తమ్ములను కూల్చుట యనునది) ఒక పక్షి చేసిన పనికాదు.

హిమవాన్ పారియాత్రశ్చ విన్ధ్యో మలయ ఏవచ,
చత్వార: పర్వతా: కేన పాతితా భూరితేజస:. 32

అర్థ: హిమవాన్-హిమవంతము; చ-మరియు; పారియాత్ర:-పారియాత్రము; విన్ధ్య:-వింధ్యము; చ, ఏవ; మలయ;-అట్లే మలయము; అను, చత్వార:-నాలుగు; భూరితేజస:-గొప్పతేజస్సుగల; పర్వతా:-పర్వతములు; కేన-ఎవనిచేత; పాతితా:-పడగొట్టబడినవి.

తా: హిమవంతము; పారియాత్రము, వింధ్యము, మలయము అను గొప్ప మహిమగల నాలుగు కొండలను కూల్చిన మీరెవరు?

అతీవ తే మహత్ కర్మ కృతం చ బలినాం వర,
యాన్ న దేవా న గన్ధర్వా నాసురాశ్చ న రాక్షసా:,
విషహేరన్ మహాయుద్ధే కృతం తే తన్మమాద్భుతమ్. 33

అర్థ: బలినామ్, వర-బలవంతులలో ఎన్నదగిన వాడా! తే-నీచేత; అతీవ-మిక్కిలి; మహత్-గొప్ప;కర్మ-కార్యము;కృతమ్-చేయబడినది; యాన్-ఏ నా తమ్ములను; దేవా:-దేవతలు; గన్ధర్వా:-గంధర్వులు; అసురా:-అసురులు; రాక్షసా:-రక్కసులు; మహాయుద్ధే-పెద్ద యుద్ధమున;విష హేరన్-ఎదుర్కొనజాలరో; తత్-అట్టివారిని కూల్చుట అను; మహాద్భుతమ్-గొప్ప ఆశ్చర్యము గొలుపు పని; తే-నీచేత; కృతమ్-చేయబడినది.

తా: ఓయీ! నీవు బలముగలవారిలో శ్రేష్ఠుడవు. నీవు చాల గొప్పపని చేసితివి. ఈ నా తమ్ములను దేవతలుగాని, గంధర్వులుగాని, అసురులుగాని, రక్కసులుగాని మహాయుద్ధమున ఎదుర్కొనజాలరు. అట్టివారిని కూల్చుట మహాశ్చర్యకరమైన విషయము.

నతే జానామి యత్ కార్యం నాభిజానామి కాంక్షితమ్,
కౌతూహలం మహజ్జాతం సాధ్వసం చాగతం మమ. 34

అర్థ: తే-నీ; కార్యమ్-పని; యత్-ఏదో; న, జానామి-తెలియకున్నాను; కాంక్షితమ్-(నీవు) కోరినది యేమో; న, అభిజానామి-బొత్తిగా తెలిసికొనలేకున్నాను; మహత్-గొప్ప; కౌతూహలమ్-(తెలిసికొనెడు) ఉబలాటము; జాతమ్-కలిగినది; మమ-నాకు; సాధ్వసమ్; చ-భయము కూడ; ఆగతమ్-వచ్చిపడినది.

తా: వీరి నిట్లు చేయుటలో నీపని యేమో తెలియకున్నది. నీవు కోరెడిదేమో ఏమాత్రము తెలియరాకున్నది. తెలిసికొనవలయు ననుఉబలాటము ఎక్కువగా నున్నది. భయము కూడ కలిగినది.

యే నా స్మ్యుద్విగ్న హృదయ: సముత్పన్న శిరోజ్వర:,
పృచ్ఛామి భగవం స్తస్మాత్ కో భవా నిహ తిష్ఠతి. 35

అర్థ: యేన-ఏకారణముచేత; ఉద్విగ్నహృదయ:-స్థితప్పిన హృదయము కలవాడను; సముత్పన్న, శిరోజ్వర:-పుట్టిన తలనొప్పికలవాడను అయితినో; తస్మాత్-ఆకారణమువలన; భగవన్-పూజ్యుడా! పృచ్ఛామి-అడుగుచున్నాను; ఇహ-ఇక్కడ; తిష్ఠతి-ఉన్న; భవాన్-తమరు; క:-ఎవరు?

తా: నా హృదయము కుతకుతలాడి పోవుచున్నది. తలనొప్పి పుట్టినది. అందువలన అడుగుచున్నాను. ఇచట నిలిచిన తామెవరు?

యక్ష ఉవాచ - యక్షు డిట్లు పలికెను.
యక్షో2హ మస్మి భద్రం తే వాస్మి పక్షీ జలేచర:,
మయైతే నిహతా: సర్వే భ్రాతర స్తే మహౌజస:. 36

అర్థ: అహమ్-నేను, యక్ష:, అస్మి-యక్షుడను; తే-నీకు; భద్రమ్-శుభమగు గాక! జలేచర:-నీటతిరుగు; పక్షీ-పక్షిని; న-అస్మి-కాను; మహౌజస:-గొప్ప దేహబలము గల; ఏతే-ఈ; తే-నీ; భ్రాతర:-తమ్ములు; సర్వే-అందరు; మయా-నాచేత; నిహతా:-పడగొట్టబడిరి.

తా: నేను యక్షుడను. నీటి పక్షినికాను. నీకు శుభమగుగాక! గొప్ప బలముగల యీ నీతమ్ముల నందరిని నేనే కూల్చివైచితిని.

వైశమ్పాయన ఉవాచ - వైశంపాయను డిట్లు చెప్పెను.
తత స్తా మశివాం శ్రుత్వా వాచం స పరుషాక్షరామ్,
యక్షస్య బ్రువతో రాజ న్నుపక్రమ్య తదా స్థిత:. 37

అర్థ: రాజన్-రాజా! తత:-అంతట; బ్రువత:-పలుకుచున్న; యక్షస్య-యక్షుని; అశివామ్ అమంగళము; పరుష-అక్షరామ్-కటువైన వర్ణములు కలది; అగు; తామ్-ఆ; వాచమ్-మాటను; శ్రుత్వా-విని; స:-ఆధర్మరాజు; ఉపక్రమ్య-కొంచెము దగ్గరకు వచ్చి; తదా-అప్పుడు; స్థిత:-నిలిచి యుండెను.

తా: జనమేజయ మహారాజా! అట్లు ఆ యక్షుడు అమంగళము, చెవికి కటువైనది అగు మాటను పలుకుచుండగా విని ధర్మరాజు కొంచెము దగ్గరగా వచ్చి నిలుచుండెను.

విరూపాక్షం మహాకాయం యక్షం తాలుసముచ్ఛ్రయమ్,
జ్వలనార్క ప్రతీకాశ మధృష్యం పర్వతోపమమ్. 38

వృక్ష మాశ్రిత్య తిష్ఠన్తం దదర్శ భరతర్షభ:,
మేఘగమ్భీరవాదేన తర్జయన్తం మహాస్వనమ్. 39

అర్థ: భరత-ఋషభ:-భరతవంశమున శ్రేష్ఠుడగు ధర్మరాజు; విరూప-అక్షమ్-వికృతమైన కనులుగల; మహాకాయమ్-పెద్దదేహముగల; తాలు సముచ్ఛ్రయమ్-దొడల వైశాల్యముగల; జ్వలన-అర్క ప్రతీకాశమ్-అగ్నివలె, సూర్యునివలెనున్న; అధృష్యమ్-అణపశక్యము కాని; పర్వత-ఉపమమ్-కొండవలెనున్న; యక్షమ్-యక్షుని; వృక్షమ్-చెట్టును; ఆశ్రిత్య-ఆశ్రయించి, తిష్ఠన్తమ్-ఉన్నవానిని, మేఘ, గమ్భీర, నాదేన-మేఘమువలె గంభీరమైన నాదముతో; తర్జయన్తమ్-బెదరించుచున్న వానిని, మహాస్వనమ్-పెద్ద కంఠధ్వని గలవానిని; దదర్శ-చూచెను.

తా: ధర్మరాజు ఒక యక్షుని చూచెను. అతని కన్నులు వికృతముగా నుండెను. దేహము పెద్దగా నుండెను. దొడలు అతి విశాలముగా నుండెను. ఎట్టివారికిని లొంగనివాడై కొండంత దేహముతో అగ్నివలె, సూర్యునివలె వెలుగొందుచు ఒక చెట్టుపై నిలిచెను. ఉఱుము వంటి కంఠధ్వనితో బెదరించుచుండెను. వాని స్వరము చాల పెద్దగా నుండెను.

యక్ష ఉవాచ - యక్షు డిట్లనెను.

ఇమే తే భ్రాతరో రాజన్ వార్యమాణా మయా సకృత్,
బలాత్తోయం జిహీర్షన్త స్తతో వై మృదితా మయా. 40

అర్థ: రాజన్-రాజా! ఇమే-ఈ; తే-నీ; భ్రాతర:-తమ్ములు; మయా-వాచేత; అసకృత్-పెక్కుమారులు; వార్యమాణా:-వారింపబడుచున్న వారయ్యు; బలాత్-మొండిగా; తోయమ్-నీటిని; జిహీర్షన్త:-కొనిపోవగోరినవారగుచు; తత:-అంతట; మయా-నాచేత; మృదితా:-మర్దింపబడిరి.

తా: రాజా! ఈ నీతమ్ములు నేను పలుమారులు వలదని చెప్పుచున్నను మొండిగా నీటిని పుచ్చుకొనబోయిరి. అంత నేను వారిని నలిపి వైచితిని.

న పేయ ముదకం రాజన్ ప్రాణా నిహ వరీప్సతా,
పార్థ మా సాహసం కార్షీ ర్మమ పూర్వపరిగ్రహ:. 41

అర్థ: రాజన్-రాజా! ఇహ-ఇక్కడ; ప్రాణాన్-ప్రాణములను; వరీప్సతా-పొందగోరువానిచేత; ఉదకమ్-నీరు; న, పేయమ్-త్రాగరానిది; పార్థ-కుంతీతనయా!; సాహసమ్-తొందరపాటును; మాకార్షీ:-చేయకుము; (అయమ్-ఇది) మమ-నాకు; పూర్వపరిగ్రహ:-ముందు చేజిక్కినది.

తా: రాజా! ప్రాణములు నిలుపుకొనగోరువాడు ఇందు నీరు త్రావరాదు. నీవు సాహసము చేయకుము. ఈ జలాశయము నాది.

ప్రశ్నా నుక్త్వా తు కౌన్తేయ తతః పిబ హరస్వచ. 42

అర్థ: తు-కాని, కౌన్తేయ-కుంతీకుమారా! ప్రశ్నాన్-నా ప్రశ్నలను; ఉక్త్వా-పలికి; తతః-అటుపై; పిబ-త్రావుము; చ-మరియు; హరస్వ-కొనిపొమ్ము.

తా: కుంతీతనయా! నా ప్రశ్నలకు సమాధానములు చెప్పి అటుపై నీరు త్రావుము. కొనిపొమ్ము.

యుధిష్ఠిర ఉవాచ - యుధిష్ఠిరు డిట్లు పలికెను.

నచాహం కామయే యక్ష తవ పూర్వపరిగ్రహమ్,
కామం నైతత్ ప్రశంసన్తి సన్తో హి పురుషాః సదా. 43

అర్థ: యక్ష-ఓ యక్షుడా! తవ-నీ, పూర్వపరిగ్రహమ్-మునుపటి సొమ్ములను; అహమ్-నేను; న,కామయే-కోరను; సన్తః-సజ్జనులైన; పురుషాః-మానవులు; సదా-ఎల్లప్పుడు; ఏతత్-ఈ; కామమ్-కోరికను; న, ప్రశంసన్తి, హి-మేలుఅనరు కదా!

తా: యక్షా! నీ సొమ్మును నేను కాంక్షింపను. సజ్జనులు ఒకని సొమ్మును కోరుట నెన్నటికిని మంచిదనరు.

యదాత్మనా స్వమాత్మానం ప్రశంసే పురుషర్షభ,
యథా ప్రజ్ఞం తు తే ప్రశ్నాన్ ప్రతివక్ష్యామి పృచ్ఛ మామ్. 44

అర్థ: పురుషర్షభ-పురుషశ్రేష్ఠా; యత్-ఏకారణమున; ఆత్మనా-తనచేతనే; స్వమ్-తనదైన; ఆత్మానమ్-ఆత్మను; ప్రశంసే-చెప్పెదను; తు-కాని; యథాప్రజ్ఞమ్-తెలివిమేరకు; తే-నీ; ప్రశ్నాన్-ప్రశ్నములను; ప్రతివక్ష్యామి-సమాధానింతును; మామ్-నన్ను; పృచ్ఛ-అడుగుము.

తా: యక్షా! ఆత్మచేతనే ఆత్మస్వరూపమును చెప్పుకొనవలయును. కావున నీ ప్రశ్నలకు నాబుద్ధి శక్తిని బట్టి సమాధానములు చెప్పెదను. అడుగుము.

విశే: ఆత్మనా-తనకు పొడమిన సందేహములను తన బుద్ధిశక్తిచేతనే తీర్చు కొనవలయును. కావున నీవు అడిగెడు ప్రశ్నలకు నా బుద్ధిశక్తి నుపయోగించి సమాధానములు చెప్పెదనని తాత్పర్యము.

అవ: ప్రశ్నోత్తరముల భాగము ఇచట మొదలగుచున్నది.

యక్ష ఉవాచ - యక్షు డిట్లనెను.

కింస్వి దాదిత్య మున్నయతి కే చ తస్యాభిత శ్చరాః,
కశ్చైన మస్తం నయతి కస్మింశ్చ ప్రతితిష్ఠతి. 45

అర్థ: కిం స్విత్-ఏది; ఆదిత్యమ్-ఆదిత్యుని; ఉన్నయతి-ఉదయింపజేయు చున్నది; చ-మరియు; కే-ఏవి;తస్య- ఆ ఆదిత్యునకు; అభితః-అన్నివైపుల; చరాః-సంచరించువారు;

చ-మరియు; కః-ఎవరు; ఏనమ్-ఇతనిని; అస్తం నయతి-అస్తమింపజేయును; చ-మరియు; కస్మిన్-దేనియందు; ప్రతితిష్ఠతి-ప్రతిష్ఠ పొందును.

తాః సూర్యుని ఉదయింపజేయునది ఏది? సూర్యుని చుట్టు తిరుగువారెవ్వరు? సూర్యుని అస్తమింపజేయునది ఏది? సూర్యుడు దేనియందు స్థిరముగా నిలిచి యున్నాడు?

విశే: ఇచటనుండి సాగిన ఈ ప్రశ్నోత్తరమాలిక ఆత్మతత్త్వమును నిర్ణయించుట కొరకు మొదలైనది. 'తరతి శోక మాత్మవిత్' - ఆత్మజ్ఞానము కలవాడు శోకమును దాటును - అను వాక్యమునుబట్టి ఆజ్ఞానమే ఈ విచారమునకు ఫలము. అది సిద్ధించుటకై మహోన్నతమగు సాధన సముదాయమును ఈ ప్రకరణమునందు శ్రీవ్యాసులు నిరూపించుచున్నారు. కావున ఈ సమాధానములకు ఆత్మ విద్యాపరమైన వ్యాఖ్యానమును శ్రీనీలకంఠులు అందించుచున్నారు.

యుధిష్ఠిర ఉవాచ - ధర్మరాజిట్లు చెప్పెను.

బ్రహ్మాదిత్య మున్నయతి దేవా స్తప్యాభిత శ్చరాఃl
ధర్మ శ్చాస్తం నయతి చ సత్యే చ ప్రతితిష్ఠతి. 46

అర్థ: బ్రహ్మ-బ్రహ్మము; ఆదిత్యమ్-సూర్యుని; ఉన్నయతి-పైకి తెచ్చుచున్నది; తస్య-అతనికి; దేవాఃదేవతలు; అభితఃఅన్నివైపులను; చరాఃసంచరించువారు; చ-మరియు; ధర్మఃధర్మము; అస్తం నయతి-అస్తమింప జేయుచున్నది; చ-మరియు; సత్యే-సత్యమునందు; ప్రతితిష్ఠతి-నెలకొనియున్నాడు.

తాః బ్రహ్మము సూర్యుని ఉదయింపజేయును. వానిచుట్టు తిరుగువారు దేవతలు. ధర్మము సూర్యుని అస్తమింపజేయును. సూర్యునికి సత్యమునందు నిలుకడ కలదు.

వ్యాఃఆత్మవిద్యకు సంబంధించి ఆదిత్యుడనగా జీవుడు. శబ్దము మొదలగువానిని ఆదానము చేయువాడు - గ్రహించువాడు అని అర్థము. అట్టివానిని బ్రహ్మము-ఉన్నయతి-వేరుచేయుచున్నది. తనకంటె వేరుగా చూపుచున్నది. ఈ బ్రహ్మము నేను తెల్లనివాడను, గ్రుడ్డివాడను, నేను దుఃఖమునందినవాడను, నేను సుఖమును పొందినవాడను మొదలగు భావముల వలన దేహాదులే ఆత్మ అనురూపమున ప్రకాశించు చున్నది. ఆయా వాదములు చేయువారు పెక్కువిధములుగా దీనిని కల్పించుకొనుచుందురు. అట్టి బ్రహ్మమే జీవుని తనకంటె వేరుగా ఏర్పాటు చేయుచున్నది. కాని నిజమైన ఆత్మతత్త్వమును నిర్ణయించుటలో వేదమే ప్రమాణమైనది. ఆవేదము ఇట్లు చెప్పుచున్నది - "నా వేదవిన్మనుతే తం బృహన్తమ్" - వేదమునెరుగనివాడు బ్రహ్మమును భావింపజాలడు.

కాని అందరు వేదము వలన బ్రహ్మము నెరుగుదురా? అన్నచో కాదు. అని 'దేవాఃమొదలైన రెండవ పాదముతో చెప్పుచున్నారు.

ఇచట దేవులు - శమము దమము మొదలగు లక్షణములు. అవి జీవునకు తత్త్వ మెరుగుటలో: అభితः-చరాः' - చుట్టును తిరుగునవి అనగా తోడ్పడునవి అని భావము. శమాధులను తోడుగా కైకొని వేదమును బట్టి ఆత్మతత్త్వ మెరుగవలయునని భావము.

ఆ జీవుని అస్తమింపజేయునది ధర్మము. అస్తమించుట అనగా తన నిజమైన స్థితిని పొందుట. అనగా బ్రహ్మము నుండి విడివడిన జీవుడు మరల బ్రహ్మమే యగుట. ఈ స్థితిని కలిగించునది ధర్మము. ఇచట ధర్మమనగా కర్మయోగము, లేక ఉపాసన. అది సాక్షాత్తుగా గాని మెట్లుగా గాని స్వస్థితిని పొందించును.

ఇట్లు తన నిజమైన స్థితిని పొందిన తరువాత మరల జీవస్థితి కలుగకుండ కాపాడునది ఏది? అన్నతాత్పర్యముతో సూర్యునకు ప్రతిష్ఠ - చెడనిస్థితి, దేని యందు కలుగును? అను ప్రశ్నకు సమాధానముగా 'సత్యమునందు' అని ధర్మరాజు సమాధానము చెప్పెను. ఇచట సత్యమనగా ఏవిధమైన బాధలేని శుద్ధమైన జ్ఞాన స్వరూపము. దానియందు జీవుడు ప్రతిష్ఠితుడగును. బ్రహ్మముతో పొందిన ఐక్యమును పొగొట్టుకొనకుండునని భావము. శ్రుతియు దీనిని ఇట్లు ప్రతిపాదించుచున్నది. "స ఏవం విద్వా నస్మాచ్ఛరీర భేదా దూర్ధ్వము త్క్రమ్య అముష్మిన్ స్వర్గే లోకే సర్వాన్ కామా నాప్త్వా అమృతः సమభవత్" - 'ఇట్లు ఆత్మతత్త్వ మెరిగినవాడు ఈ శరీరభేదము నుండి పైకి లేచివచ్చి ఈ స్వర్గలోకమున కోరిక లన్నింటిని పొంది అమృతుడాయెను.' మొట్టమొదట శాస్త్రమువలన కలిగెడు జ్ఞానము, దాని వలన శమము మొదలగు లక్షణములు నిండుగా గలుగుట, దాని వలన కలిగిన యోగబలము వలన దేహాదుల యందు తోచెడు ఆత్మభావన తొలగుట, అటుపై సగుణ బ్రహ్మము సాక్షాత్కరించుట అనెడు స్వర్గము సిద్ధించుట, కడకు కైవల్య సిద్ధి-అనునవి ఈ శ్రుతి ప్రతిపాదించిన విషయములు. ధర్మజుడు చెప్పిన సమాధానములను దీనితో సమన్వయించుకొన వలయును.

యక్ష ఉవాచ - యక్షుడిట్లు పలికెను.

కేనస్వి చ్ఛ్రోత్రియో భవతి కేనస్వి ద్విన్దతే మహత్,
కేనస్వి ద్వితీయవాన్ భవతి రాజన్ కేన చ బుద్ధిమాన్. 47

అర్థ: రాజన్-రాజా! కేనస్విత్-దేనితో; శ్రోత్రియः-శ్రోత్రియుడు; భవతి-అగును; కేనస్విత్-దేనితో; మహత్-బ్రహ్మమును; విన్దతే-పొందును; కేనస్విత్-దేనితో; ద్వితీయవాన్-రెండవది కలవాడు; భవతి-అగును; చ-మరియు; కేన-దేనితో; బుద్ధిమాన్-బుద్ధి కలవాడు; (భవతి - అగును).

తా: రాజా! నరుడు శ్రోత్రియుడు దేనితో నగును? దేనితో బ్రహ్మమును పొందును? దేనితో రెండవది కలవాడగును? దేనితో బుద్ధిమంతుడగును?

యుధిష్ఠిర ఉవాచ - యుధిష్ఠిరు డిట్లు చెప్పెను.
శ్రుతేన శ్రోత్రియో భవతి తపసా విన్దతే మహత్,
ధృత్యా ద్వితీయవాన్ భవతి బుద్ధిమాన్ వృద్ధసేవయా. 48

అర్థ: శ్రుతేన-శ్రుతముచేత; శ్రోత్రియ:-శ్రోత్రియుడు (వేదము నధ్యయనము చేసినవాడు) భవతి-అగును; తపసా-తపస్సుచేత; మహత్-బ్రహ్మమును; విన్దతే-పొందును; ధృత్యా-ధృతిచేత; ద్వితీయవాన్-రెండవది కలవాడగును; వృద్ధసేవయా-వృద్ధులను సేవించుట చేత; బుద్ధిమాన్-బుద్ధిమంతుడు; (భవతి-అగును).

తా: వేదమును గురుముఖమున నేర్చుట ద్వారా శ్రోత్రియుడగును. తపస్సు చేత బ్రహ్మమును పొందును. ధృతిచేత సహాయుడు కలవాడగును. వృద్ధులను సేవించుట చేత బుద్ధిమంతుడగును.

వ్యా: వేదమునకు సత్యము నందు ప్రతిష్ఠ-అని పూర్వ శ్లోకమున గుర్తించితిమి. అందు కానవచ్చు ద్వారమును గూర్చి యీ శ్లోకమున చెప్పుచున్నారు.

శ్రోత్రియుడనగా వేదములను అధ్యయనము చేయువాడు. అధ్యయనమనగా కేవలము అక్షరములను గ్రహించుట కాదు. అది శ్రుతము - ఆచార్యుని ముఖము నుండి అర్థజ్ఞానము పొందుచుగ్రహించుట. దానిచేతనే శ్రోత్రియుడను వ్యవహారము సిద్ధించును.

తపస్సు అనగా ఆవిధముగా నేర్చినవేదమును చక్కగా భావన చేయుట. వేదవిద్యను గాఢముగా భావించుటచేత బ్రహ్మజ్ఞానము సిద్ధించునని తాత్పర్యము. మానమునకు - ప్రమాణమునకు, మేయమునకు - దాని ద్వారా తెలియదగిన బ్రహ్మమునకు, సంబంధించిన అసంభావనను తొలగించుట ద్వారా బ్రహ్మమనగానేమో నిశ్చయించుటయే యిచట పొందుట.

ధృతి అనగా నిదిధ్యాసన "ధృత్యా యయా ధారయతే మన: ప్రాణేన్ద్రియ క్రియా: యోగేన వ్యభిచారిణ్యా ధృతి: సా పార్థ సాత్త్వికీ" అని గీత.

మనస్సు, ప్రాణము, ఇంద్రియ క్రియలు అనువానిని అటు ఇటు పోనీక పట్టుకొను దానికి సాత్త్వికమైన ధృతి అని పేరు. అదియే ఆత్మవిద్యలో సాధకునకు సహాయము. దాని వలన నరుడు సహాయవంతుడగుచున్నాడు.

బుద్ధిమంతుడు - బుద్ధికలవాడు. ఇచట బుద్ధి అనగా ఆ వేదము వలన, ఆ తపస్సు వలనను ఆ ధృతి వలనను నిశ్చయరూపముగా కలిగెడు జ్ఞానము. ఇది గురువుల ఉపదేశము వలననే పొందదగినది కనుక వృద్ధసేవచే అది ఏర్పడునను భావముతో వృద్ధసేవచే బుద్ధిమంతుడ గునని చెప్పిరి. వేదము కూడ "ఆత్మా వారే ద్రష్టవ్య: శ్రోతవ్యో మన్తవ్యో నిదిధ్యాసితవ్య:" అనియు "ఆచార్యవాన్ పురుషో వేద" అనియు చెప్పుచున్నది. ఆత్మను దర్శింపవలయును, ఆత్మను గూర్చి వినవలయును, ఆత్మను మననము చేయవలయును. ఆత్మను గుండెలో నిలుపుకొనవలయును. ఆచార్యుడుగల పురుషుడే ఆత్మతత్త్వము నెరుగుచున్నాడు. కావున ఇచట వృద్ధులనగా పరతత్త్వమును ఎదలో కుదురుకొనునట్లు ఉపదేశము చేయగల జ్ఞాన సంపన్నులు.

యక్ష ఉవాచ - యక్షుడిట్లు పలికెను.

కిం బ్రాహ్మణానాం దేవత్వం కశ్చ ధర్మ: సతామివ,
కశ్చైషాం మానుషో భావ: కిమేషా మసతా మివ. 49

అర్థ: బ్రాహ్మణానాం-బ్రాహ్మణుల; దేవత్వమ్-దేవలక్షణము; కిమ్-ఏది; సతామ్,ఇవ - సత్పురుషులకు వలె; క:-ఏది; చ-మరియు; ఏషామ్-వీరికి; మానుష-మనుష్య సంబంధమైన; భావ:-భావము; క:-ఏది; ఏషామ్-వీరికి; అసతామ్; ఇవ-అసజ్జనులకు వలె, కిమ్-ఏమి?

తా: బ్రాహ్మణుల దేవత్వమేది? వారిలో సత్పురుషుల లక్షణము వంటిదేమి? వారిలో మనుష్య భావము ఎట్టిది? వారిలో చెడ్డవారి లక్షణమేమి.

యుధిష్ఠిర ఉవాచ - యుధిష్ఠిరు డిట్లు చెప్పెను.

స్వాధ్యాయ ఏషాం దేవత్వం తప ఏషాం సతామివ,
మరణం మానుషో భావ: పరివాదో ఽ సతామివ. 50

అర్థ: ఏషామ్-వీరికి; స్వాధ్యాయ:-వేదములను చదువుట; దేవత్వమ్-దేవతా లక్షణము; ఏషామ్-వీరికి; సతామ్, ఇవ-మంచివారి వంటి లక్షణము; తప:-తపస్సు; మరణమ్-మరణము; మానుష-మనుష్యసంబంధమైన; భావ:-భావము; అసతామ్,ఇవ-చెడ్డవారి లక్షణము వంటిది; పరివాద:-నింద

తా: బ్రాహ్మణులకు వేదాధ్యయనమే దేవత్వము. తపస్సే మంచి లక్షణము. చావే మనుష్యభావము. నిందయే దుష్టలక్షణము.

వ్యా: శ్రవణము మున్నగు వాని యధికారము ఎట్లు కలుగునో మూడు సమాధానములతో ప్రతిపాదించుచున్నారు.

స్వాధ్యాయమనగా వేదములను అర్థసహితముగా అలవరచుకొనుట. అదియే విప్రుల దేవతా లక్షణము.

తపమనగా శమము, దమము మొదలగు గుణముల సంపదయు, సదాచార సంపదయు. దీనివలన విప్రులు సజ్జనులు అగుదురు.

మానుషమైన భావమనగా ఆత్మకంటె భిన్నములగు దేహము మున్నగు వాని యందు అభిమానము. అదియే విప్రులకు మరణము-చావువంటిది. దేహాద్యభిమానము కల విప్రుడు మరణించిన వానితో సమానమని భావము. మరణమనగా జనన మరణములను కలిగించు అజ్ఞానమనియు గ్రహింపదగును.

పరివాదమనగా నింద. దైవమును, బ్రహ్మజ్ఞాన సంపన్నులను దూషించుట, మరియు అనాచారము. ఇవి బ్రాహ్మణునకు వదలదగిన రెండు లక్షణములు.

యక్ష ఉవాచ - యక్షుడిట్లు పలికెను.

కిం క్షత్రియాణాం దేవత్వం కశ్చధర్మ: సతామివ,
కశ్చైషాం మానుషో భావ: కిమేషా మసతా మివ. 51

అర్థ: క్షత్రియాణామ్-క్షత్రియులకు; దేవత్వమ్-దేవభావము; కిమ్-ఏమి; సతామ్,ఇవ - సజ్జనులకు వలె; కः-ఏది; ధర్మः-(వారికి) ధర్మము; చ-మరియు; ఏషామ్-వీరికి; మానుషः భావः-మానుష భావము; కः-ఏది; ఏషామ్-వీరికి; అసతామ్, ఇవ-చెడ్డవారి లక్షణము వంటిది; కిమ్-ఏది.

తాː క్షత్రియులకు దేవత్వమేది? వారిలో మంచిలక్షణ మనగానేమి? వారికి మానుషభావమేది? వారిలో చెడ్డలక్షణమేమి?

యుధిష్ఠిర ఉవాచ - యుధిష్ఠిరు డిట్లు చెప్పెను.

ఇష్వస్త్ర మేషాం దేవత్వం యజ్ఞ ఏషాం సతామివ,
భయం వై మానుషో భావः పరిత్యాగో ఽసతామివ. 52

అర్థ: ఏషామ్-వీరికి; ఇష్వస్త్రమ్-ధనుర్విద్య; దేవత్వమ్-దేవలక్షణము; ఏషామ్-వీరికి; యజ్ఞः-యజ్ఞము; సతామ్, ఇవ-సజ్జనుల కర్తవ్యము వంటిది. భయమ్, వై-భయమే; మానుషः భావः-మానుషమైన భావము; పరిత్యాగः-ఆర్తులను వదలుటయే; అసతామ్, ఇవ-చెడ్డవారిలక్షణము వంటిది.

తాː ధనుర్విద్య క్షత్రియులకు దేవత్వము. యజ్ఞము వారికి కర్తవ్యము. భయము వలన వారు సాధారణ మానవుల వంటి వారగుదురు. ఆర్తులను రక్షింప కుండుటయే వారి నీచలక్షణము.

యక్ష ఉవాచ - యక్షు డిట్లు పలికెను.

కి మేకం యజ్ఞియం సామ కిమేకం యజ్ఞియం యజుः,
కా చైషాం వృణుతే యజ్ఞం కాం యజ్ఞో నాతివర్తతే. 53

అర్థ: యజ్ఞియమ్-యజ్ఞ సంబంధమైన; ఏకమ్-ఒక్క; సామ-సామము; కిమ్-ఏది; యజ్ఞియమ్-యజ్ఞ సంబంధమైన; ఏకమ్-ఒక్క; యజుः-యజుస్సు; కిమ్-ఏది; ఏషామ్-వీనిలో; కా-ఏది; యజ్ఞమ్-యజ్ఞమును; వృణుతే-వరించును; యజ్ఞः-యజ్ఞము; కామ్-దేనిని; న, అతివర్తతే-అతిక్రమింపదు (మీరి చనదు).

తాː యజ్ఞ సంబంధమగు సామమొక్కటి ఏది? యజ్ఞ సంబంధమగు యజుస్సు ఒక్కటి ఏది? వీనిలో యజ్ఞమును ఏది వరించును? యజ్ఞము దేనిని మీరి ప్రవర్తింపదు?

యుధిష్ఠిర ఉవాచ - యుధిష్ఠిరు డిట్లు చెప్పెను.

ప్రాణో వై యజ్ఞియం సామ మనో వై యజ్ఞియం యజుः,
ఋగేకా వృణుతే యజ్ఞం తాం యజ్ఞో నాతివర్తతే. 54

అర్థ: ప్రాణः వై--ప్రాణమే; యజ్ఞియమ్-యజ్ఞ సంబంధమైన; సామ-సామము; మనः, వై-మనస్సే; యజ్ఞియమ్-యజ్ఞ సంబంధమైన; యజుः-యజుస్సు; ఋక్-ఋక్కు; ఏకా-

ఒక్కటియే; యజ్ఞం-యజ్ఞమును; వృణుతే-వరించును; తామ్-ఆ ఋక్కును; యజ్ఞ:-యజ్ఞము; న, అతివర్తతే-మీరిపోదు.

తా: ప్రాణమే యజ్ఞసంబంధమైన సామము. మనస్సే యజ్ఞమునందలి యజుస్సు. ఋక్కు ఒక్కటియే యజ్ఞమును వరించును. ఋక్కును యజ్ఞము అతిక్రమింపదు.

వ్యా: లోకమున యజ్ఞము నందు సామవేదము, యజుర్వేదము, ఋగ్వేదము అనునవి తమ తమ మంత్రములను వినియోగించును. కాగా ఇచట యజ్ఞము జ్ఞానాత్మకము. కావున ఈ యజ్ఞమునకు సంబంధించిన సామవేదము వంటిది ఏది? అని మొదటి ప్రశ్నకు తాత్పర్యము. అది ప్రాణమని సమాధానము. యజుస్సు ఏదియను ప్రశ్నకు సమాధానముగా మనస్సును చెప్పెను. అట్లే ఈ యజ్ఞమున ఋక్కే ముఖ్యముగా జ్ఞానమును స్వీకరించునని మూడవ ప్రశ్నకు సమాధానము. కావున దానిని దాటి జ్ఞానముండదని నాల్గవ సమాధాన భావము.

ప్రాణ మనస్సులను నిరోధించెడు యజ్ఞమునందు సామ యజుర్వేదముల వంటివి ఉపకరణములయిన ప్రాణ మనస్సులని భావము. ఋక్కు అనగా వాక్కు. జ్ఞానము కలిగించునదని తాత్పర్యము. వేదము కూడ ఇట్లు చెప్పుచున్నది- "మనోవాచం ప్రాణం తాన్యాత్మనే కురుత:" - ఈ మూడింటిని ఆత్మహితార్థమే ప్రజాపతి సృష్టించెనని మంత్ర తాత్పర్యము. "తం త్వౌ పనిషదం పురుషమ్" అన్నచోట కూడ 'ఔపనిషదం' అను విశేషణము వాక్కు యొక్క ముఖ్యత్వమును ప్రతిపాదించుచున్నది.

యక్ష ఉవాచ - యక్షు డిట్లనెను.

కిం స్వి దావపతాం శ్రేష్ఠం కిం స్వి న్నివపతాం వరమ్,
కిం స్విత్ ప్రతిష్ఠమానానాం కిం స్విత్ ప్రసవతాం వరమ్. 55

అర్థ: ఆవపతామ్-దేవతలను తృప్తిపరచు వానిలో; కింస్విత్-ఏది; శ్రేష్ఠమ్-శ్రేష్ఠమైనది; నివపతామ్-పితృతర్పణము చేయువానిలో; కింస్విత్-ఏది; వరమ్-మేలైనది; ప్రతిష్ఠమానానామ్-ప్రతిష్ఠపొందగోరు వారికి; కింస్విత్-ఏది; శ్రేష్ఠమ్-మేలైనది; ప్రవపతామ్-సంతానము కోరువారికి; కిం స్విత్-ఏది; వరమ్-మిన్నయైనది.

తా: దేవతలను తృప్తిపరచు వానిలో శ్రేష్ఠమైన దేది? పితృతర్పణము చేయువానిలో ఏది మిన్నయైనది? ప్రతిష్ఠపొందు వారికి ఏది శ్రేష్ఠము? సంతానము కోరువారికి ఏది మేలైనది?

వర్షమావపతాం శ్రేష్ఠం బీజం నివపతాం వరమ్,
గావ: ప్రతిష్ఠమానానాం పుత్ర: ప్రసవతాం వరమ్. 56

అర్థ: ఆవపతామ్-సంపూర్ణముగా దేవతలను తృప్తిపరచువానిలో; శ్రేష్ఠమ్-మేలైనది; వృష్టి:-వర్షము; నివపతామ్-పితృతర్పణము చేయువానిలో; బీజమ్-విత్తనము; వరమ్-మేలైనది; ప్రతిష్ఠమానానామ్-ప్రతిష్ఠపొందగోరువారికి; గావ:-గోవులు; (శ్రేష్ఠమ్-మేలైనవి); ప్రసవతామ్-సంతానము కోరువారికి; పుత్ర:-కుమారుడు; వర:-శ్రేష్ఠుడు.

తా: దేవతలను తృప్తిపరచువానిలో వర్షము; పితృదేవతలను తృప్తిపరచువానిలో విత్తనము, ప్రతిష్ఠ పొందగోరువారికి ఆవులు, సంతానము కాంక్షించు వారికి పుత్రుడు శ్రేష్ఠములు.

వ్యా: శమము మొదలగునవియు, ప్రాణజయము మొదలగునవియు సాధ్యము కానివారికి యజ్ఞాదులే కర్తవ్యములు. అవి పితృయజ్ఞము, దైవయజ్ఞము మొదలైనవి. ఆ దృష్టితో ఇచ్చట సమాధానములను చెప్పుచున్నారు.

(1) ఆవపన మనగా - పూర్తిగా తృప్తిపరచుట.

ఆ విషయములో వర్షము సర్వశ్రేష్ఠమైనది. అది సర్వలోకమునకు ఉపకారము చేయునది గదా! దానివలన మానవుడు దైవ యజ్ఞాదులను సుఖముగా చేయగలుగును.

(2) నివాపమనగా పితృదేవతల కిచ్చెడు తర్పణము.

ఆ విషయములో శ్రేష్ఠమైనవి బీజములు-విత్తనములు, పాలములు, తోటలు మున్నగునవి పంటల నిచ్చును. కాన దానితో పితృక్రియలు నిశ్చింతగా చేయవచ్చునని తాత్పర్యము.

"ఆయుః ప్రజాం ధనం విద్యాం స్వర్గం మోక్షం సుఖాని చ
ప్రయచ్ఛన్తు తథా రాజ్యం ప్రీతా స్తుభ్యం పితామహాః"

అని స్మృతి చెప్పుచున్నది. పితామహులు-పితృదేవతలు మీకు ఆయువు, సంతానము, ధనము, విద్య, స్వర్గము, మోక్షము, ఇతరములైన సుఖములు, అట్లే రాజ్యము - అనువాని నిత్తురుగాక! అనగా శ్రాద్ధాదులలో తృప్తిపొందిన పితృదేవతలు వీనిని ప్రసాదింతురని భావము.

(3) ప్రతిష్ఠ మానానామ్-ఇక్కడనే ప్రతిష్ఠ పొందగోరువారికి అది కలిగించునవి గోవులు అనిభావము.

(4) ప్రసవతామ్ - సంతానము పొందగోరు వారికి పుత్రుడు శ్రేష్ఠుడు. కూతురు, కూతురుకొడుకు మున్నగు వారికంటె కన్నకొడుకే మేలు.

లోకములో గోవులు, పుత్రులు - వీనివలన కలిగెడు ఫలము ప్రత్యక్షమైనది. అయినను అతిథులను తృప్తిపరచుట, శ్రాద్ధములయందు దానముచేయుట మున్నగు కార్యములద్వారా వీనివలన పరోక్ష ఫలము సిద్ధించుచున్నదని తెలియదగును.

యక్ష ఉవాచ - యక్షుడిట్లనెను.

ఇన్ద్రియార్థా ననుభవన్ బుద్ధిమాన్ లోకపూజితః,
సంమతః సర్వభూతానా ముచ్ఛ్వసన్ కో న జీవతి. 57

అర్థ: ఇన్ద్రియ, ఆర్థాన్-శబ్దాదులగు విషయములను; అనుభవన్-అనుభవించుచు; బుద్ధిమాన్-బుద్ధిమంతుడగుచు; లోకపూజితః-లోకము మన్నన గొన్నవాడై; సర్వభూతానామ్-ప్రాణులన్నింటికి; సంమతః-ఇష్టుడగుచు; ఉచ్ఛ్వసన్-గాలి పీల్చుచు; న,జీవతి-జీవింపనివాడు; కః-ఎవడు?

తా: శబ్దాదులగు ఇంద్రియ విషయములను అనుభవించుచు బుద్ధిమంతుడై లోకముల మన్నన నందుకొనుచు సర్వప్రాణులకు ఇష్టుడే యగుచు బ్రదుకు చుండియు బ్రదుకని వాడెవ్వడు?

వ్యా: ఇంద్రియార్థములనగా శబ్దము, స్పర్శ, రూపము, రసము, గంధము అనునవి. లోకపూజిత:-ధనము, సంపద కలిగియున్న కారణమున లోకము గౌరవించును. సర్వభూతములకు సంమతుడు - దానములు చేయుచుండును కనుక.

అయినను బ్రదికియు చచ్చినవానితో సమానుడెవ్వడు అని ప్రశ్న.

యుధిష్ఠిర ఉవాచ - యుధిష్ఠిరు డిట్లు చెప్పెను.

దేవతాతిథి భృత్యానాం పితౄణా మాత్మన శ్చ య:,
న నిర్వపతి పఞ్చానా ముచ్ఛ్వసన్ న స జీవతి. 58

అర్థ: దేవతా, అతిథి, భృత్యానామ్-దేవతలకు, అతిథులకు, సేవకులకు; పితౄణామ్-పితృ దేవతలకు; ఆత్మన:-తనకు; పఞ్చానామ్-ఈ అయిదుగురికి; య:-ఎవడు; న నిర్వపతి-తర్పణము చేయడో; స:-అతడు; ఉచ్ఛ్వసన్-గాలి పీల్చుచుండియు; న జీవతి-జీవింపడు.

తా: దేవతలకు, అతిథులకు, భృత్యులకు, పితృదేవతలకు, తనకు తృప్తికరములైన యజ్ఞములు చేయనివాడు బ్రదికియు చచ్చినవాడే యగును.

వ్యా: మానవుడు ప్రతిదినము పంచయజ్ఞములు తప్పనిసరిగా చేయవలయును. అవి (1) బ్రహ్మయజ్ఞము (2) పితృయజ్ఞము (3) దేవయజ్ఞము (4) భూతయజ్ఞము (5) మనుష్య యజ్ఞము. ఎన్ని సంపదలున్నను, ఇతరములైన ఎన్ని మంచి కార్యములు చేసినను ఇవి చేయకున్నచో చచ్చినవానితో సమానమని భావము.

యక్ష ఉవాచ - యక్షు డిట్లనెను.

కింస్వి ద్గురుతరం భూమే: కింస్వి దుచ్చతరం చ ఖాత్,
కింస్వి చ్ఛీఘ్రతరం వాయో: కింస్వి ద్బహుతరం తృణాత్. 59

అర్థ: భూమే:-భూమికంటెను; గురుతరమ్-ఎక్కువ గొప్పతనము కలది; కింస్విత్-ఏది? ఖాత్-ఆకాశముకంటె; ఉచ్చతరమ్-ఎత్తైనది; కింస్విత్-ఏది; వాయో:-గాలికంటె; శీఘ్రతరమ్-వేగము కలది; కింస్విత్-ఏది; తృణాత్-గడ్డికంటె; బహుతరమ్-అధికమైనది; కింస్విత్-ఏది.

తా: భూమికంటె గొప్పది, ఆకాశముకంటె ఎత్తైనది, గాలికంటె వేగము కలది, గడ్డిపరక కంటె అధికమైనది ఏవి?

వ్యా: పై శ్లోకములో చెప్పిన యజ్ఞాది సాధనములందు శక్తిచాలనివాడు తల్లిదండ్రులను సేవించుట, మనస్సు నదుపు చేసికొనుట, గడ్డికంటె నీచమైన చింతను విడనాడుట

అనుపనులు చేయవలయునను తాత్పర్యముతో ఈ శ్లోకమునందలి ప్రశ్నలను యక్షుడడుగు చున్నాడు.

యుధిష్ఠిర ఉవాచ - యుధిష్ఠిరు డిట్లు చెప్పెను

మాతా గురుతరా భూమేः ఖాత్ పితోచ్చతర స్తథా,

మనः శీఘ్రతరం వాతా చ్చిన్తా బహుతరీ తృణాత్. 60

అర్థः భూమేः-భూమికంటె; గురుతరా-గొప్పది; మాతా-తల్లి; తథా-అట్లే; ఖాత్-ఆకాశముకంటె; ఉచ్చతరः-ఎత్తైనవాడు; పితా-తండ్రి; వాతాత్-గాలికంటె;శీఘ్రతరమ్-మిక్కిలి వేగము కలది; మనः-మనస్సు; తృణాత్-గడ్డిపరక కంటె; బహుతరీ-నీచత్వములో గొప్పది; చిన్తా-దుःఖము.

తాः భూమికంటె గొప్పది తల్లి. గగనముకంటె ఎత్తైన వ్యక్తి తండ్రి. గాలికంటె వడి కలది మనస్సు. గడ్డిపరకకంటె హీనమైనది చింత.

వ్యాः ఈ కారణములను బట్టి తల్లిదండ్రులకు శ్రద్ధాభక్తులతో సేవలు చేయుట, మనస్సును విచ్చలవిడిగా తిరుగనీకుండుట, చింతను దరికి చేరనీకుండుట అనునవి మానవుడు ప్రయత్నపూర్వకముగా చేయవలయునని ఉపదేశము.

యక్ష ఉవాచ - యక్షుడిట్లు పలికెను.

కిం స్విత్ సుప్తం న నిమిషతి కిం స్విజ్జాతం న చోపతి,

కస్యస్విద్ధృదయం నాస్తి కిం స్విద్వేగేన వర్ధతే. 61

అర్థः కింస్విత్-ఏది; సుప్తమ్-నిద్రించిన దయ్యు; న, నిమిషతి-కన్నుమూయదు; కింస్విత్-ఏది; జాతమ్-పుట్టియు; న, చోపతి-కదలదు; కస్యస్విత్-దేనికి; హృదయమ్-హృదయము; న, అస్తి-లేదు; కింస్విత్-ఏది; వేగేన-వేగముచేత; వర్ధతే-పెంపొందును.

తాः నిద్రించియు కన్నుమూయని దేది? పుట్టియు కదలని దేది? హృదయము లేని దేది? వేగముతో వృద్ధిపొందునదేది?

యుధిష్ఠిర ఉవాచ - యుధిష్ఠిరు డిట్లు చెప్పెను.

మత్స్యः సుప్తో ననిమిష స్తణ్డం జాతం నచోపతి,

అశ్మనో హృదయం నాస్తి నదీ వేగేన వర్ధతే. 62

అర్థः మత్స్యः-చేపःసుప్త-నిద్రించినదై యుండియు; న, నిమిషతి-తెప్పవాల్చదు; అణ్డమ్-గ్రుడ్డు; జాతమ్-పుట్టియు; న చోపతి-కదలదు; అశ్మనः-రాతికి; హృదయమ్-గుండె; న, అస్తి-లేదు; నదీ-నది; వేగేన-వేగముచేత; వర్ధతే-వృద్ధి పొందును.

తాः నిద్రించి కన్నుమూయనిది చేప. పుట్టి కదలనిది గ్రుడ్డు. హృదయములేనిది ఱాయి. వేగముతో వృద్ధి పొందునది నది.

వ్యా: వెనుక శ్లోకమున మనస్సును లయము చేసికొనవలయునని సూచించిరి. అట్లు మనసు నశించినచో మిగులునది శూన్యమే కదా! అని ఆశంకించి అట్లుకాదని నిరూపించుచున్నారు.

(1) మత్స్యః-చేప-చేపవంటి జీవుడని యర్థము. జాగ్రదవస్థ (మేలుకొని యున్నస్థితి) స్వప్నావస్థ-(నిద్ర)-అను ఈ రెండు దశలనడుమనో, ఈ లోకము పరలోకము అనువాని నడుమనో రెండు తీరముల నడుమ యందువలె తిరుగుచు, సుప్తః తన గూడు వంటి సత్స్వరూపముగల బ్రహ్మమును పొందియు; న నిమిషతి-మనస్సులోపించిన దృష్టి కలవాడు కాడు. ఈవిషయమున శ్రుతి యిట్లు చెప్పుచున్నది. "నహి ద్రష్టు ర్దృష్టే ర్విపరిలోపో విద్యతే వినాశిత్వాత్" - ద్రష్ట దృష్టికి పూర్తిలోపము లేదు. ఏలయన - అది - జీవుడు నశింపనిది కదా! నిద్రించి కన్నుమూయకుండుట అనగా నిట్టిస్థితి.

(2) అయినచో మత్స్యము వంటి జీవుడు నశింపనివాడు కావున పుట్టనివాడే యగును. ఇక పుట్టెడెదిఏది? అను ప్రశ్న పుట్టుచున్నది. దానికై రెండవ ప్రశ్న.

అండము - పిండము, బ్రహ్మాండము అనునది. విడివిడిగా ఒక్కొక్క జీవ స్వరూపమును పిండమనియు, సర్వలోకముల సముదాయమును బ్రహ్మాండ మనియు నందురు. ఈ రెండును ఇచట అండము. ఇది పుట్టియు, నచోపతి - కదలకున్నది. అనగా పిండాండ బ్రహ్మాండములు ఏర్పడియు తమంత తాము కదలజాలవు. పురుషుడే - పరమాత్మయే వానిని కదలించునని తాత్పర్యము. "కో హ్యే వాన్యాత్, కః ప్రాణ్యాత్ యదేష ఆకాశ ఆనందో నస్యాత్" - అని శ్రుతి' ఈ చిదాకాశరూపమైన ఆనందము అగు పరమాత్మ లేనిచో ఊపిరి వదలువాడెవడు? పీల్చువాడెవడు? అని దీని భావము. ఇట్లు పుట్టియు కదలనిది అండము.

(3) అయినచో పుట్టిన అండమునకు, పుట్టని జీవునకు సంయోగము కలుగుచున్నది. దానివలన దుఃఖమేర్పడుచున్నది. అది తొలగు ఉపాయమేమి? అనుభావముతో మూడవ ప్రశ్న హృదయము లేని దేది? అనునది పుట్టినది. దానికి సమాధానము - అశ్మనః - ఆతికి హృదయము లేదు అనునది. ఇచట ఆయి అనగా - మూడు దేహములు - స్థూలము, సూక్ష్మము, కారణము అనునవియే ఆత్మ అనుభావము పూర్తిగా నశించిన యోగి. అతడు ఆతి వంటివాడు. వానికి శోకమునకు గూడు అయిన హృదయము ఉండదు.

(4) నదీ వేగేన వర్దతే- అయినచో సమాధిస్థితి పొంది కూడ మరల బాహ్యస్థితికి ఎట్లు వచ్చుచున్నారు? అనుప్రశ్నకు ఇది సమాధానము.నది యనగా చిత్తమనెడు నది. అది వేగము చేత వృద్ధి పొందును. గాఢనిద్రలో ఉన్నవానికి కల వచ్చినట్లు సమాధి నుండి లేచిన వారికి ఈ ప్రపంచము చూపు ప్రసరించినంతనే ఏర్పడును. అనగా బాహ్యస్మృతి కలుగునని తాత్పర్యము.

యక్ష ఉవాచ - యక్షు డిట్లనెను.

కిం స్విత్ ప్రవసతో మిత్రం కింస్విన్మిత్రం గృహే సతః,
ఆతురస్య చ కిం మిత్రం కిం స్వి న్మిత్రం మరిష్యతః. 63

అర్థ: ప్రవసతః-ప్రయాణము చేయుచున్నవానికి; కింస్విత్-ఎవరు; మిత్రమ్-మిత్రము; గృహే-ఇంటియందు; సతః-ఉన్నవానికి; మిత్రమ్-మిత్రము; కింస్విత్-ఎవరు; ఆతురస్య-రోగికి; కింస్విత్-ఎవరు; మిత్రమ్-మిత్రము; మరిష్యతః-చనిపోవువానికి; కింస్విత్-ఎవరు; మిత్రమ్-మిత్రము.

తా: ప్రయాణించువానికి, ఇంటనుండు వానికి, రోగికి, మరణించువానికి మిత్రము లెవ్వరు?

యుధిష్ఠిర ఉవాచ - యుధిష్ఠిరు డిట్లుచెప్పెను.

సార్థ: ప్రవసతో మిత్రం భార్యా మిత్రం గృహే సతః,
ఆతురస్య భిష జ్మిత్రం దానం మిత్రం మరిష్యతః. 64

అర్థ:- సార్థ:-యాత్రికుల సముదాయము; ప్రవసతః-ప్రయాణము చేయువానికి; మిత్రమ్-మిత్రము; భార్యా-భార్య; గృహే-ఇంటి యందు; సతః-ఉన్నవానికి; మిత్రమ్-మిత్రము; భిషక్-వైద్యుడు; ఆతురస్య-రోగము కలవానికి, మిత్రమ్-మిత్రము; దానమ్-దానము; మరిష్యతః-చనిపోవుచున్నవానికి; మిత్రమ్-మిత్రము.

తా: యాత్రికుల గుంపు యాత్రికునకు, భార్య గృహస్థునకు, వైద్యుడు రోగికి, దానము మరణించుచున్న వానికి మిత్రములు.

వ్యా: మనస్సును నిలుప శక్తిలేనివానికి దానమే శ్రేయమని యిందు తాత్పర్యము. యాత్రికునకు సార్థము, గృహస్థునకు గృహిణి, రోగికి వైద్యుడు ఎట్లు తోడ్పడుదురో పరలోకమున కరుగు వానికి ఈ లోకమున చేసిన దానము మిత్రునివలె వచ్చి ఉద్ధరించునని భావము.

యక్ష ఉవాచ - యక్షు డిట్లనెను.

కోఽతిథి: సర్వభూతానాం కిం స్వి ద్ధర్మం సనాతనమ్,
అమృతం కింస్వి ద్రాజేంద్ర కిం స్విత్ సర్వమిదం జగత్. 65

అర్థ: రాజేంద్ర-రాజశ్రేష్ఠా! సర్వభూతానామ్-భూతములన్నింటికి; అతిథి:-అతిథి; క:-ఎవడు; సనాతనమ్-సనాతనమైన; ధర్మమ్-ధర్మము; కిం స్విత్-ఏది; అమృతమ్-అమృతము, కింస్విత్-ఏది; సర్వమ్-మొత్తమైన; ఇదమ్-ఈ; జగత్-జగత్తు, కింస్విత్-ఏది.

తా: రాజా! సర్వభూతములకు అతిథి ఎవరు? సనాతమైన ధర్మమేది? అమృతమనగా నేమి? ఈ మొత్తము జగత్తు ఏమి?

యుధిష్ఠిర ఉవాచ - యుధిష్ఠిరు డిట్లు చెప్పెను.

అతిథిః సర్వభూతానా మగ్నిః సోమో గవామృతమ్,
సనాతనోఽమృతో ధర్మో వాయుః సర్వమిదం జగత్. 66

అర్థః సర్వభూతానామ్-సర్వభూతములకు; అతిథిః-అతిథి; అగ్నిః-అగ్ని; సోమః-సోమము (సోమ రసము); గవామృతమ్-గోవుల పాలు; సనాతనః-అన్నింటికన్న ప్రాచీనమైన; ధర్మః-ధర్మము; అమృతః-అమృతము; ఇదమ్-ఈ; సర్వమ్-సమస్తమైన; జగత్-జగత్తు; వాయుః-వాయువు.

తాత్పర్యః సర్వభూతములకు అతిథి అగ్ని. సోమము గోక్షీరము. సనాతన ధర్మమే అమృతము. ఈ సకల జగత్తు వాయువు.

వ్యాఖ్యాః చిత్తశుద్ధి మార్గమున దానము యజ్ఞమునందు, చిత్త ఏకాగ్రత ద్వారా యజ్ఞాదికము సమష్టి ఉపాసనమునందు ప్రవృత్తి హేతువులగుటను నిరూపించుచున్నారు.

(1) అతిథిః - అగ్ని ఆహవనీయము, దక్షిణము, గార్హపత్యము అను మూడు విధములైన అగ్నులే సర్వభూతములకు అతిథులు. అనగా వీనిని దేవభావముతో పూజింపవలయునని ఫలితార్థము.

(2) గవామృత మనగా పాలు. అదియే యజ్ఞము నందలి సోమరసము వంటిది. దానిని (దాని నుండి యేర్పడు నేయి మున్నగు దానిని) అగ్ని యందు హోమము చేయవలయునని భావము.

(3) సనాతనము అనగా నిత్యము. నిత్యమైన ధర్మము అమృతము - మోక్షమునకు కారణమైన దానిని ఆచరించుటయే సనాతన ధర్మము.

(4) మోక్షమునకు మార్గ మేమియో నిరూపించుచున్నారు. 'వాయుః సర్వ మిదం జగత్' - 'వాయు రేవ వ్యష్టి ర్వాయు రేవ సమష్టిః' అని శ్రుతి. పిండము, బ్రహ్మాండములే ఇచట వాయు రూపమున చెప్పబడుచున్నవి. వీనిని గురించిన చక్కని జ్ఞానమే మోక్ష ద్వారమని తాత్పర్యము.

యక్ష ఉవాచ - యక్షు డిట్లనెను.

కింస్వి దేకో విచరతే జాతః కో జాయతే పునః,
కింస్వి ద్dimasya భైషజ్యం కింస్విదావపనం మహత్. 67

అర్థః ఏకః-ఒక్కటియై, విచరతే-సంచరించు చుండునది, కింస్విత్-ఏది, జాతః-పుట్టినదై, పునః-మరల, జాయతే-పుట్టును, కః-ఏది, హిమస్య-మంచునకు, భైషజ్యమ్-మందు, కింస్విత్-ఏది, మహత్-గొప్పదియగు, ఆవపనమ్-బీజముల స్థానము, కింస్విత్-ఏది.

యుధిష్ఠిర ఉవాచ - యుధిష్ఠిరు డిట్లు చెప్పెను.

సూర్య ఏకో విచరతే చంద్రమా జాయతే పునఃr,
అగ్ని ర్హిమస్య భైషజ్యం భూమి రావపనం మహత్. 68

అర్థః సూర్యఃr-సూర్యుడు, ఏకఃr-ఒక్కడు, విచరతే-సంచరించుచుండును, చంద్రమాఃr-చంద్రుడు, పునఃr-మరల, జాయతే-పుట్టును, అగ్నిఃr-అగ్ని, హిమస్య-మంచునకు, భైషజ్యమ్-మందు, భూమిఃr-భూమి, మహత్-గొప్పదియగు, ఆవపనమ్-బీజముల స్థానము.

తాr: ఒక్కడై ఎల్లపుడు సంచరించువాడు సూర్యుడు. మరల పుట్టువాడు చంద్రుడు. హిమమునకు మందు అగ్ని. గొప్ప ఆధారము భూమి.

వ్యా : వెనుకటి శ్లోకమునందు పిండాండ బ్రహ్మాండముల సముదాయము వాయువు అనియు అదియే సర్వ జగత్తు అనియు తెలిసికొంటిమి. ఆ వాయువు లయము చెందిన పిదప మిగులునది ఏది? అను దానికి సమాధానము చెప్పుచున్నారు.

(1) సూర్య ఏకోవిచరతే - సూర్యునివలె జ్ఞానప్రకాశరూపమైన ఆత్మ ఒక్కటియే జాగ్రత్ స్వప్న సుషుప్తి దశలయందు ఉండును.

(2) సూర్యునికి అస్తమయము ఉన్నట్లు ఆత్మ గోచరము కాని సమయములో ప్రపంచము ప్రకాశించుట దేనివలన అనుదానికి సమాధానముగా "చంద్రమా జాయతే పునఃr" అని చెప్పుచున్నారు. 'చన్ద్రమా మనోభూత్వా' - ఇత్యాదిశ్రుతివచనము వలన మనస్సే అవిద్యావశమువలన ఏర్పడుచున్నది. మరియు నది దుఃఖమును కలిగించు ప్రపంచమును కల్పించు చున్నది.

(3) ఈ అవిద్య నశించు ఉపాయమును మూడవ ప్రశ్నకు సమాధానముగా చెప్పుచున్నారు. "అగ్ని ర్హిమస్య భైషజ్యమ్" - ఇచట హిమమనగా సూర్యుని కప్పివేయు మంచువంటి అజ్ఞానమనెడు జబ్బు. ఆరోగమునకు మందు అగ్ని. 'అగ్నిర్వాగ్భూత్వా' - ఇత్యాది శ్రుతివలన 'తత్త్వమసి' మున్నగు ఉపనిషద్వాక్యమే ఇచట అగ్ని. అది పైని చెప్పిన హిమమును పారద్రోలునది.

(4) ఆవపనము - నిధానపాత్రము ఏది? అను ప్రశ్నకు సమాధానము 'భూమి' - భూమి అనగా ఇచట శరీరము. అది విద్యకు, అవిద్యకు నెలవు. సంసారిలక్షణమునకు వలె సంసారములేని బ్రహ్మ భావమును కూడ భూమి వంటి దేహమునందే సాక్షాత్కరింపచేసి కొనవలయునని తాత్పర్యము.

ఇంతవరకు పండ్రెండు శ్లోకములలోని ప్రశ్నోత్తరముల విభాగము, విశ్లేషము ఈ క్రింది విధముగా నున్నది.

మొదటి రెండు శ్లోకములు బ్రహ్మవిద్యకు సంబంధించిన సూత్రమును సాధన సహితముగా చెప్పినవి.

అటుపై ఏడు శ్లోకములు 'త్వమ్' పదార్థమును అనగా జీవలక్షణమును ప్రతిపాదించినవి. తరువాతి మూడు 'తత్' పదార్థమును గూర్చి - అనగా పరమాత్మను గూర్చి వివరించినవి. ఈ రెంటికి సాధనములను కూడ ఈ పదిశ్లోకములు వివరించినవి.

ఇటుపై తొమ్మిది శ్లోకములతో మరియొక విధముగా సాధనములను నిరూపించుచు 'తత్', 'త్వమ్' (అది, నీవు) పదార్థముల భేదములేని స్థితిని - 'తత్త్వమసి', 'అహం బ్రహ్మాస్మి' మొదలగు మహావాక్యములు ప్రతిపాదించు జ్ఞానమును - వివరించుచున్నారు.

యక్ష ఉవాచ - యక్షుడిట్లు పలికెను.

కింస్వి దేక పదం ధర్మ్యం కింస్వి దేకపదం యశః,
కింస్వి దేకపదం స్వర్గ్యం కింస్వి దేకపదం సుఖమ్. 69

అర్థ: ఏకపదమ్-ఒక్కటియే పర్యవసానమునకు స్థానమైన; ధర్మ్యమ్-ధర్మమునుండి తొలగనిది; కింస్విత్-ఏది; ఏకపదమ్-ఒక్కటియే తుది మెట్టుగాగల; యశ:-యశస్సు-కీర్తి; కింస్విత్-ఏది; ఏకపదమ్-ఒకే ఒక్క పరమ లక్ష్యముగల; స్వర్గ్యమ్-స్వర్గమునుండి తొలగనిది; కింస్విత్-ఏది; ఏకపదమ్- ఒక్కటియే చివరి విశ్రాంతి స్థానమగు; సుఖమ్-సుఖము; కింస్విత్-ఏది.

తా: చిట్టచివరి ధర్మ్యము, యశస్సు, స్వర్గ్యము, సుఖము ఏవి?

యుధిష్ఠిర ఉవాచ-యుధిష్ఠిరు డిట్లు చెప్పెను.

దాక్ష్య మేకపదం ధర్మ్యం దాన మేకపదం యశ:,
సత్య మేకపదం స్వర్గ్యం శీల మేకపదం సుఖమ్. 70

అర్థ: దాక్ష్యమ్-దక్షత; ఏకపదమ్-చివరిస్థానముగల; ధర్మ్యమ్-ధర్మమును తప్పనిస్థితి; దానమ్-దానము; ఏకపదమ్-తుదిమెట్టు అయిన; యశ:-యశస్సు; సత్యమ్-సత్యము; ఏకపదమ్-ఒకే పరమ లక్ష్యముగాగల; స్వర్గ్యమ్-స్వర్గమును తొలగింపని మార్గము; శీలమ్-శీలము; ఏకపదమ్-ఒక్కటియే పర్యవసానమైన; సుఖమ్-సుఖము

తా: దక్షతయే పరమ ధర్మము. దానమే పరమకీర్తి. సత్యమే పరమ స్వర్గము. శీలమే పరమ సుఖము.

వ్యా: ఏక పదమనగా ఒక్కటియే యయిన పర్యవసాన స్థానము. పరమ లక్ష్యమని తాత్పర్యము. ఏకపదమైన ధర్మ్యము దక్షత-అనగా దక్షతయందు సర్వ ధర్మములు పర్యవసించును-చేరుకొనును అని భావము.

ఇట్లే కీర్తులన్నింటికి చరమలక్ష్యము దానమనియు, సత్యమును మించిన స్వర్గము లేదనియు, శీలము కంటె మించిన సుఖము లేదనియు శ్లోకతాత్పర్యము. దాక్ష్యము-అనగా ఉద్యోగము. ఆయా కార్యములను సమర్థతతో చేయగల శక్తి.

యక్ష ఉవాచ - యక్షు డిట్లు పలికెను.

కిం స్వి దాత్మా మనుష్యస్య కింస్వి ద్దైవకృతః సఖా,
ఉపజీవనం కింస్వి దస్య కింస్విదస్య పరాయణమ్. 71

అర్థః మనుష్యస్య-మనుష్యునికి; ఆత్మా-ఆత్మ; కింస్విత్-ఏది; దైవకృతః-దైవము ఏర్పరచిన; సఖా- మిత్రము; కింస్విత్-ఎవరు; అస్య-ఈమనుజునకు; ఉపజీవనమ్-బ్రదుకు తెరువు; కింస్విత్-ఏది; అస్య-ఇతనికి; పరాయణమ్- చిట్టచివరి గతి; కింస్విత్- ఏది.

తాః మనుష్యునికి ఆత్మ ఏది? అతనికి దైవమిచ్చిన మిత్రమెవరు? అతడు దేనిపై ఆధారపడి బ్రదుకును? అతని పరమ కర్తవ్యమేమి?

వ్యాః పై శ్లోకమున చెప్పిన ఉద్యోగము, దానము, సత్యము, శీలము అనువానిని మానవుడు సేవింపవలయును. కాని ఈ అన్నింటిలో పరమోత్తమమైన దేది? అని ఈ శ్లోకమునందలి ప్రశ్నల తాత్పర్యము.

యుధిష్ఠిర ఉవాచ-యుధిష్ఠిరు డిట్లు చెప్పెను.

పుత్ర ఆత్మా మనుష్యస్య భార్యా దైవకృతః సఖా,
ఉపజీవనం చ పర్జన్యో దాన మస్య పరాయణమ్. 72

అర్థ: మనుష్యస్య-మనుష్యునకు; ఆత్మా-ఆత్మ; పుత్రః-కొడుకు; దైవకృతః-దైవముచేసిన; సఖా- చెలి; భార్యా-భార్య; చ-మరియు; ఉపజీవనమ్-బ్రదుకున కాధారమైనది; పర్జన్యః-వర్షాధిదేవత; అస్య-ఈతనికి; పరాయణమ్-పరమ కర్తవ్యము; దానమ్-దానము.

తాః కొడుకే మనుజునకు ఆత్మ. భార్య దైవ మిచ్చిన మిత్రము. మేఘము జీవనాధారము. దానమే పరమ కర్తవ్యము.

వ్యాః పుత్రునివలె ఆత్మ, భార్యవలె సఖి, మేఘమువలె జీవనాధారము అయినది దానమే అని తాత్పర్యము. ఏలయన దానమే ఆత్మ జ్ఞానమును కలిగించును. దానము వలన కలుగు ఫలము రమణీయమై యుండును. 'నాదత్త ముపజీవతి'-దానమీకుండుట జీవనాధారమును చెరచునది యనుమాట చొప్పున అదియే బ్రదుకుబాట అని తెలియ వచ్చుచున్నది.

యక్ష ఉవాచ-యక్షు డిట్లు అడిగెను.

ధన్యానా ముత్తమం కింస్విద్ ధనానాం స్యాత్ కిముత్తమమ్,
లాభానా ముత్తమం కింస్యాత్ సుఖానాం స్యాత్ కిముత్తమమ్. 73

అర్థ: ధన్యానామ్-ధనమునకు మేలు కూర్చువానిలో; ఉత్తమమ్-శ్రేష్ఠమైనది; కింస్విత్-ఏది; ధనానామ్-ధనములలో, ఉత్తమమ్-ఉత్తమము; కింస్విత్-ఏది; లాభానామ్-లాభములలో; ఉత్తమమ్-గొప్పది; కిమ్-ఏది; స్యాత్ అగును, సుఖానామ్-సుఖములలో, ఉత్తమమ్-అన్నింటికంటె మిన్న అయినది, కిమ్-ఏది, స్యాత్-అగును.

తా : ధన్యములలో, ధనములలో, లాభములలో, సుఖములలో ఉత్తమములైనవి ఏవి?

యుధిష్ఠిర ఉవాచ - యుధిష్ఠిరు డిట్లు చెప్పెను.

ధన్యానా ముత్తమం దాక్ష్యం, ధనానా ముత్తమం శ్రుతమ్,
లాభానాం శ్రేయ ఆరోగ్యం సుఖానాం తుష్టి రుత్తమా. 74

అర్థ : ధన్యానామ్-ధన్యములలో, ఉత్తమమ్-మిక్కిలి గొప్పది, దాక్ష్యమ్-ఉద్యోగము, ధనానామ్-ధనములలో, ఉత్తమమ్-మిక్కిలి గొప్పది, శ్రుతమ్-విద్య, లాభానామ్-లాభములలో, శ్రేయ:-మేలైనది, ఆరోగ్యమ్-రోగము లేకుండుట, సుఖానామ్-సుఖములలో, ఉత్తమా-మిక్కిలి గొప్పది, తుష్టి:-సంతోషము.

తా : ధన్యమైన వానిలో మిక్కిలి శ్రేష్ఠమైనది కార్యములను చక్కగా నిర్వహించెడు ఉద్యోగము. ధనములలో ఉత్తమమైనది చదువు. లాభములలో అన్నింటికంటె మిన్నయైనది ఆరోగ్యము. సుఖములలో పరమమైనది సంతోషము.

వ్యా : ధన్యమనగా ధనమునకు మేలు చేయునది. ధనము కూడ శ్రుతమే - అనగా వేదాద్యధ్యయనమే. సువర్ణము మొదలగునది కాదు. ఆరోగ్యము గొప్ప లాభము. ఏలయన ఏ లోపము లేకుండ చేయగలదని తాత్పర్యము. తుష్టి అనగా సంతోషము.

ఉద్యోగము, అధ్యయనము, ఆరోగ్యము, సంతోషము అనునవి జ్ఞానమునందు ఉపకరించునని భావము.

యక్ష ఉవాచ - యక్షు డిట్లనెను.

కశ్చ ధర్మ: పరో లోకే కశ్చ ధర్మ: సదాఫల:,
కిం నియమ్య న శోచన్తి కైశ్చ సంధి ర్న జీర్యతే. 75

అర్థ : లోకే-లోకమునందు, పర:-అతిశ్రేష్ఠమగు, ధర్మ:-ధర్మము, క:-ఏది, సదాఫల:-ఎల్లవేళల ఫలమొసగు, ధర్మ:-ధర్మము, క:-ఏది, కిమ్-దేనిని, నియమ్య-అదుపున నుంచుకొని; న, శోచన్తి-శోకింపరు? కై:-ఎవరితో, సంధి-సంధి, న జీర్యతే-చెడిపోదు.

తా : లోకమున పరమమైన ధర్మమేది? నశింపని ఫలము నిచ్చు ధర్మమేది? దేనిని అదుపున పెట్టుకొన్నచో శోకము కలుగదు? ఎట్టివారితో సంధి చెడిపోకుండును?

యుధిష్ఠిర ఉవాచ - యుధిష్ఠిరు డిట్లు చెప్పెను.

ఆనృశంస్యం పరో ధర్మ స్త్రయీ ధర్మ: సదాఫల:,
మనో యమ్య న శోచన్తి సన్ది: సద్భి ర్న జీర్యతే. 76

అర్థ : ఆనృశంస్యమ్-సర్వ భూతములయందలి కరుణ, పర:-మిక్కిలి గొప్పదియగు, ధర్మ:-ధర్మము; త్రయీ-వేదమంత్రము; సదా ఫల:-శాశ్వతమైన ఫలము నిచ్చెడు; ధర్మ:-ధర్మము, మన:-మనస్సును, యమ్య-వశపరచుకొని, న శోచన్తి-దు:ఖింపరు, సద్భి:-సజ్జనులతో, సన్ది:-కలయిక, న జీర్యతే-చెడదు.

తా : సర్వ భూతములయందు కృప కలిగి ఉండుటయే పరమ ధర్మము. వేద మంత్రమే శాశ్వత ఫలము నిచ్చు ధర్మము. మనస్సును నియమించుటవలన శోకము లేని స్థితి కలుగును. సజ్జనులతోడి సంధి ఎన్నటికిని చెడదు.

వ్యా : (1) ఆనృశంస్యమ్ - క్రూరత లేకుండుట. సర్వభూతములకు తన వలన అభయము సిద్ధించుట. సంన్యాసమని భావము. అదియే పరమ ధర్మము.

(2) త్రయీ - మోక్ష మంత్రము త్రయి' అని వేదము చెప్పుచున్నది. కావున ఇచట త్రయీ శబ్దముచేత మూడు మాత్రలు గల ప్రణవమును గ్రహింపవలయును. దాని నాశ్రయించిన ధర్మమనగా అకార ఉకార మకారములకు అర్థములయిన స్థూల సూక్ష్మ కారణ దేహములను పూర్వ పూర్వములను ఉత్తరోత్తరములయందు లయము చేసి - అనగా స్థూలమును సూక్ష్మమందు, సూక్ష్మమును కారణమునందు నామరూపములు లేకుండ కలసి పోవునట్లు చేసి, ఆ మొత్తమును నాలుగవదియగు అర్ధమాత్ర యందు - ప్రణవము తరువాత నిలుచు నిశ్శబ్ద రూపమైన దానియందు - లయ మొనరించుట. ఆ అర్ధమాత్రమే బ్రహ్మము. దానియందు ఉండుట అనునది సదా ఫలము - శాశ్వత మగు ఫలము నొసగునది. ఏలయన అట్లుండుటయే మోక్షమునకు కారణము.

(3) దానిని పొందించు ఉపాయము మనస్సును నిగ్రహించుట. ఆ నిగ్రహము వలననే సాధకుడు ఆత్మతత్వమును తెలిసినవాడై 'తరతి శోక మాత్మవిత్' అనిన దానిని బట్టి సంసారము వలన కలిగెడు శోకమును దాటును - పొందకుండును.

(4) మనో నిగ్రహమునకు మార్గమేది? అనుదానికి 'సత్పురుషులతోడి సంధి' అనునది సమాధానము. మనో నిగ్రహ మార్గమును నిండైన కృపగల సత్పురుషులే - జ్ఞాన సంపన్నులైన ఆచార్యులే - చూపవలయునని తాత్పర్యార్థము.

యక్ష ఉవాచ - యక్షు డిట్లు అనెను.

కిం ను హిత్వా ప్రియో భవతి కిం ను హిత్వా న శోచతి,
కిం ను హిత్వాఽ ర్థవాన్ భవతి కిం ను హిత్వా సుఖీ భవేత్. 77

అర్థ : కిమ్, ను-దేనిని; హిత్వా-వదలి; ప్రియ:-ఇష్టుడు; భవతి-అగును; కిమ్; ను-దేనిని; హిత్వా-వదలి; న; శోచతి-దు:ఖింపడు; కిమ్; ను-దేనిని, హిత్వా-వదలి; అర్థవాన్-ప్రయోజనము కలవాడు; భవతి-అగును, కిమ్, ను-దేనిని, హిత్వా-వదలి, సుఖీ-సుఖము కలవాడు, భవత్-అగును.

తా : వేనిని వదలి మనుజుడు, ప్రియుడు, దు:ఖము లేనివాడు, ప్రయోజనము పొందినవాడు, సుఖవంతుడు అగును?

వ్యా : మనస్సును నిగ్రహించుట యందు స్పష్టముగా కానిపించు ద్వారము 'మానము' మొదలగు నాల్గింటిని విడనాడుట అని తెలుపుటకై ఈ ప్రశ్నలు పుట్టినవి.

యుధిష్ఠిర ఉవాచ - యుధిష్ఠిరు డిట్లు చెప్పెను.

మానం హిత్వా ప్రియో భవతి క్రోధం హిత్వా న శోచతి,
కామం హిత్వాఽ ర్థవాన్ భవతి లోభం హిత్వా సుఖీ భవేత్. 78

అర్థ : మానమ్-తన్నుదాను గొప్పగా తలపోయుటను, హిత్వా-వదలి, ప్రియ:-(జనులకు) ఇష్టుడు, భవతి-అగును, క్రోధమ్-తీవ్రమైన కోపమును, హిత్వా-వదలి, న, శోచతి-శోకింప కుండును, కామమ్-కామమును, హిత్వా-వదలి, అర్థవాన్-ప్రయోజనవంతుడు, భవతి-అగును, లోభమ్-అత్యాశను, హిత్వా-వదలి, సుఖీ-సుఖము కలవాడు, భవేత్-అగును.

తా : తన్నుతాను గొప్పగా భావించుటను వదలి మనుజుడు జనులకు ప్రియుడగును. క్రోధమును వదలి దుఃఖము లేని వాడగును. కామమును వదలి భాగ్యవంతు డగును. అత్యాశను వదలి సుఖవంతుడగును.

యక్ష ఉవాచ - యక్షు డిట్లనెను.

కిమర్థం బ్రాహ్మణే దానం కిమర్థం నటనర్తకే,
కిమర్థం చైవ భృత్యేషు కిమర్థం చైవ రాజసు. 79

అర్థ : బ్రాహ్మణే-బ్రాహ్మణునియందు, దానమ్-దానము, కిమ్, అర్థమ్-ఏ ప్రయోజనము కొరకు, నటనర్తకే-నటులు, నర్తకులు మున్నగు వారియందు, కిమర్థమ్- దానమెందుకొరకు, చ, ఏవ-మరియు, భృత్యేషు-సేవకులయందు, కిమర్థమ్-ఎందుకు, రాజసు-రాజుల యందు, కిమర్థమ్-ఎందుకు.

తా : బ్రాహ్మణునకు, నటవర్తకులకు, భృత్యులకు రాజులకు దాన మేల ఈయ వలయును?

వ్యా : వెనుకటి శ్లోకమున చెప్పిన మానాది త్యాగములకు ధర్మమే ఫలము. కావున బ్రహ్మజ్ఞాన సంపద కలవానియందు చేసిన దానమే ధర్మ హేతువు కనుక ఉపకరించును. తక్కిన యెడల చేసిన దానము అట్లు కాదని తెలుపుటకై యీ ప్రశ్నలు పుట్టినవి.

యుధిష్ఠిర ఉవాచ - యుధిష్ఠిరు డిట్లు చెప్పెను.

ధర్మార్థం బ్రాహ్మణే దానం యశోఽ ర్థం నటనర్తకే,
భృత్యేషు భరణార్థం వై భయార్థం చైవ రాజసు. 80

అర్థ : బ్రాహ్మణే-బ్రాహ్మణునియందు, దానమ్-దానము, ధర్మార్థమ్-ధర్మము కొఱకు, నటనర్తకే-నటులు, నర్తకులు అనువారియందు, యశస్-అర్థమ్-కీర్తి కొరకు, భృత్యేషు-సేవకులయందు, భరణార్థమ్, వై-పోషణ కొరకు, రాజసు-రాజులయందు, భయార్థమ్-భయము వలన.

తా : ధర్మము కొఱకు బ్రాహ్మణులకు, కీర్తికొరకు నటనర్తకులకు, పోషింప వలయును గాన సేవకులకు, భయమును పోగొట్టుకొనుటకు రాజులకు దానము చేయవలయును.

యక్ష ఉవాచ - యక్షు డిట్లనెను.

కేనస్వి దావృతో లోకః కేనస్వి న్నప్రకాశతే,
కేన త్యజతి మిత్రాణి కేన స్వర్గం నగచ్ఛతి. 81

అర్థ : లోకః-లోకము, కేనస్విత్-దేనిచేత, ఆవృతః-కప్పబడినది, కేనస్విత్-దేనిచేత, న, ప్రకాశతే-ప్రకాశింపదు, కేన-దేనిచేత, మిత్రాణి-మిత్రములను, త్యజతి-వదలుచున్నది, కేన-దేనిచేత, స్వర్గమ్-స్వర్గమునకు, న, గచ్ఛతి - పోదు.

తా : లోకము దేనిచేత ఆవరింపబడి యున్నది? దేనిచేత ప్రకాశము పొందకున్నది. ఏకారణము చేత మిత్రులను వదలివేయుచున్నది? ఏ కారణమున స్వర్గమునకు పోదు?

యుధిష్ఠిర ఉవాచ - యుధిష్ఠిరుడు ఇట్లు చెప్పెను.

అజ్ఞానే నావృతో లోక స్తమసా న ప్రకాశతే,
లోభా త్త్యజతి మిత్రాణి సఙ్గాత్ స్వర్గం నగచ్ఛతి. 82

అర్థ : లోకః-లోకము, అజ్ఞానేన-అజ్ఞానముచేత, ఆవృతః-కప్పబడి యున్నది, తమసా-చీకటిచేత, న, ప్రకాశతే-ప్రకాశింపకున్నది, లోభాత్-లోభమువలన, మిత్రాణి-మిత్రములను, త్యజతి-వదలును, సఙ్గాత్-మమకారము వలన, స్వర్గమ్-స్వర్గమునకు, న, గచ్ఛతి-పోదు.

తా : అజ్ఞానము లోకమును క్రమ్మివేసియున్నది. చీకటివలన లోకము ప్రకాశింప కున్నది. లోభమువలన నరుడు మిత్రులను వదలివేయును. మమకారము వలన స్వర్గము నందకున్నాడు.

వ్యా : దాన బలము వలన మానాదులను సాధకుడు జయించును. దానివలన మనస్సును నిగ్రహించును. అది ఆత్యంతికమైన (ఎల్లవేళల నుండెడి) దుఃఖము నశించుటకు హేతువగును. మఱియొక ప్రవిలాపన రూపమైన త్రయీధర్మము వలన ప్రయోజన మేమి? అని శంకించి సమాధానము చెప్పుచున్నారు.

అజ్ఞానమువలన ఏర్పడిన స్థూల సూక్ష్మ శరీరములు రెండును, ముదిమి, చావు, శోకము, మోహము మొదలగు వానిని ఆశ్రయించి దీనిని లోకించుచున్నవి - చూచు చున్నవి కనుక లోకమనగా ఆత్మ. ఇది ఆవృతమైనది. కప్పబడినది. భ్రమవలన నేర్పడిన పాము త్రాటిని కప్పివేసినట్లు అజ్ఞానము చేత ఆత్మ తిరోహితమైనది. (కప్పబడినది) కావున అజ్ఞానము తొలగిపోవుటకు త్రయీధర్మము తప్పనిసరిగా కావలయును. అయినచో సుషుప్తి దశలో (గాఢనిద్రలో) స్థూల సూక్ష్మదేహములు ఉండవు కనుక అజ్ఞానము తప్పనిసరిగా నశించును గదా ఇక త్రయీ ధర్మమేల? అని మరల శంక కలుగును.

తమసా - ఇచట తమస్సు అనగా మూలాజ్ఞానము. అది సుషుప్తిలో కూడ క్రమ్మివేయును. కనుక ఆత్మకు ప్రకాశము లేదు. కావున స్థూలసూక్ష్మ కారణ శరీరములను మూడింటిని ప్రవిలాపనము (కరగించుట) చేయనే వలయును.

జ్ఞానమునకు అజ్ఞానమునకు విరోధము. కనుక అజ్ఞానము వలన ఏర్పడిన సంసారము, మనస్సు నరికట్టుటద్వారా, నశింపదు. మనస్సు కల్పించుకొన్న పాము పూర్తిగా మనస్సు నుండి తొలగి ఇది త్రాడే అని నిశ్చయము కలిగినప్పుడే పామువలన కలిగెడు భయము తొలగిపోవు విధమున మూడు దేహములు దృష్టి నుండి పూర్తిగా తొలగి స్వరూప జ్ఞానము కలిగినపుడే సమూలమైన సంసారము నశించునని భావము. కావున అట్టి నాశనమునకు ఆటంకములైన లోభ సంగములను రూపుమాపి జ్ఞానమునే సాధింపవలయునని యీ శ్లోకతాత్పర్యము.

యక్ష ఉవాచ - యక్షు డిట్లనెను.

మృతః కథం స్యాత్ పురుషః కథం రాష్ట్రం మృతం భవేత్,
శ్రాద్ధం మృతం కథం వా స్యాత్ కథం యజ్ఞో మృతో భవేత్. 83

అర్థ : పురుషః-జనుడు, కథమ్-ఎట్లు, మృతః-మరణించినాడు, స్యాత్-అగును, రాష్ట్రమ్-దేశము, కథమ్-ఎట్లు, మృతమ్-చచ్చినది, భవేత్-అగును, శ్రాద్ధమ్-శ్రాద్ధము, కథమ్, వా-ఎట్లు, మృతమ్-వినాశమైనది, స్యాత్-అగును, యజ్ఞః-యజ్ఞము, కథమ్-ఎట్లు, మృతః-నశించినది, భవేత్-అగును.

తా: పురుషుడు మరణించుట యనగా నేమి? రాష్ట్రము, శ్రాద్ధము, యజ్ఞము అనువాని చావనగా నెట్టిది?

యుధిష్ఠిర ఉవాచ - యుధిష్ఠిరు డిట్లు చెప్పెను.

మృతో దరిద్రః పురుషో మృతం రాష్ట్ర మరాజకమ్,
మృత మశ్రోత్రియం శ్రాద్ధం మృతో యజ్ఞ స్వదక్షిణః. 84

అర్థ : పురుషః-జనుడు, దరిద్రః-దరిద్రుడగునేని, మృతః-చచ్చినవానితో సమానము, రాష్ట్రమ్-దేశము, అరాజకమ్-రాజులేనిదగునేని, మృతమ్-చచ్చినదాని వంటిదగును, శ్రాద్ధమ్-శ్రాద్ధము, అశ్రోత్రియమ్-వేదవేత్తలగు బ్రాహ్మణులు లేనిదైనచో, మృతమ్-నశించినదగును, యజ్ఞః-యజ్ఞము, అదక్షిణః, తు-సరియగు దక్షిణలు లేనిదయ్యేనేని, మృతః-నశించి నదగును.

తా : దరిద్రుడగు పురుషుడు, రాజులేని దేశము, వేదవేత్తలు లేని శ్రాద్ధము, దక్షిణలు లేని యజ్ఞము చచ్చినవానితో సమానము.

వ్యా : లోభము, మమకారము అనువాని దోషమును చెప్పుచున్నారు. దరిద్రుడనగా లుబ్ధమైన చిత్తము కలవాడు. అతడు దాన ధర్మాదులు చేయలేని వాడగుట వలన చచ్చిన వాడే యగును.

దానికి దృష్టాంతముగా తక్కినవానిని చెప్పుచున్నారు. ఇచట రాష్ట్రమనగా శరీరము. ప్రాణమనెడు భూమి పతికి ఆది సంచార స్థానము కదా! అది అరాజకమైనచో-ప్రాణములేని దైనచో-ఏవిధముగా శరీరము శవమగునో యట్లే దరిద్రుడు బ్రతికి యుండియు చచ్చిన వాడగునని భావము. తక్కిన రెండు దృష్టాంతములును-శ్రోత్రియుడులేని శ్రాద్ధము, దక్షిణలేని యజ్ఞము-అనునవి శ్రుతి ప్రసిద్ధములే.

యక్ష ఉవాచ - యక్షుడిట్లు పలికెను.

కా ది క్కిముదకం ప్రోక్తం కిమన్నం కించ వై విషమ్,
శ్రాద్ధస్య కాల మాఖ్యాహి తతః పిబ హరస్వ చ . 85

అర్థ: దిక్-దిక్కు; కా-ఏది; ఉదకమ్ -నీరు అని; ప్రోక్తమ్-చెప్పబడినది, కిమ్-ఏది; అన్నమ్-అన్నము; కిమ్-ఏది; చ-మరియు; విషమ్,వై-విషము; కిమ్-ఏది; శ్రాద్ధస్య- శ్రాద్ధమునకు; కాలమ్-కాలమును; ఆఖ్యాహి-చెప్పుము; తతః-తరువాత; పిబ-త్రావుము; చ-మరియు; హరస్వ-కొనిపొమ్ము.

తా: దిక్కు, ఉదకము, అన్నము, విషము అనునవి ఏవి? శ్రాద్ధమునకు యోగ్యమైన కాలమేది? చెప్పు. అటుపై నీరు త్రావుము. కొనిపొమ్ము.

యుధిష్ఠిర ఉవాచ - యుధిష్ఠిరు డిట్లు చెప్పెను.

సన్తో దిగ్జల మాకాశం గౌరన్నం ప్రార్థనా విషమ్,
శ్రాద్ధస్య బ్రాహ్మణ: కాల: కథం వా యక్ష మన్యసే. 86

అర్థ: సన్తః-సజ్జనులు; దిక్-దిక్కు; ఆకాశమ్-ఆకాశము; జలమ్-జలము; గౌ:-గోవు; అన్నమ్-అన్నము; ప్రార్థనా-వేడికొనుట; విషమ్-విషము; శ్రాద్ధస్య-శ్రాద్ధమునకు; బ్రాహ్మణ: -బ్రాహ్మణుడు; కాల:-కాలము; యక్ష-ఓ యక్షుడా; కథం, వా, మన్యసే-నీవెట్లు భావించు చున్నావు?

తా: సజ్జనులే దిక్కు, ఆకాశమే జలము, గోవే అన్నము. వేడుకొనుటయే విషము. బ్రాహ్మణుని రాకయే శ్రాద్ధమునకు తగిన కాలము. యక్షా! నీవేమి అనుకొనుచున్నావు?

వ్యా: ఇట్లు లోభాదులను వదలివైచి, దానాదులను శ్రద్ధతో ఆచరించి శమము దమము మొదలగు వానిని చక్కగా అలవరచుకొని పాటించి శ్రవణమనన నిది ధ్యాసనలు చేయువాడు తెలిసికొనదగిన బ్రహ్మైక్యమును ఇందు బోధించుచున్నారు.

సంత: - వేదప్రమాణమునందు నిష్ఠ కలవారు. దిక్ - అనగా దిశతి - ఉపదిశతి అనునర్థమునుబట్టి ఉపదేశము చేయువారు అని అర్థము. ఆచార్యుని ఉపదేశమును బట్టి బ్రహ్మము నెరుగవలయునని భావము.

ఇచట జలమ్ అనగా పిండాండ బ్రహ్మాండ రూపమైన కార్యము. దీనికి శ్రుతి ప్రమాణము కలదు - "పఞ్చమ్యా మాహుతావాపః పురుష వచసో భాన్తి" - 'అయిదవ ఆహుతి యందు జలములు పురుష వాక్కు వలన ప్రకాశించును'. ఆ కార్యము యొక్క అభిమానియగు చేతనము జలము. దీనిచేత వ్యష్టిగా సమష్టిగా నున్న జీవుడు సూచింపబడుచున్నాడు. కావున జలమనగా జీవుడు.

ఆకాశము - "సర్వాణి హవా ఇమాని భూతాని ఆకాశాదేవ సముత్పద్యన్త ఆకాశేఽస్తం యాన్తి" - 'ఈ భూతము లన్నియు ఆకాశము నుండియే ఏర్పడుచున్నవి. ఆకాశమునందే అస్తమించుచున్నవి.' అను శ్రుతిని బట్టి ఆకాశమనగా వ్యాకృతమైన కారణము. (నామ రూపములుగా ఏర్పడిన కారణము) దీనిచేత తెలియవచ్చునది వ్యాకృతమైన కారణము యొక్క అభిమాని యగు ఈశ్వరుడు.

ఈ రెంటికి (జీవరూపుడగు జలమునకు, ఆకాశరూపుడగు ఈశ్వరునకు) జలమాకాశము అనురూపమున సామానాధి కరణ్యము (రెండు ధర్మములకు ఆధారమొక్కటే అని చెప్పుట) ఏర్పడుట వలన అభేదము సిద్ధించుచున్నవి. అందులో ఉపాధి అంశమును (ఆధారమైన అంశమును) వదలుటచేత రెంటియందును శుద్ధమైన చిన్మాత్రమే గోచరించును. ఇతడు దేవదత్తుడు అన్నచోటునందువలె ఆయా దేశకాల రూపవిశేషములను వదలి వేయుట చేత దేవదత్తుడు మాత్రము తెలియవచ్చునట్లు ఆ శుద్ధ చైతన్యమే సమస్తమైన వేదాంతముల యందు తెలియదగిన విషయమని భావము.

మఱి ఉపాధిభేదము మరలిపోయినచో జాగ్రద్దశ ఏర్పడగా ఈ రెంటికి (జీవ బ్రహ్మములకు) అభేదమెట్లు సిద్ధించును? అనుశంకకు సమాధానము చెప్పుచున్నారు. గౌరన్నమ్ - 'గచ్ఛతీతి గౌ:' అని గోశబ్దమునకు వ్యుత్పత్తి. కావున ఇచట 'గోవు' అనగా ఇంద్రియము, లేదా దానివలన తెలియదగు శబ్ద, స్పర్శ, రూప, రస, గంధములు. అదియే అన్నము. అనగా అదనీయము - ప్రవిలాపనీయము - నీటిలో ముంచిన ఉప్పువలె నామ రూపములు లేకుండ చేయదగినది. ఉప్పుగడ్డను నీటిలో ముంచినచో నీరే అయి నీటిలో కలిసి పోవునుగదా! "అత్ర హ్యేతే సర్వ మేకం భవన్తి" - ఇవి యన్నియు ఒక్కటియగును - మున్నగు శ్రుతుల వలన ఉపాధులైన స్థూల సూక్ష్మ దేహములు మిథ్యా స్వరూపములే కనుక త్రాటియందు భ్రమవలన కలిగిన పాముతనము జ్ఞానము చేత ప్రవిలయమైనట్లు వీని ప్రవిలయము సుఖముగా సాధింపదగినదే యగును.

ఇక ప్రార్థన యనగా కామము. అదియే విషము వంటిది కనుక విషము. దానివలననే జనన మరణములు స్వరూపముగా గల సంసార మేర్పడుచున్నది. కనుక విషము. అందువలన కామమును పూర్తిగా వదలివైచి గురువు చేసిన ఉపదేశము వలన ప్రపంచమును ప్రవిలాపనము చేసి బ్రహ్మ భావములో కలసిపోవునట్లు చేసి ప్రత్యగాత్మకు, (భిన్న దేహము లందు వేరుగా ఉన్నట్లు తోచెడు ఆత్మను) బ్రహ్మమునకు అభేదమును సాక్షాత్కరింప జేసికొన వలయునని తాత్పర్యము.

ఇక శ్రాద్ధ కాలమును గురించి చెప్పుచున్నారు.బ్రాహ్మణుడు అనగా బ్రహ్మము నెరిగిన వాడు. శ్రాద్ధమనగా శ్రద్ధతో ఈయదగినది. దానికి కాలము - తగిన సమయము పరమ యోగ్యుడైన బ్రహ్మవేత్త లభించినపుడే ధర్మము, జ్ఞానము మొదలగు వానిని అనుష్ఠింపవల యునని భావము.

దీనితో సాధనములతో కూడిన బ్రహ్మ విద్య ముగిసినది.

అయినను ఇంకను ఇతరములైన జ్ఞాన సాధనములను, వాని లక్షణములను యక్షుడు అడుగగోరుచున్నాడు. అప్పుడు కాని తన తమ్ముల జీవనాది సుఖరూపమైన పూర్ణవరమును ప్రసాదింపడు. అను భావముతో ధర్మరాజు పరామర్శించుచున్నాడు. యక్షా! నా సమాధానములు సరియైనవే యగునా? నీవేమి అనుకొనుచున్నావు? నీ మతమున నేను కృతకృత్యుడనైతినా? లేదా అని ప్రశ్న తాత్పర్యము.

యక్ష ఉవాచ - యక్షుడు డిట్లనెను.

తపః కిం లక్షణం ప్రోక్తం కో దమశ్చ ప్రకీర్తితః,
క్షమా చ కా పరా ప్రోక్తా కా చ హ్రీ: పరికీర్తితా. 87

అర్థ: కిమ్, లక్షణమ్-ఏ లక్షణము కలది; తపః-తపముగా; ప్రోక్తమ్-చెప్పబడినది; కః-ఏది; దమః-దమముగా; ప్రకీర్తితః-చక్కగా చెప్పబడినది; కా-ఏది; పరా-మిక్కిలి గొప్పది యగు; క్షమా-ఓర్పు అని; ప్రోక్తా-పలుకబడినది; చ-మరియు; కా-ఏది; హ్రీ:-సిగ్గు అని; పరికీర్తితా-చక్కగా తెలియజేయబడినది.

తా: తపము, దమము, క్షమ, సిగ్గు వీనిని గూర్చిన సంభావన యెట్టిది?

అవ : జ్ఞానమునకు సాధనములైన తపము మున్నగు ఎనిమిదింటి సముదాయమును రెండు శ్లోకములలో చెప్పుచున్నారు. (88, 90 శ్లోకములు)

యుధిష్ఠిర ఉవాచ - యుధిష్ఠిరుడిట్లు చెప్పెను.

తపః స్వధర్మ వర్తిత్వం మనసో దమనం దమః,
క్షమా ద్వంద్వ సహిష్ణుత్వం హ్రీ రకార్య నివర్తనమ్? 88

అర్థ: స్వధర్మ వర్తిత్వమ్-తనదైన ధర్మమునందు నడచుకొనుట; తపః-తపము; మనసః-మనస్సు యొక్క; దమనమ్-అణచుట; దమః-దమము; ద్వంద్వ సహిష్ణుత్వమ్-ద్వంద్వములను సహించు లక్షణము, క్షమా-ఓర్పు; అకార్య నివర్తనమ్-పాడుపనుల నుండి మరలుట; హ్రీ: - లజ్జ.

తా: తన ధర్మమును చక్కగా నిర్వహించుట తపస్సు. మనస్సును నిలువరించుటయే దమము. సుఖదుఃఖములు, లాభాలాభములు - మొదలగు జంటలు కలిగినపుడు పొంగు, క్రుంగుట మొదలైన వికారములు లేకుండుట క్షమ. చెడుపనుల నుండి మరలుటయే సిగ్గు.

యక్ష ఉవాచ - యక్షుడిట్లు పలికెను.

కిం జ్ఞానం ప్రోచ్యతే రాజన్ కః శమ శ్చ ప్రకీర్తితః,
దయా చ కా పరా ప్రోక్తా కిం చార్జవ ముదాహృతమ్. 89

అర్థ: రాజన్-రాజా! జ్ఞానమ్-జ్ఞానము, అని, కిమ్-ఏది; ప్రోచ్యతే-చక్కగా చెప్పబడును; చ-మరియు; శమ:-శమము అని; క:-ఏది; ప్రకీర్తిత:-గొప్పగా చెప్ప బడినది; చ-మరియు; పరా-మిక్కిలి గొప్పదైన; దయా-దయగా; కా-ఏది; ప్రోక్తా-పలుకబడినది; చ-మరియు; ఆర్జవమ్-ఋజుత్వముగా; కిమ్-ఏది; ఉదాహృతమ్-చెప్పబడినది.

తా: రాజా! జ్ఞానమని దేనినందురు? శమమనగా నేది? పరమదయ ఏది? ఋజుత్వమని దేనిని చెప్పుదురు?

యుధిష్ఠిర ఉవాచ - యుధిష్ఠిరు డిట్లు చెప్పెను.

జ్ఞానం తత్త్వార్థ సంబోధ: శమ శ్చిత్త ప్రశాన్తతా,
దయా సర్వ సుఖైషిత్వ మార్జవం సమచిత్తతా. 90

అర్థ: తత్త్వార్థ సంబోధ:-తత్త్వ సంబంధమగు విషయమును సమగ్రముగా ఎఱుగుట; జ్ఞానమ్-జ్ఞానము; చిత్తప్రశాన్తతా-చిత్తమునందు అలజడి లేకుండుట; శమ:-శమము (శాంతి); సర్వ సుఖ+ఏషిత్వమ్-సర్వప్రాణుల సుఖమును కోరుట; దయా-దయ; సమచిత్తతా-సమ మైన చిత్తము గలిగి యుండుట; ఆర్జవమ్-ఆర్జవము.

తా: పరమార్థమును పరిపూర్ణముగా తెలిసికొనుటయే జ్ఞానము. చిత్తము నందు ప్రశాంతి ఏర్పడుటయే శమము. సకల ప్రాణుల సుఖమును కోరుచుంటయే దయ. అన్ని సమయములలో ఒకే తీరైన చిత్తము కలిగియుండుట ఋజు స్వభావము.

యక్ష ఉవాచ - యక్షు డిట్లు పలికెను.

క: శత్రు ర్దుర్జయ: పుంసాం కశ్చ వ్యాధి రనన్తక:,
కీదృశశ్చ స్మృత: సాధు రసాధు: కీదృశ: స్మృత:. 91

అర్థ: పుంసామ్-మనుజులకు; దుర్జయ:-గెలువనలవి కాని; శత్రు:-శత్రువు; క:-ఎవడు; చ-మరియు; అనన్తక:-తుదిలేని; వ్యాధి:-రోగము; క:-ఏది; చ-మరియు; కీదృశ:-ఎట్టివాడు; సాధు:-సజ్జనుడుగా; స్మృత:-తలపబడును; కీదృశ:-ఎట్టివాడు; అసాధు:-దుర్జ నుడుగా; స్మృత:-తలపబడును.

తా: నరులకు గెలువనలవికాని పగవాడెవ్వడు? ఎన్నటికిని తీరని రోగమన నెట్టిది? ఎట్టివానిని సజ్జనుడందురు? ఎట్టివానిని దుర్జనుడందురు?

యుధిష్ఠిర ఉవాచ - యుధిష్ఠిరు డిట్లు చెప్పెను.

క్రోధ: సుదుర్జయ: శత్రు ర్లోభో వ్యాధి రనన్తక:,
సర్వ భూత హిత: సాధు రసాధు ర్నిర్దయ: స్మృత:. 92

అర్థ: క్రోధ:-క్రోధము; సుదుర్జయ:-మిక్కిలి గెలువనలవి కాని; శత్రు:-శత్రువు; లోభ:-పిసినిగొట్టుతనము; అనన్తక:-ఎన్నటికిని నశింపని; వ్యాధి:-జబ్బు; సర్వభూత హిత:-ప్రాణు లన్నింటికి మేలు చేయువాడు; సాధు:-మంచివాడు; నిర్దయ:-దయలేనివాడు; అసాధు:-చెడ్డ వాడుగా; స్మృత:-తలపబడినవాడు.

తా: క్రోధము ఎంతయు గెలువనలవికాని శత్రువు. పిసినిగొట్టుతనము ఎన్నటికిని చావని రోగము. ఎల్లప్రాణులకు మేలు చేయువాడే సాధువు. దయలేనివాడే అసాధువు.

వ్యా : క్రోధలోభ నిర్దయత్వములు వదలి నరుడు సర్వ భూతహితుడు కావలయునని భావము.

అవ: ఇది మొదలుకొని మూడు శ్లోకములలో మోహాదుల లక్షణములను చెప్పుచున్నారు. (94, 96, 98 శ్లో).

యక్ష ఉవాచ - యక్షు డిట్లు పలికెను.

కో మోహ: ప్రోచ్యతే రాజన్ కశ్చ మాన: ప్రకీర్తిత:,
కి మాలస్యం చ విజ్ఞేయం కశ్చ శోక: ప్రకీర్తిత:. 93

అర్థ: రాజన్-రాజా! క:-ఏది; మోహ:-మోహమని; ప్రోచ్యతే-చెప్పబడును; చ-మరియు; క:-ఏది; మాన:-మానమని; ప్రకీర్తిత:-పలుకబడినది; చ-మరియు; ఆలస్యమ్-ఆలస్యమని; కిమ్-ఏది; విజ్ఞేయమ్-తెలియదగినది; చ-మరియు; శోక:-శోకమని; క:-ఏది; ప్రకీర్తిత:-చెప్ప బడినది.

తా: రాజా! మోహము, మానము, ఆలస్యము, శోకము అనగా నెట్టివి?

యుధిష్ఠిర ఉవాచ - యుధిష్ఠిరుడిట్లు చెప్పెను.

మోహో హి ధర్మమూఢత్వం మాన స్వాత్మాభిమానితా,
ధర్మ నిష్క్రియతాలస్యం శోకస్త్వజ్ఞాన ముచ్యతే. 94

అర్థ: ధర్మ మూఢత్వమ్, హి-ధర్మము నందు సరియైన అవగాహన లేకుంటయే;మోహ: -మోహము; ఆత్మాభిమానితా-తన్ను గొప్పగా భావించుటయే; మాన:-మానము; ధర్మనిష్క్రి యతా-ధర్మము నందు ఆచరణ లేకుండుటయే; ఆలస్యమ్-ఆలస్యము; అజ్ఞానమ్, తు-అజ్ఞానమే; శోకమ్-శోకమని; ఉచ్యతే-చెప్పబడును.

తా: ధర్మము చక్కగా తెలియకుండుటయే మోహము. తన్ను తాను గొప్పగా తల పాయుటయే మానము. ధర్మమునందు ఆచరణ లేకుండుటయే ఆలస్యము. అజ్ఞానమే - తత్త్వమెరుగకుండుటయే శోకము.

యక్ష ఉవాచ - యక్షు డిట్లు పలికెను.

కిం స్థైర్య మృషిభి: ప్రోక్తం కించ ధైర్య ముదాహృతమ్,
స్నానం చ కిం పరం ప్రోక్తం దానం చ కిమిహోచ్యతే. 95

అర్థ: స్థైర్యమ్-స్థైర్యము అని; ఋషిభిః-ఋషులచేత; ప్రోక్తమ్-పలుకబడినది; కిమ్-ఏది; చ-మరియు; ధైర్యము-ధీరత్వము అని; ఉదాహృతమ్-చెప్పబడినది; కిమ్-ఏది; పరమ్-మిక్కిలి గొప్పది యగు; స్నానమ్-స్నానము; కిమ్-ఏది; చ-మరియు; ఇహ-ఇక్కడ; దానమ్-దానమని; ఉచ్యతే-చెప్పబడునది; కిమ్-ఏది.

తా: ఋషులు (తత్త్వమును దర్శించువారు) స్థైర్యమని దేని నందురు? ధైర్యమని దేని నందురు? చాల గొప్పదైన స్నానమేది? ఇచట దానమని దేని నందురు?

యుధిష్ఠిర ఉవాచ - యుధిష్ఠిరు డిట్లు చెప్పెను.

స్వధర్మే స్థిరతా స్థైర్యం ధైర్య మిన్ద్రియ నిగ్రహాः,
స్నానం మనోమలత్యాగో దానం వై భూతరక్షణమ్. 96

అర్థ: స్వ ధర్మే-తనదైన ధర్మమునందు; స్థిరతా-కదలక నిలువ గలుగుట; స్థైర్యమ్-స్థైర్యము; ఇన్ద్రియ నిగ్రహాः-ఇంద్రియములను చలింపనీకుండుట; ధైర్యమ్-ధైర్యము; మనస్, మల, త్యాగాः-మనస్సునందలి కసటును వదలి వేయుట; స్నానమ్-స్నానము; భూత, రక్షణమ్, వై-భూతములను (ప్రాణులను) రక్షించుటయే; దానమ్-దానము.

తా: తన ధర్మమునుండి యిసుమంతయు చలింపకుండుట స్థైర్యము. ఇంద్రియములను పట్టినిలుపుట ధైర్యము. మనసునందలి మాలిన్యమును తొలగించి వేయుట స్నానము. ప్రాణులను రక్షించుటయే దానము.

యక్ష ఉవాచ - యక్షు డిట్లనెను.

కः పణ్డితः పుమాన్ జ్ఞేయో నాస్తికः కశ్చ ఉచ్యతే,
కో మూర్ఖः కశ్చ కామः స్యాత్ కో మత్సర ఇతి స్మృతः. 97

అర్థ: కः-ఏ; పుమాన్-మానవుడు; పణ్డితः-పండితుడు అని; జ్ఞేయः-తెలియ దగినవాడు; చ-మరియు; కः-ఎవడు; నాస్తికः-నాస్తికుడని; ఉచ్యతే-చెప్పఁబడును; కः-ఎవడు; మూర్ఖः-మూర్ఖుడు; చ-మరియు; కः-ఏది; మత్సరः-మత్సరము; ఇతి-అని; స్మృతః-తలపబడును.

తా: పండితుడని ఎవని నందురు? నాస్తికుడని ఎవని నందురు? మూర్ఖుడెవడు? కామమనగా నెట్టిది? మత్సరమనగా నేమి?

యుధిష్ఠిర ఉవాచ - యుధిష్ఠిరు డిట్లనెను.

ధర్మజ్ఞः పణ్డితో జ్ఞేయో నాస్తికో మూర్ఖ ఉచ్యతే,
కామः సంసార హేతుశ్చ హృత్తాపో మత్సరः స్మృతः. 98

అర్థ: ధర్మజ్ఞः-ధర్మమును సమగ్రముగా ఎరిగినవాడే; పణ్డితः-పండితుడని; జ్ఞేయः-తెలియదగినవాడు; నాస్తికः-నాస్తికుడు; మూర్ఖः-మూర్ఖుడని; ఉచ్యతే-చెప్పబడును; సంసార హేతుः-సంసారమునకు కారణమైనదియే; కామः-కామము; హృత్తాపः-హృదయము కుములుటయే; మత్సరः-మత్సరము అని; స్మృతః-తలపబడినది.

తా: ధర్మము మూలమట్టుగ ఎరిగినవాడే పండితుడు. నాస్తికుడే మూర్ఖుడు. సంసారమునకు కారణమైనదియే కామము. ఇతరుల ధనము మున్నగునవి చూచి గుండెలో కుములుటయే మత్సరము.

వ్యా: నాస్తికుడనగా పరలోకములేదు అని వాదించువాడు. వాడే మూర్ఖుడు. ప్రశ్నలు అయిదింటికి సమాధానములు నాలుగే చెప్పెను. కావున నాస్తికుడే మూర్ఖుడు, మరల మూర్ఖుని గూర్చి అడుగబనిలేదు - అను భావముతో మూర్ఖుడెవడు? అను యక్ష ప్రశ్నకు ధర్మరాజు సమాధానము విడిగా చెప్పలేదు.

యక్ష ఉవాచ - యక్షుడిట్లు పలికెను.

కోఽహఙ్కార ఇతి ప్రోక్తః కశ్చ దమ్భః ప్రకీర్తితః,
కిం తద్దైవం పరం ప్రోక్తం కిం తత్పైశున్య ముచ్యతే. 99

అర్థ: కః-ఏది; అహఙ్కారః-అహంకారము; ఇతి-అని; ప్రోక్తః-పలుకబడినది; చ-మరియు; కః-ఏది; దమ్భః-దంభము అని; ప్రకీర్తితః-గట్టిగా చెప్పబడినది; కిమ్-ఏది; తత్-ఆ; పరమ్-చిట్టచివరిదగు; దైవమ్-దైవము అని; ప్రోక్తమ్-పలుకబడినది; కిమ్-ఏది; తత్-ఆ; పైశున్యమ్-కొండెగాని తనము (అని); ఉచ్యతే-చెప్పబడును.

తా: అహంకారము, దంభము, పరదైవము, కొండెగాని తనము అనునవి ఎట్టివి?

యుధిష్ఠిర ఉవాచ - యుధిష్ఠిరుడిట్లు చెప్పెను.

మహాజ్ఞాన మహఙ్కారో దమ్భో ధర్మో ధ్వజోచ్ఛ్రయః,
దైవం దానఫలం ప్రోక్తం పైశున్యం పరదూషణమ్. 100

అర్థ: మహా-అజ్ఞానమ్-గొప్పదియగు అజ్ఞానము; అహఙ్కారః-అహంకారము; ధ్వజ+ఉచ్ఛ్రయః-జెండా కట్టవలె ఎత్తుగా పాడుచుకొని వచ్చిన; ధర్మః-ధర్మము; దమ్భః-దంభము; దానఫలమ్-దానము యొక్క ఫలమే; దైవమ్-దైవము; పరదూషణమ్-ఇతరుల నిందించుటయే; పైశున్యమ్-కొండెగాని తనము.

తా: హద్దుమీరిన అజ్ఞానమే అహంకారము. కీర్తి కొరకు చేయు ధర్మమే దంభము. దానఫలమే దైవము. ఇతరులను నిందించుటయే పిశున లక్షణము.

వ్యా: ధ్వజోచ్ఛ్రయః - ధ్వజము వలె పైకిలేచి కన్పట్టు ధర్మమే దంభము. లోకము మెప్పునకు మాత్రమే ఆచరించునట్టి ధర్మము అని భావము. దైవమనగా అదృష్టము. వెనుకటి దానధర్మముల ఫలితమే అదృష్టముగా తరువాత కలసివచ్చునని తాత్పర్యము. పిశును డనగా కొండెగాడు. ఎల్లవేళల ఇతరుల దోషములను వెదకుచు నిందించుచుండువాడు.

అహంకారము, దంభము, కొండెగాని తనము అను నీచలక్షణములను వదలి దైవమునకు వశుడై, అప్రయత్నముగా లభించుదానితో తృప్తిపడుచు మానవుడు ధర్మము నాచరింపవలయునని భావము.

యక్ష ఉవాచ - యక్షుడు డిట్లనెను.

ధర్మ శ్చార్థశ్చ కామశ్చ పరస్పర విరోధినః,
ఏషాం నిత్య విరోధానాం కథ మేకత్ర సఙ్గమః. 101

అర్థ: ధర్మః-ధర్మము; చ-మరియు; అర్థః-అర్థము; చ-మరియు; కామః-కామము; పరస్పర విరోధినః-ఒకదానికొకటి సరిపడని ప్రవృత్తి కలవి; నిత్యవిరోధానామ్-ఎల్లప్పుడు విరుద్ధములైన; ఏషామ్-వీనికి; ఏకత్ర-ఒక్కచోట; సఙ్గమః-కలయిక; కథమ్-ఎట్లు.

తా: ధర్మము, అర్థము, కామము అనునవి ఒకదానికొకటి విరోధము కలవి. ఇట్లు ఎల్లవేళల విరుద్ధములైన ఇవి ఒకచోట కలసియుండుట ఎట్లు సంభవించును?

యుధిష్ఠిర ఉవాచ - యుధిష్ఠిరు డిట్లు చెప్పెను.

యదా ధర్మశ్చ భార్యా చ పరస్పర వశానుగౌ,
తదా ధర్మార్థ కామానాం త్రయాణా మపి సఙ్గమః. 102

అర్థ: యదా-ఎప్పుడు; ధర్మః, చ-ధర్మమును; భార్యా, చ-భార్యయును; పరస్పర వశానుగౌ-ఒకదానికొకటి వశమై నడచు కొందురో; తదా-అప్పుడు; ధర్మ అర్థ, కామానామ్ -ధర్మము, అర్థము, కామము అనువానికి, త్రయాణామ్, అపి-మూడింటికిని; సఙ్గమః-కలయిక; (స్యాత్-అగును)

తా: ధర్మము, భార్య ఒకదానికొకటి వశమై వర్తించినచో ధర్మార్థకామములు మూడును ఒకచోట కలిసిమెలిసి ప్రవర్తించును.

వ్యా: అర్థకామములు ధర్మమునకు విరోధులవంటివి. అట్టియెడ ధర్మమును వానితో కలిపి ఆచరించుట దుష్కరము కదా! అని ఆశంకించి సమాధానము చెప్పుచున్నారు.

భార్య భర్తచేయు దానము మొదలగు వానికి ఆటంకములు చేయక, ధర్మమునందు విరుద్ధమతి కాక యున్నయెడల అప్పుడు ధర్మము అర్థములను పుట్టించును. మరియు అట్టి భార్య భర్తకు సంబంధించిన ధర్మ కామమును పండించును. దానిచేత ఈ మూడింటి వర్గము ఒకచోట కలయికను పొందును.

ఈ విధముగా గృహస్థులకు కూడ ధర్మమను ద్వారముతో మోక్షమునందు అధికారము సిద్ధించుచున్నదని చెప్పినట్లయినది.

యక్ష ఉవాచ - యక్షుడు డిట్లు పలికెను.

అక్షయో నరకః కేన ప్రాప్యతే భరతర్షభ,
ఏతన్మే పృచ్ఛతః ప్రశ్నం తచ్ఛీఘ్రం వక్తు మర్హసి. 103

అర్థ: భరతర్షభ-భరతశ్రేష్ఠుడా! అక్షయః-తరుగువోని, నరకః-నరకము; కేన-దేనిచేత; ప్రాప్యతే-పొందబడుచున్నది; పృచ్ఛతః-అడుగుచున్న; మే-నా; ఏతత్-ఈ; ప్రశ్నమ్-ప్రశ్నకు; తత్-ఆ సమాధానము; శీఘ్రమ్-అశువుగా (వెంటనే) వక్తుమ్-చెప్పుటకు; అర్హసి-తగుదువు.

తా: రాజా! తరుగువోని నరకము దేనివలన కలుగును. ఈ నా ప్రశ్నకు వెంటనే బదులు చెప్పవలయును.

వ్యా: అక్షయమైన నరకమనగా నిత్యమైన సంసారి లక్షణము. ఎన్నటికిని ముక్తి నందకుండుట.

యుధిష్ఠిర ఉవాచ - యుధిష్ఠిరు డిట్లు చెప్పెను.

బ్రాహ్మణం స్వయ మాహూయ యాచమాన మకిఞ్చనమ్,
పశ్చా న్నాస్తీతి యో బ్రూయాత్ సోఽ క్షయం నరకం వ్రజేత్. 104

అర్థ: స్వయమ్-తనకు తానై; యాచనమ్-బిచ్చమెత్తుచున్న; అకిఞ్చనమ్-దరిద్రుడైన; బ్రాహ్మణమ్-బ్రహ్మజ్ఞాన సంపద గలవానిని; ఆహూయ-పిలిచి; పశ్చాత్-పిదప; న, అస్తి, ఇతి-లేదని; యః-ఎవడు; బ్రూయాత్-పలుకునో; సః-అతడు; అక్షయమ్-శాశ్వతమైన; నరకమ్-నరకమును; వ్రజేత్-పొందును.

తా: దరిద్రుడై తిరిపమెత్తుకొనుచున్న బ్రహ్మజ్ఞాన సంపన్నుని స్వయముగా పిలిచి పిదప లేదని చెప్పువాడు ఎన్నటికిని నశింపని నరకమున కరుగును.

వ్యా: ఇట్టి దానినే ఆసురసంపద అందురు. ఇదియే నరక కారణము.

వేదేషు ధర్మశాస్త్రేషు మిథ్యా యో వై ద్విజాతిషు,
దేవేషు పితృధర్మేషు సోఽక్షయం నరకం వ్రజేత్. 105

అర్థ: వేదేషు-వేదములయందును; ధర్మ శాస్త్రేషు-ధర్మ శాస్త్రములయందును; ద్విజాతిషు-ఉపనయన సంస్కారము చేత రెండు జన్మములు కల బ్రాహ్మణాదుల యందును; దేవేషు-దేవతల యందును; పితృ ధర్మేషు-పితరుల యందు పాటింపవలసిన ధర్మము లందును; యః-ఎవడు; మిథ్యా-అసత్యబుద్ధితో నుండునో; సః-అతడు; అక్షయమ్-నాశము లేని; నరకమ్-నరకమును; వ్రజేత్-పొందును.

తా: వేదములు, ధర్మశాస్త్రములు, బ్రాహ్మణులు, దేవతలు, పితృధర్మములు అనునవి అసత్యములు అనుబుద్ధితో నుండువాడు నిత్యమైన నరకమున కరుగును.

విద్యమానే ధనే లోభా ద్దాన భోగ వివర్జితః,
పశ్చా న్నాస్తీతి యో బ్రూయాత్ సోఽక్షయం నరకం వ్రజేత్. 106

అర్థ: ధనే-ధనము; విద్యమానే-ఉండగా; లోభాత్-లోభమువలన; దాన,భోగ, వివర్జితః-దానముచేయుట, భోగములనుభవించుట అనునవి లేనివాడై; పశ్చాత్-పిదప; న,ఆస్తి, ఇతి-లేదని; యః-ఎవడు; బ్రూయాత్-పలుకునో, సః-అతడు; అక్షయమ్-శాశ్వతమైన; నరకమ్-నరకమును; వ్రజేత్-పొందును.

తా: ధనము ఉన్నవాడైనను తాను తినక యితరులకు పెట్టక ఎప్పుడు లేదని చెప్పు చుండువాడు శాశ్వతమైన నరకమును పొందును.

యక్ష ఉవాచ - యక్షు డిట్లడిగెను.

రాజన్ కులేన వృత్తేన స్వాధ్యాయేన శ్రుతేన వా,
బ్రాహ్మణ్యం కేన భవతి ప్రబ్రూహ్యేతత్ సునిశ్చితమ్. 107

అర్థ: రాజన్-రాజా; కులేన-కులముచేతనా; వృత్తేన-వృత్తముచేతనా; స్వాధ్యాయేన-వేదముచదువుటచేతనా; శ్రుతేన-పాండిత్యముచేతనా; కేన-దేనిచేత; బ్రాహ్మణ్యమ్-బ్రాహ్మణత్వము; భవతి-అగును; ఏతత్-దీనిని; సునిశ్చితమ్-చక్కగా నిశ్చయింపబడిన దానిని; ప్రబ్రూహి-మెలకువతో పలుకుము.

తా: రాజా! బ్రాహ్మణత్వము కులముచేతనా? నడవడిచేతనా? వేదముల నధ్యయనము చేయుట చేతనా? పాండిత్యముచేతనా? చక్కగా నిశ్చయించి పలుకుము.

వ్యా: స్వాధ్యాయమనగా అక్షరరూపమున నున్న వేదమును వశపరచుకొనుట. శ్రుతమనగా దాని యర్థమును చక్కగా గ్రహించుట. అర్థ సహితముగా వేదములను గ్రహించుట చేత బ్రాహ్మణత్వము కలుగునా? అని ప్రశ్నభావము.

యుధిష్ఠిర ఉవాచ - యుధిష్ఠిరు డిట్లు చెప్పెను.

శృణు యక్ష కులం తాత న స్వాధ్యాయో న చ శ్రుతమ్,
కారణం హి ద్విజత్వే చ వృత్త మేవ న సంశయః. 108

అర్థ: యక్ష-యక్షుడా; తాత-నాయనా! శృణు-వినుము; కులమ్-కులము; న-కాదు; స్వాధ్యాయ:-స్వాధ్యాయము; న-కాదు; చ-మరియు; శ్రుతమ్-పాండిత్యము; న-కాదు; ద్విజత్వే-బ్రాహ్మణత్వమునందు; వృత్తమ్, ఏవ-నడవడికయే; కారణమ్-కారణము; హి-కదా; న, సంశయ:-సంశయము లేదు.

తా: తండ్రీ! యక్షా! కులము, వేదములను వల్లెవేయుట, వాని యర్థమెఱుగుట అనునవి బ్రాహ్మణు డగుటకు కారణములు కానేకావు. నడవడికయే కారణము. ఇందు సంశయము లేదు.

వ్యా: కులము కారణము కాదు. స్వాధ్యాయము శ్రుతము రెండును కలిపి ఒకటియే. అదియును కారణము కాదు. అని మొదటి పాదమునందలి రెండు 'న' శబ్దములను మూడింటికి అన్వయించుకొనవలయును.

వృత్తం యత్నేన సంరక్ష్యం బ్రాహ్మణేన విశేషతః,
అక్షీణవృత్తో నక్షీణ: వృత్తతస్తు హతో హత:, 109

అర్థ: బ్రాహ్మణేన-బ్రాహ్మణునిచేత; విశేషత:-మిక్కిలి పట్టుదలతో; వృత్తమ్-నడవడి; యత్నేన-ప్రయత్నముతో; సంరక్ష్యమ్-కాపాడు కొనబడదగినది; అక్షీణవృత్త:-క్షీణముకాని నడవడికలవాడు; క్షీణ:-హీనుడు; న-కాడు; తు-కాని; వృత్తత:-నడవడివలన; హత:-చెడిన వాడు; హత:-చచ్చినవాడే యగును.

తా: బ్రాహ్మణుడు గట్టిపట్టుదలతో నడవడిని రక్షించుకొనవలయును. శీలము చెడ కున్నచో మానవుడెన్నటికిని చెడడు. శీలము చెడినవాడు చచ్చినవానితో సమానము.

పఠకాः పాఠకాశ్చైవ యే చాన్యే శాస్త్ర చిన్తకాः,
సర్వే వ్యసనినో మూర్ఖా యः క్రియావాన్ స పణ్డితः 110

అర్థ: పఠకాः-వేదములు చదువువారు; పాఠకాः, చ, ఏవ-వేదములను చదివింప జేయు వారును; అన్యే-ఇతరులైన; శాస్త్ర చిన్తకాः-శాస్త్రములను గూర్చి భావన చేయువారు; యే-ఎవరు కలరో; తే-వారు; సర్వే-అందరు; వ్యసనినः-నిష్ఫలమైన ప్రయత్నముగల; మూర్ఖాः-మూర్ఖులు; యः-ఎవడు; క్రియావాన్-మంచి ఆచారము కలవాడో; సः-అతడు; పణ్డితः-పండితుడు.

తా: వేదములను చదువువారు, చదివించువారు, శాస్త్రములను తర్కించువారు కేవలము పనికిమాలిన ప్రయత్నము చేయు మూర్ఖులు. వేదాదులు బోధించిన సత్సంప్రదాయములను ఆచరించువాడొక్కడే నిజమైన పండితుడు.

చతుర్వేదో పి దుర్వృత్తः స శూద్రా దతిరిచ్యతే,
యోగ్ని హోత్ర పరో దాన్తఐ స బ్రాహ్మణ ఇతిస్మృతः. 111

అర్థ: యः-ఎవడు; చతుర్వేదः-నాలుగు వేదములు కలవాడు; అపి-అయినప్పటికిని; దుర్వృత్తः-శీలము చెడినవాడగునో; సः-అతడు; శూద్రాత్-శూద్రుని కంటె; అతిరిచ్యతే-మించినవాడగును; యः-ఎవడు; అగ్నిహోత్ర పరः-అగ్నిపూజ యందు పరమ శ్రద్ధకలవాడై; దాన్తः-మనస్సుపై ఇంద్రియములపై కట్టుబాటు కలవాడగునో; సः-అతడు; బ్రాహ్మణः-బ్రాహ్మణుడు; ఇతి-అని; స్మృతः-తలపబడును.

తా: నాలుగు వేదములు చదివియు శీలమును చెఱుచుకొన్నవాడు పరిగణనలో శూద్రుని కంటె తక్కువవాడు. అగ్నిహోత్రములను శ్రద్ధతో అర్చించుచు మనస్సుపై అదుపు గలవాడే నిజమైన బ్రాహ్మణుడు.

వ్యా: అతిరిచ్యతే-తక్కువతనములో మించినవాడగునని తాత్పర్యము.

యక్ష ఉవాచ - యక్షుడిట్లు పలికెను.

ప్రియవచన వాదీ కిం లభతే విమృశితకార్య కరः కిం లభతే,
బహుమిత్ర కరः కిం లభతే ధర్మే రతः కిం లభతే కథయ. 112

అర్థ: ప్రియవచనవాదీ-ప్రియమైన వాక్కులు పలుకువాడు; కిమ్-ఏమి; లభతే-పొందును; విమృశిత, కార్య, కరः-చక్కగా గుణదోషములను విచారించి పనులు చేయువాడు; కిమ్-ఏమి లభతే-పొందును; బహుమిత్ర కరः-పెక్కండ్రు మిత్రములను సంపాదించువాడు; కిమ్-ఏమి; లభతే-పొందును; ధర్మే-ధర్మమునందు; రతः-ప్రీతికలవాడు; కిమ్-ఏమి; లభతే-పొందును; కథయ-చెప్పుము.

తా: ప్రియవచనములు పలుకువాడు, చక్కగా గుణదోషములను విచారించి యాయా కార్యములను చేయువాడు, పెక్కండ్రు మిత్రములను కూర్చుకొనువాడు, ధర్మమునందు ప్రీతి కలవాడు ఏమి పొందును? చెప్పుము .

యుధిష్ఠిర ఉవాచ - యుధిష్ఠిరు డిట్లు చెప్పెను.

ప్రియవచనవాదీ ప్రియో భవతి విమృశిత కార్యకరో ఽ ధికం జయతి.
బహుమిత్రకరः సుఖం వసతే యశ్చ ధర్మరతः సుగతిం లభతే. 113

అర్థ: ప్రియవచనవాదీ-ప్రియమైన వాక్కులు పలుకువాడు; ప్రియः-ఇష్టుడు; భవతి-అగును; విమృశిత కార్యకరः-విచారించి పనులు చేయువాడు; అధికమ్-పెక్కింటిని; జయతి-గెలుచును; బహుమిత్రకరः-ఎక్కువగా హితులను కూర్చుకొనువాడు; సుఖమ్-సుఖముగా; వసతే-జీవించును; చ-మరియు; యः-ఎవడు; ధర్మరతः-ధర్మమునందు ప్రీతికలవాడో; సः-అతడు; సుగతిమ్-సుగతిని; లభతే-పొందును.

తా: ప్రియవాది ప్రియుడగును. విచారించి పనులు చేయువాడు పెక్కు జయములను పొందును. ఎక్కువ మిత్రములు కలవాడు సుఖముగా జీవించును. ధర్మము నందు ప్రీతి కలవాడు సుగతి పొందును.

యక్ష ఉవాచ - యక్షుడు పలికెను.

కో మోదతే కి మాశ్చర్యం కः పన్థాः కా చ వార్తికా,
వద మే చతురः ప్రశ్నాన్ మృతా జీవన్తు బాన్ధవాः. 114

అర్థ: కः-ఎవడు; మోదతే-ఆనందమందును; కిమ్-ఏది; ఆశ్చర్యమ్-ఆశ్చర్యము; కः-ఏది; పన్థాः-దారి; చ-మరియు; కా-ఏది; వార్తికా-వార్త; మే-నా;చతురः-నాలుగు; ప్రశ్నాన్-ప్రశ్నలకు; వద-బదులు చెప్పుము; మృతాः-చనిపోయిన; బాన్ధవాः-నీ బంధువులు; జీవన్తు-బ్రదుకుదురు గాక!

తా: ఆనందము పొందువాడెవడు? ఆశ్చర్యకరమైన విషయమేమి? మానవులు ప్రవర్తింపదగిన దారి యెట్టిది. విశేషమగు వార్తయేమి? ఈ నాలుగు ప్రశ్నలకు బదులిమ్ము. మరణించిన నీ చుట్టములు జీవింతురు.

అవ: కర్మ, ఉపాసన, జ్ఞానమార్గములకు అంతరంగ సాధనమైన వైరాగ్యమునుగూర్చిపై నాలుగు ప్రశ్నలకు సమాధానములు చెప్పుచున్నారు.

యుధిష్ఠిర ఉవాచ - యుధిష్ఠిరుడు చెప్పెను.

పఞ్చమే ఽహని షష్ఠే వా శాకం పచతి స్వే గృహే,
అనృణీ చాప్రవాసీ చ స వారిచర మోదతే. 115

అర్థ: వారిచర-నీటియందు సంచరించు ఓ బక రూపయక్షా! యः-ఎవడు; పఞ్చమే-అయిదవ; అహని-దినమునందో; షష్ఠే వా-ఆరవదినమునందో; స్వే-తనదైన; గృహే-ఇంటి

యందు; శాకమ్-కూరను; పచతి-వండుకొనునో; అనృణీ-అప్పుచేయనివాడు; ప్రవాసీ-పరస్థలము లందు నివాసము చేయనివాడు అగు; సః-అట్టివాడు; మోదతే-ఆనందమందును.

తా: ఓయి యక్షా! ఉన్నంత మాత్రమున తృప్తితో అయిదారు దినముల కొక మారు కూరలతో సుఖముగా భుజించుచు, అప్పులు చేయనివాడు, పరుల పంచలందు పడియుండని వాడు మోదమందును.

వ్యా: అయిదవ దినమునందో ఆరవదినమందో కూరలు వండుకొనుట యనగా దొరకిన దానితో తృప్తిపడుచు లేనిదానికై వెంపరలాడకుండ బ్రదుకుట యని యర్థము. అనృణీ-'అప్పుచేసి పప్పుకూడు' అన్న తీరులేని వాడని భావము. ప్రవాసీ- ఇతరుల తిండిపై ఆధారపడి బ్రదుకువాడు, లేక సంపాదనకై దేశములు బట్టి తిరుగువాడు అని అర్థము. దొరకిన దానితో సంతృప్తి పడుట అను వైరాగ్య లక్షణమును ఇందు సూచించుచున్నారు.

అహన్యహని భూతాని గచ్ఛన్తీహ యమాలయమ్,
శేషాः స్థావర మిచ్ఛన్తి కిమాశ్చర్య మతः పరమ్. 116

అర్థ: భూతాని-ప్రాణులు; అహని, అహని-ప్రతిదినము; ఇహ-ఇక్కడ; యమాలయమ్-యముని యింటికి; గచ్ఛన్తి-వెళ్లుచున్నవి; శేషాः-మిగిలినవారు; స్థావరమ్-స్థిరమైన బ్రదుకును; ఇచ్ఛన్తి-కోరుచున్నారు; అతఃపరమ్-ఇంతకంటె మిన్న అయిన; ఆశ్చర్యమ్-ఆశ్చర్యము; కిమ్-ఏమి?

తా: ప్రతిదినము ఎన్నియో ప్రాణులు యమునింటికి పోవుచున్నవి. మిగిలిన వారు తాము స్థిరముగా నుండవలయునని కోరుచున్నారు. ఇంతకంటె ఆశ్చర్య మేముండును?

వ్యా: దేహము నశించునది అనుభావము అనుసంధించుకొని లభించిన భోగములను కూడ వదలివైచి అప్పటికప్పుడు పరమార్థమునకై ప్రయత్నింప వలయునని తాత్పర్యము.

తర్కోऽ ప్రతిష్ఠः శ్రుతయో విభిన్నా నైకో ఋషి ర్యస్య మతం ప్రమాణమ్
ధర్మస్య తత్త్వం నిహితం గుహాయాం మహాజనో యేన గతः స పన్థాः. 117

అర్థ: తర్కः-పదార్థముల విచారము; అప్రతిష్ఠः-నిలుకడలేనిది; శ్రుతయः-వేదములు; విభిన్నాः-అనేక విధములైనవి; యస్య-ఎవని; మతమ్-అభిప్రాయము; ప్రమాణమ్-నిశ్చయ జ్ఞానము కలిగించునదియో; సः-అట్టి; ఋషిः-దర్శనము కలవాడు; న, ఏకः-ఒక్కడు లేడు; ధర్మస్య-ధర్మము యొక్క; తత్త్వమ్-నిజమైన స్వరూపము; గుహాయామ్-గుహయందు; (ఎవరికిని అందని తావునందు) నిహితమ్-చక్కగా దాచబడినది; మహాజనः-మహాపురుషుడు; యేన-దేనితో; గతः-వెళ్లెనో; సः-అది; పన్థాः-మార్గము.

తా: తర్కమునకు నిలుకడలేదు. వేదములు ఎన్నో విధములుగా నున్నవి. ఈతని అభిప్రాయమే ప్రమాణమని చెప్పదగిన ఋషి యొక్కడు లేడు. ధర్మతత్వము మిక్కిలి గూఢమైనది. కావున జ్ఞానసంపదగల మహా పురుషుడు నడచినదియే తక్కినవారికి మార్గము.

వ్యా: అప్రతిష్ఠ-నిర్ణయము లేనిది; శ్రుతులు కూడ ఒకదానికొకటి విరుద్ధభావములను ప్రకటించుచున్నట్లుండును. కావున ఈ రెంటిని అనుసరించి మానవుడు సుగతి పొందుట దుర్లభము. పోనీ ఋషులు చెప్పినట్లు నడచుకొనుట కర్తవ్యమనుకొందమా! వారు చేసిన వేదాదుల వ్యాఖ్యానములు కూడ భిన్న భిన్నములుగానే కన్పట్టును. కావున అనంతములైన ధర్మశాస్త్రాది విద్యలయందు ఫలితమునకు రాని పరిశ్రమము చేయక మహాజనులు నడచినదే మార్గముగా అనుసరింపవలయును అని శ్లోకభావము.

అస్మిన్ మహా మోహమయే కటాహే సూర్యాగ్నినా రాత్రిదివేన్ధనేన,
మాసర్తు దర్వీ పరిఘట్టనేన భూతాని కాలః పచతీతి వార్తా. 118

అర్థ: అస్మిన్-ఈ; మహామోహమయే-గొప్పమోహమే స్వరూపమైన; కటాహే-బానయందు; రాత్రి దివా+ఇంధనేన-రాత్రియు పగలును వంట చెఱకుగా గల; సూర్యాగ్నినా-సూర్యుడను అగ్నిచేత; మాస+ఋతు,దర్వీ, పరిఘట్టనేన-నెలలు, ఋతువులు అను తెడ్డుతో కలియబెట్టుటచేత; కాలః-కాలపురుషుడు; భూతాని-ప్రాణులను; పచతి-వండుచున్నాడు; ఇతి-అని; వార్తా-వింతగా చెప్పుకొనుమాట.

తా: ఈ ప్రపంచము మోహముతో నిండిన ఒక పెద్దబాన. రాత్రియందు అగ్నిని, పగటియందు సూర్యుని వంటచెరకుగా ఉపయోగించి, నెలలు ఋతువులు అను తెడ్డుతో కలియబెట్టుచు కాలపురుషుడు ప్రాణులను వండుచున్నాడు. ఇదియే వార్త.

వ్యా: స్త్రీ ధనాది భోగములను అనుభవించుచున్నాము అని మానవుడు తృప్తిపడరాదు. ఇవి యేవియు శాశ్వతములు కావు. కనుక అన్ని వైపుల నుండియు వైరాగ్యమునే యాశ్రయింపవలయునని భావము.

యక్ష ఉవాచ - యక్షు డిట్లు పలికెను.

వ్యాఖ్యాతా మే త్వయా ప్రశ్నా యాథాతథ్యం పరన్తప,
పురుషం త్విదానీం వ్యాఖ్యాహి యశ్చ సర్వధనీ నరః. 119

అర్థ: పరన్తప-ఇతరులను (బుద్ధిశక్తితో) తపింపజేయు వాడా! మే-నా; ప్రశ్నాః-ప్రశ్నలు; త్వయా-నీచేత; యాథాతథ్యమ్-ఉన్నది ఉన్నట్లుగా-చక్కగా సరిపడునట్లు; వ్యాఖ్యాతాః-విమర్శించి చెప్పబడినవి. తు-కానీ; ఇదానీమ్-ఇప్పుడు; యః-ఎవడు; సర్వధనీ-అందరికంటె ధనవంతుడైన; నరః-జనుడో, వ్యాఖ్యాహి-వివరింపుము; పురుషమ్-పురుషుని; వ్యాఖ్యాహి-వివరింపుము.

తా: ఓ మహా మేధావీ! నా ప్రశ్నలన్నింటికి సరియైన ఉత్తరములు విమర్శించి చెప్పితివి. ఇప్పుడొక ప్రశ్న. అందరికంటె ధనవంతుడైన నరుడెవ్వడో, పురుషుడెవ్వడో వివరింపుము.

వ్యా: కర్మజ్ఞానముల ఫలములను వివేకించి చెప్పుటకై యీ ప్రశ్నను యక్షుడు అడుగుచున్నాడు. యాథాతథ్యమ్-యథార్థమగునట్లుగా - నీవు చెప్పిన ఉత్తరము లన్నియు సత్యములే

యని భావము. పురుషుడనగా పురమునందు-శరీరము నందు ఉండువాడు-అనగా జీవించు చున్నవాడు అని అర్థము. ఎవడు నిజముగా జీవించువాడుగా పరిగణింపదగినవాడు? ఎవడు సకల కామములను పొందిన వాడు? అని యివి రెండు ప్రశ్నలు.

యుధిష్ఠిర ఉవాచ - యుధిష్ఠిరు డిట్లు చెప్పెను.

దివం స్పృశతి భూమిం చ శబ్దః పుణ్యేన కర్మణా,
యావత్ సశబ్దో భవతి తావత్ పురుష ఉచ్యతే. 120

అర్థ: పుణ్యేన-పుణ్యమైన; కర్మణా-కర్మము చేత; శబ్దః-కీర్తిశబ్దము; దివమ్-స్వర్గమును; భూమిమ్; చ-భూమిని; స్పృశతి-తాకును; యావత్-ఎంతకాలము; సః-ఆ;శబ్దః-కీర్తినాదము; భవతి-ఉండునో; తావత్-అంతకాలము; పురుషః-పురుషుడు-అని; ఉచ్యతే-చెప్పబడును.

తా: ఎవని పుణ్యకర్మము స్వర్గమును భూమిని తాకుచు ఎంతకాలము నిలిచి యుండునో వాడు పురుషుడనబడును.

వ్యా: పుణ్యేన కర్మణా-పుణ్యకర్మముచేత- అది కామసహితము కావచ్చును. కామరహితము కావచ్చును. అట్టి పనికి సంబంధించిన కీర్తి పలుకు ఎంతకాలముండునో అంతకాలము మానవుడు జీవించి యుండునని భావము. అటుపై ఈ లోకమున పూర్వవాసనలకు అనురూపములైన కర్మములను చేయుచుండును. అందును మెట్లెక్కు తీరున క్రమముగా నిష్కాముడైనచో ముక్తినందును. మెట్లు దిగిన తీరున సకాముడైనచో ఎక్కువ ఎక్కువగా వాసనలనెడు పాశములతో కట్టివేయబడును అని యర్థము.

తుల్యే ప్రియాప్రియే యస్య సుఖదుఃఖే తథైవ చ,
అతీతానాగతే చోభే స వై సర్వధనీ నరః. 121

అర్థ: యస్య-ఎవనికి; ప్రియ-అప్రియే-ప్రియము అప్రియము అనునవి; తథా, ఏవ, చ-ఆ విధముగనే; సుఖదుఃఖే-సుఖము దుఃఖము అనునవి; అతీత అనాగతే; చ-భూతము, భవిష్యత్తు అనునవి; ఉభే-రెండును; తుల్యే-సమానములో; సః,వై-అతడే; సర్వధనీ-అందరికంటె గొప్ప ధనముగల; నరః-నరుడు.

తా: ప్రియాప్రియములు, సుఖదుఃఖములు, భూతభవిష్యత్తులు సమానముగా భావించువాడు అందరకంటె గొప్ప ధనము కలనరుడు.

వ్యా: ఇచట సర్వధనియనగా బ్రహ్మవేత్తయే. "యస్తమాత్మాన మనువిద్య విజానాతి సర్వాంశ్చ లోకాన్హోతి సర్వాంశ్చ కామాన్" 'ఎవడు ఆత్మమును చక్కగా పరికించి తెలిసికొనునో వాడు సర్వలోకములను, సర్వకామములను పడయును' అను శ్రుతిని బట్టి అట్టివాడే సకల కామములను పొందినవాడగును.

అట్టివానికి స్వాభావికమైన లక్షణము ద్వంద్వముల యందు సమభావము. సాధకునకు అట్లు సుఖదుఃఖాదుల యందు సమభావము ప్రయత్నముతో సిద్ధించును. అదియే జ్ఞాన సాధనమని యిందు తెలియజేయుచున్నారు.

"ఉత్పన్నాత్మప్రబోధస్య హ్యద్వయత్వాదయో గుణాः,
అయత్నతో భవన్త్యస్య నతుసాధనరూపిణः"

ఆత్మప్రబోధము పుట్టినవానికి ద్వంద్వములు లేకుండుట మున్నగు గుణములు అయత్నముగా సిద్ధించును. అవి సాధనచేత ఏర్పడునవి కావు. అనిపై సమాధాన శ్లోక తాత్పర్యము.

యక్ష ఉవాచ - యక్షుడు పలికెను.

వ్యాఖ్యాతः పురుషో రాజన్ యశ్చ సర్వధనీ నరः,
తస్మాత్ త్వమేకం భ్రాతౄణాం యమిచ్ఛసి స జీవతు. 122

అర్థ: రాజన్-రాజా! యः-ఎవడు; పురుషः-పురుషుడో; చ-మరియు; సర్వధనీ-అందరి కంటె ధనవంతుడగు; నరः-నరుడో; వ్యాఖ్యాతः-చక్కగా వక్కాణింపబడినాడు; తస్మాత్-అందువలన, త్వమ్-నీవు; భ్రాతౄణామ్-తమ్ములలో; ఏకమ్-ఏ యొక్కనిని; ఇచ్ఛసి-కోరుదువో; సः-అతడు; జీవతు-బ్రదుకును.

తా: రాజా! పురుషుడెవడో, సర్వధనియగు నరుడెవడో చక్కగా వక్కాణించితివి. అందువలన నీ తమ్ములలో ఒక్కనిని కోరుకొమ్ము. ఆతడు బ్రదుకును.

వ్యా: ఇట్లు పుత్రుని జ్ఞానమును బాగుగా పరీక్షించి ధర్మమునందలి అతని నిష్ఠను పరీక్షించుటకై ఒక్కని కోరుకొమ్మని యమధర్మరాజు పలికెను.

యుధిష్ఠిర ఉవాచ - యుధిష్ఠిరుడు పలికెను.

శ్యామో య ఏష రక్తాక్షో బృహచ్ఛాల ఇవోత్థితः,
వ్యూఢోరస్కో మహాబాహు ర్నకులో యక్ష జీవతు. 123

అర్థ: యక్ష-యక్షా!శ్యామः-నీలమైన వర్ణము కలవాడు; రక్తాక్షः-ఎఱ్ఱని కనులు కలవాడు; ఉత్థితः-బాగుగా పైకిలేచిన; బృహత్, శాలःఇవ-పెద్దమద్దిచెట్టు వలె ఉన్నవాడు; వ్యూఢోరస్కः - చక్కగా తీర్చిదిద్దినట్లున్న రొమ్ముకలవాడు; మహాబాహుः-గొప్ప భుజములు కలవాడు-అయి ఉండెనో; ఏషः-అట్టి ఈ; నకులः-నకులుడు; జీవతు-బ్రదుకుగాక.

తా: యక్షా! ఇదిగో నల్లని వన్నెయు, ఎఱ్ఱని కన్నులు కలిగి పెనుమద్దివంటి పొడవైన దేహముతో, వెడల్పయి తీర్చిదిద్దినట్లున్న రొమ్ముతో, పొడవైన, దృఢములైన భుజములలో ఉన్న ఈ నకులుడు జీవించుగాక!

యక్ష ఉవాచ - యక్షుడు పలికెను.

ప్రియస్తే భీమసేనోఽ య మర్జునో వై పరాయణమ్,
స కస్మా న్నకులం రాజన్ సాపత్నం జీవ మిచ్ఛసి. 124

అర్థ: తే-నీకు; అయమ్-ఈ; భీమసేనః-భీమసేనుడు; ప్రియః-ఇష్టుడు; వః-మీకు; అర్జునః-అర్జునుడు; పరాయణమ్-పెద్దదిక్కు; రాజన్-రాజా; సః(త్వమ్)-అట్టినీవు; సాపత్నమ్-సవతితల్లి కొడుకైన; నకులమ్-నకులుని; కస్మాత్-ఎందువలన; జీవమ్-బ్రదుకు వానిగా; ఇచ్ఛసి-కోరుచున్నావు.

తా: రాజా! ఈ భీమసేనుడు నీకు ప్రియుడు. అర్జునుడు మీకు పెద్దదిక్కు. మఱి సవతి తల్లి కొడుకును నకులుని ఏల బ్రదికింప గోరుచున్నావు.

వ్యా: జీవమ్-జీవన్తమ్-బ్రదుకు వానినిగా;

యస్య నాగసహస్రేణ దశసంఖ్యేన వై బలమ్,
తుల్యం తం భీమ ముత్సృజ్య నకులం జీవ మిచ్ఛసి. 125

అర్థ: యస్య-ఎవని యొక్క; బలమ్-బలము; దశసంఖ్యేన-పదిరెట్లుగల; నాగసహస్రేణ-ఏనుగుల వేయితో; తుల్యమ్-సమానమో; తమ్-ఆ; భీమమ్-భీమును; ఉత్సృజ్య-వదలి; నకులమ్-నకులుని; జీవమ్-బ్రదుకువానిగా; ఇచ్ఛసి-కోరుచున్నావు.

తా: భీమసేనుడు పదివేల యేనుగుల బలముతో సమానమగు బలము కలవాడు. నీవు అతనిని వదలి నకులుని కోరుచున్నావు.

తథైనం మనుజాః ప్రాహు ర్భీమసేనం ప్రియం తవ,
అథ కేనానుభావేన సాపత్నం జీవ మిచ్ఛసి. 126

అర్థ: తథా-అట్లే; మనుజాః-జనులు; ఏనమ్-ఈ; భీమసేనమ్-భీమును; తవ-నీకు; ప్రియమ్-ఇష్టునిగా; ప్రాహుః-చెప్పుచుందురు; అథ-అట్టియెడ; కేన-ఏ; అనుభావేన-సామర్థ్యము చేత; సాపత్నమ్-సవతి తమ్ముడైన; నకులమ్-నకులుని; జీవమ్-బ్రదుకువానిగా; ఇచ్ఛసి-కోరుదువు.

తా: జనులు భీముడు నీకు ప్రియుడని చెప్పుకొందురు. ఏ సామర్థ్యము చూచి సవతి తమ్ముడు నకులుని బ్రదికింప గోరుచున్నావు.

యస్య బాహుబలం సర్వే పాణ్డవాః సముపాసతే,
అర్జునం త మపాహాయ నకులం జీవమిచ్ఛసి. 127

అర్థ: సర్వే-అందఱు; పాండవాః-పాండుకుమారులు; యస్య-ఎవని; బాహుబలమ్-భుజముల బలమును; సముపాసతే-సేవింతురో; తమ్-ఆ; అర్జునమ్-అర్జునుని; అపాహాయ-వదలి; నకులమ్-నకులుని; జీవమ్-బ్రదుకువానిగా; ఇచ్ఛసి-కోరుచున్నావు.

తా: పాండుకుమారులందఱు అర్జునుని భుజముల బలమును సేవించుచుందురు. అట్టి అర్జునుని వదలి నకులుని బ్రదికింపగోరుచున్నావు.

యుధిష్ఠిర ఉవాచ - యుధిష్ఠిరుడు పలికెను.

ధర్మ ఏవ హతో హన్తి ధర్మో రక్షతి రక్షితః,
తస్మాద్ ధర్మం న త్యజామి మా నో ధర్మో హతోఽవధీత్. 128

అర్థ: హతः-చంపబడిన; ధర్మः-ఏవ-ధర్మమే; హన్తి-చంపును; రక్షితः-రక్షింపబడిన; ధర్మः-ధర్మము;రక్షతి-రక్షించును; తస్మాత్-అందువలన; ధర్మమ్-ధర్మమును, న, త్యజామి-వదలను; హతः -చచ్చిన; ధర్మः-ధర్మము; నः-మమ్ములను; మా, అవధీత్-చంపకుండును గాక!

తా : ధర్మము తన్ను చెఱిచినవానినే చెఱుచును. కాపాడిన వానినే కాపాడును. కావున నేను ధర్మమును ఎన్నటికిని విడువను. మాచే చెడిన ధర్మము మమ్ము నాశనము చేయకుండుగాక!

ఆనృశంస్యం పరో ధర్మः పరమార్థా చ్చ మే మతమ్,
ఆనృశంస్యం చికీర్షామి నకులో యక్ష జీవతు. 129

అర్థ : యక్ష-ఓయియక్షా! ఆనృశంస్యమ్-విషమ భావము లేకుండుట, పరమార్థాత్, చ-పరమార్థమగు సత్యముకంటెను, పరः-గొప్పదైన, ధర్మः-ధర్మమని, మే-నా, మతమ్-అభిప్రాయము, ఆనృశంస్యమ్-ఆనృశంస్యమ్-సమతను, చికీర్షామి-చేయగోరెదను, నకులः-నకులుడు, జీవతు-బ్రదుకు గాక!

తా : సమత అనుగుణము సత్యముకంటె మిన్నయగు ధర్మమని నా అభిప్రాయము. నేను ఆ సమతను సాధింపగోరుదును. నకులుడు జీవించుగాక!

వ్యా : ఆనృశంస్యము అనగా విషమభావము లేకుండుట, పరమార్థమనగా సత్యము.

ధర్మశీలः సదా రాజా ఇతి మాం మానవా విదుः,
స్వధర్మా న్న చలిష్యామి నకులో యక్ష జీవతు. 130

అర్థ : రాజా-ధర్మరాజు, సదా-ఎల్లవేళల, ధర్మశీలः-ధర్మమునకు కట్టుబడిన శీలము కలవాడు, ఇతి-అని, మానవాः-మానవులు, మామ్-నన్ను, విదుः-ఎరుగుదురు, స్వధర్మాత్-నాదైన ధర్మము నుండి, న,చలిష్యామి-కదలను, యక్ష-ఓయక్షుడా! నకులः-నకులుడు, జీవతు-బ్రదుకు గాక!

తా : ధర్మరాజా నిత్యము ధర్మశీలుడు అనిమానవులందరు నన్ను కొనియాడుదురు. అట్టి నేను ధర్మము నుండి కొంచెమైనను జారను. నకులుడు బ్రదుకుగాక!

కున్తీ చైవ తు మాద్రీ చ ద్వే భార్యే తు పితు ర్మమ,
ఉభే సపుత్రే స్యాతాం వై ఇతి మే ధీయతే మతిः. 131

అర్థ : కున్తీ, చ, ఏవ-కుంతియును, తు-అదేవిధముగా, మాద్రీ, చ-మాద్రియును, మమ-నా, పితుः-తండ్రికి, ద్వే-ఇద్దఱు, భార్యే-భార్యలు, ఉభే-ఆయిరువురు, సపుత్రే-కొడుకులు కలవారు, స్యాతామ్, వై-అగుదురుగాక, ఇతి-అని, మే-నా, మతిः-బుద్ధి, ధీయతే-నిశ్చయించుచున్నది.

తా : కుంతి, మాద్రి అని మా నాయనకు ఇద్దరు భార్యలు. ఇద్దఱును కొడుకులు కలవారు కావలయును అని నాబుద్ధి నిశ్చయము.

యథా కున్తీ తథా మాద్రీ విశేషో నాస్తి మే తయోఃr,
మాతృభ్యాం సమ మిచ్ఛామి నకులో యక్ష జీవతు. 132

అర్థ : కున్తీ-కుంతి, యథా-ఎట్లో; మాద్రీ-మాద్రి, తథా-అట్లే, తయోఃr-వారిరువురిలో విశేషఃr-భేదము, న, అస్తి-లేదు, మాతృభ్యామ్-ఇద్దఱు తల్లులయందును, సమమ్-సమ భావమును, ఇచ్ఛామి-కోరుదును, యక్ష-యక్షుడా! నకులఃr-నకులుడు, జీవతు-బ్రదుకుగాక!

తా : నాకు కుంతి యెట్లో మాద్రియు నట్లే, వారిరువురిలో భేదము కానరాదు. ఆ యిద్దఱు తల్లులయెడ సమస్థితినే కోరుదును. కావున ఓయియక్షా! నకులుని బ్రతికింపుము.

యక్ష ఉవాచ - యక్షుడు పలికెను.

తస్య తేఽర్థాచ్చ కామాచ్చ ఆనృశంస్యం పరం మతమ్,
తస్మాత్తే భ్రాతరఃr సర్వే జీవన్తు భరతర్షభ. 133

అర్థ : తస్య-ఆ, తే-నీకు, అర్థాత్, చ-ధనముకంటెను, కామాత్, చ-కామముకంటెను, ఆనృశంస్యమ్-సమతాభావము, పరమ్-శ్రేష్ఠమైనదిగా; మతమ్-అభిప్రాయము; తస్మాత్-దానివలన; తే-నీ; భ్రాతరఃr-తమ్ములు; సర్వే-అందఱు; భరతర్షభ-భరత(శ్రేష్ఠా!; జీవన్తు-బ్రదుకుదురు గాక!

ఇతి శ్రీమహాభారతే ఆరణ్యకే పర్వణి ఆరణేయ పర్వణి,
యక్షప్రశ్నే త్రయోదశాధిక త్రిశతతమోఽధ్యాయఃr.

ఇది శ్రీ మహాభారతము ఆరణ్య పర్వమున ఆరణేయ పర్వమున యక్షప్రశ్నము గల మూడు వందల పదుమూడవ అధ్యాయము.

314

వైశమ్పాయన ఉవాచ - వైశంపాయనుడు చెప్పెను.

తతస్తే యక్షవచనాత్ ఉదతిష్ఠన్త పాణ్డవాఃr,
క్షుత్పిపాసే చ సర్వేషాం క్షణేన వ్యపగచ్ఛతామ్.

తాఃr అంత యక్షుని మాటవలన పాండవులందరు ప్రాణములతో పైకి లేచిరి. వారందరికి ఒక్కక్షణములో ఆకలి దప్పులు తొలగిపోయినవి.

హరిఃr ఓమ్ తత్సత్

❀ ❀ ❀

శ్రీ మదాంధ్ర మహాభారతము

అరణ్య పర్వము

సప్తమాశ్వాసము

ఎఱ్ఱాప్రెగడ రచిత

యక్షప్రశ్నము

404-468 పద్యములు

ఇట పాండవాగ్రజుడు.

క. తమ్ములు నలువురు నొక్కట, నమ్మొయి మసలుటకు నాత్మ నత్యంతవిషా
దమ్ములయ సముత్థితుఁడై, క్రమ్మఱ నమ్మార్గ మపుడు గైకొని నడచెన్ 405

సీ. అపగతజనశబ్దమై యనభివ్యక్తమార్గమై యవిరళదుర్గశైల
తరుగుల్మవల్లీవితాన మై గజసింహశరభశార్దూల సూకరలులాయ
బహుళమై బహువిధ పక్షి కోలాహల భయదమై కడుఁ బరపయినయడవి
నను జుల వెదకుచు ననఘుండు సని కాంచెఁ గమలాకరంబుతీరమునఁ బడిన

ఆ. వారిఁ బూరువంశవరుల భీమార్జున, యముల నమితబలుల విమలమతులఁ
బ్రళయపతితలోకపాలసంకాశుల, భూరిపుణ్యధనుల వీరవరుల 406

మ. కని డెందంబునఁ దల్లడం బడర దీర్ఘ శ్వాసవైవర్ణ్యముల్
దనుకం దాల్మి సలింప విస్మయపరీత స్వాంతుఁడై శోకబా
ష్పనిరుద్ధాకులలోచనుం డగుచు మూర్ఛల్ పైకొనం గొంతసే
పు నరేంద్రోత్తముఁడుండెఁ జిత్రమున రూపుంబోలెఁ దా నచ్చటన్ 407

చ. పదంపడి డెందంబు ధృతిపొందున నిడికొని యతం డన్నలువుర సుపలక్షించి
నలు దెసలుం బరికించి యాత్మగతంబున 408

తే. ఒరులు వచ్చినచొప్పు లే దరిగినట్టి, చొప్పు లేదు పెనంగినచొప్పు లేదు
ఘనభుజులయంగకంబులు గనుఁగొనంగ, వక్షతములేలయొక్కొ యిట్లయిరివీరు

ఉ. క్రూరుఁడు ధార్తరాష్ట్రుఁ డతికుత్సితుఁ డెంతయుఁ బాపబుద్ధి గాం
ధారుఁడు పెక్కు మాయలకుఁ దావల మక్కట యద్దురాత్మకుల్
వారక యెద్దియేని యొకవంచన మై నిటు సేసిరొక్కొ యె
వ్వారలు నాత్మ నమ్ముదురె వక్రవిచారులఁ బాపకారులన్ 410

క. వదనంబుల తెలివియుఁ గర, పదరుచియుం జెడదు వీరు వడుటకుఁ గత మీ
యుదకము విష దిగ్ధం బని, మదిఁదలఁపంబోల దేమి మాయయొ యెఱుఁగన్

చ. పుడమియు సర్వసంపదలుఁ బొల్పఱ వైరులపాలు సేసి యీ
యడవికి వచ్చి భీకరమృగావలిపాత్తున నున్నవీరి వె
న్నడికొని యిట్లు సేసెనె యనాథులఁబోలె విధాతృఁడింక నె
క్కడఁ జనువాఁడ గడగాఁ దరియింతు దురంతదుఃఖముల్. 412

సీ. పుత్రులు దుఃభార్యబొగులుట కనిశంబుఁ బొక్కుచు నున్న యప్పుణ్యచరిత
మాతల్లి పాండునిమహిషి నా కెదురుగా వచ్చి కౌఁగిటఁజేర్చి వత్స నాఁడు
దమ్ముఁగుఱ్ఱలు నీవుఁదగ విపినంబున కరిగితి రిప్పు డయ్యనుజు లెందుఁ
జనిరి నీ వొక్కండ చనుదెంచి తిది యేమి యనిన నాయమతోడ నకట యేమి

ఆ. యనఁగ నేర్చువాఁడ నాచార్య విదురశాం, తనవక్కపులు నను ముదంబుతోడఁ
గుశల మడిగిరేనిఁ గుశల మే మనువాఁడ, దలుఁగ రానియెడరు దగిలెనాకు.

వ. అని పెక్కు దెఱంగుల వగచి యాధర్మజుండు దప్పి కోర్వక నీళ్లు ద్రావుటకై
సరోవరంబులోనికి దిగుటయు నశరీరభూతం బిట్లనియె. 414

మ. వినుఁ మే నొక్కబకంబ నిక్కొలను పృథ్వీనాథ నాసొమ్మునీ
యనుజుల్ మద్వచనంబు గైకొనక తోయాస్యాదులై యివ్విధం
బునఁ బ్రాణచ్యుతిఁ బొంది రీవును గడున్ మోహంబునన్ సాహసం
బునకుం జొచ్చిన నట్ల యయ్యెదు సుమీ మున్మొట్ట వారించితిన్. 415

క. నీ నడిగినయర్థములకు, భూనుత యుత్తరము లిచ్చి పోలు పొందఁ బయఃపానము చేయుము నావుడు, నానిర్మల చరితుఁడంబరాభిముఖుండై 416

వ. అయ్యా నీవు బకరూపధరుండవై యున్నరుద్రుండవో పావకుండవో పవనుండవో యట్టు గానినాఁడు కులపర్వత ప్రతిములయిన నాతమ్ములం బడఁద్రోచునట్టి బలంబు పులుఁగులకుం గలదె దేవాసురగంధర్వయక్షాదులకు దుర్జయులైన యవ్వీరుల నిట్లు నేసి నీవు గానివాఁడవపోలెం దొలంగి యున్నాఁడవు నాకు నద్భుతభయకౌతుకంబు లొక్కటం బొడమెడు నీ వెవ్వండవు నీతలం పెయ్యది చెప్పి నాహృదయవేదన నపనయింపవే యనిన నదృశ్యభూతం బిట్లనియె.

ఆ. కౌరవేంద్ర బకమఁగాను నే వినుఁ మొక్క, యక్షవరుఁడ నిచట నస్మదీయ
నిక్షితిఁజేసి పడిరి నీతమ్ములందఱు, ననుచు నాక్షణంబ యతనియెదుర.

మ. నిలిచెం దాళసముచ్ఛితాంగుడు మహానిర్ఘోషసంతర్జితా
ఖిలభూతప్రకరుండు దీర్ఘవిపులగ్రీవుండు దంష్ట్రాసము
జ్జ్వలవక్త్రుండు విరూపలోచనుఁడు దీప్రస్ఫారతేజోఘనుం
డలఘుం డాసరసీ తటాగ్రమున నవ్యక్తుండు ఘోరాకృతిన్ 419

వ. ఇట్లు నిలిచి కౌంతేయాగ్రజున కిట్లనియె 420

క. నాయనుమతి లేకుండఁగ, నీయుదకము ద్రావిరేని యెవ్వారైనన్
ధీయుత చత్తురు నీ వటు, సేయవు సమ్యగ్విచారశీలుఁడ వగుటన్ 421

వ. కావున మదీయంబు లగు ప్రశ్నంబుల కుత్తరంబు సెప్పు మనిన నతండు మహాత్మా నీచిత్తంబునకు వచ్చునట్లుగాఁ జెప్ప నాబోఁటివానికి శక్యం బగునే యైనను నా నేర్చువిధంబునఁ జెప్పెద నడుగు మనిన నయ్యక్షుం డిట్లనియె

ధర్మరాజు యక్ష ప్రశ్నముల కుత్తరంబు లిచ్చుట

క. దినకరు నెయ్యది నడపును, దినకరు నెవ్వారు గొలిచి తిరుగుదు రద్దే
వుని యస్తమించు టేమిట, ననఘ తదాధారభూత మది యెయ్యదియో.

తే. అనిన ధర్మజుఁడిట్లను నబ్జహితుని
నడపు బ్రహ్మంబు సురకోటి నడచుఁ గొలిచి
ధర్మమే నస్తమితుఁడగుఁ దపనుఁడమ్మ
హాత్మునకు సత్య మాధార మండ్రు బుధులు 424

వ. అనిన విని యక్షుం డిట్లనియె 425

క. ఏమిట శ్రోత్రియుఁడనఁజను, నేమిటఁగడు మహిమవడయు నిమ్మగఁబురుషుం
డేమిట సహాయయుతుఁడగు, నేమిట నగు బుద్ధిమంతు డేర్పడఁ జెపుమా.

వ. అనిన నతండిట్లనియె 427

క. శ్రుతమువలన శ్రోత్రియుఁడగు, నతులతపో యుక్తిఁ గడుమహత్వము వడయున్
ధృతిచే సహాయయుతుఁడగు; నతిశయముగ బుద్ధిమంతుఁడగు బుధసేవన్.

వ. అని చెప్పిన నప్పార్థివోత్తమున కప్పురుషుండు వెండియు నిట్లనియె 429

తే. ఏమికతమున భూదేవుఁ డెసఁగ దేవ, భావమున నాతనికి సాధుభావ మెవ్వి
ధమున నగు నసాధుత్వ మెద్దానఁ జెందు, మానుషుండగు నాతఁడేదానఁ జెపుమ.

చ. అనవుడు ధర్మజుం డనియె నధ్యయనంబున దేవభావముం
గను నవనీసుపర్వుఁ డధికవ్రతశీలత సాధుభావ మా
తనికి విశిష్టవృత్తి దిగఁ ద్రావి యసాధు వనంగ నుండు శౌ
చనియతి లేక మృత్యుభయసంగతి నాతఁడు మానుషుం డగున్ 431

క. నా విని యతఁ డాతనితో, జీవన్మృతుఁ డెట్టివాఁడు సెప్పు మనుటయున్
దేవాతిథిపితృభృత్యజ, నావళులకు నిడక కుడుచునతఁ డని చెప్పెన్

చ. విని మగుడంగ వాఁడు పృథివీపతిఁ జూచి ధరిత్రికంటె వ్రేఁ
కన యగుదాని, నాకసముకంటె గడుం బొడ వైనదాని, గా
డ్పునకును నెక్కుఁడై జవము పొంపిరి వోయెడుదానిఁ, బూరికం
టెను దఱ వైనదానిని ఘటింపఁగ జెప్పుమ నాకు నావుడున్ 433

వ. అమ్మనుజోత్తముం డయ్యక్షోత్తమున కిట్లనియె 434

ఆ. తల్లివ్రేఁగు సువ్వె ధరణికంటెను, నాక, సంబుకంటెఁ బొడవు జనకుఁ డరయ
గాడ్పుకంటె మనసు గడు శీఘ్రగతి తృణో, త్కరముకంటెఁజింత గరముతఱచు.

వ. అనిన నంబరచరుం డమ్మహీవరున కిట్లనియె

తే. మొనసినిద్రించియును గన్ను మూయదెద్ది, పుట్టియును జేతనత్వంబుఁబొరయదెద్ది
యరయ రూపు గల్గియు హృదయంబులేని, దెద్ది వేగంబుకతమున నెద్ది వాలుచు

తే. అనిన గన్ను మూయదు సుప్తమయ్యు మీను
పుట్టియును గ్రుడ్డు చేతనం బొరయ కుండు
హృదయరహితంబు రారూప, మేఱు రయము
కతన వర్తించు నని చెప్పెఁ గౌరవుండు.

వ. చెప్పిన నయ్యక్షుం డతనితోఁ దెరువు నడుచువానికి రోగార్తునకు గృహస్థు
నకు మృతిఁ బొందినవానికి నెవ్వరెవ్వరు సుట్టంబు లనిన నప్పుడమితేఁడన్నలువు
రకుం గ్రమంబున సార్థంబును వైద్యుండును సద్భార్యయుఁ గృతం బగుధర్మం
బును బరమమిత్రంబులని నిర్దేశించుటయు వాఁడు వెండియు నిట్లనియె

క. ఎయ్యది ధర్మ్మవునకుఁ గుదు, రెయ్యది యాశ్రయము గీర్తి కిమ్మగుమార్గం
బెయ్యది సురలోకమునకు, నెయ్యది సుఖములకు నిక్క మేర్పడఁ జెపుమా

వ. అని యడుగుటయు

క. అమరఁగ దాక్షిణ్యము ధర్మ్మమునకుఁగుదు రండ్రు కీర్తిమహిమనెలవు దా
నము సత్యము సురపురిమార్గము శీలము సంశ్రయము సుఖంబుల కెల్లన్.

వ. అని యుధిష్ఠిరుం డెఱింగించిన నతండు 443

చ. నరునకు నాత్మ యెవ్వఁడు; ఘనంబుగ దైవిక మైనచుట్ట మె
వ్వ రతనికిం; దదీయ మగువర్తన మేమిట నిర్వహించు భూ
వర; యతఁ డేమి వూని యనవద్యతఁ బొందు నెఱుంగఁ జెప్పు మీ
వరుదుగ నన్న నక్కురుకులాగ్రణి యాతనితోడ నిట్లనున్ 444

తే. ఆత్మజుఁడు సువ్వె పురుషున కాత్మ యయ్యె, నాతనికి భార్యదైవిక మై న చుట్ట
మతనిజీవిక పర్జన్యకతనఁ జెల్లు, నతడు దానము గొనియాడి యతిశయిల్లు.

చ. అన విని మేటి ధర్మ మగునట్టిది యెయ్యది యేది యెప్పుడున్
దనియఁగఁ బండి యుండు విదితంబుగ నెయ్యది నిగ్రహించినం
దనరుఁ బ్రమోదసిద్ధి నియతంబుగ నెవ్వరితోడిసంధి యెం
దును వికలంబుగాదు పరితోష మెలర్ప నుపన్యసింపుమా 446

వ. అని దివ్యుండు పలికిన నాదివ్యబోధనుం డిట్లనియె 447

ఆ. విను మహింస మేటి యనఁ జను ధర్మంబు, యాగకర్మ మెపుడు నమరఁ బండి
యుండు, మనసు క్రొవ్వు ఖండింపఁగామోద, మెసఁగు, సుజనసంధి యెడలదెందు.

తే. అనిన నతఁడు లోకమున కెయ్యదియు దిక్కు, జలము నన్నము నెద్దానసంభవించు
విష మనంగ నెయ్యది శ్రాద్ధవిధికి నెద్ది, సమయ మనిన నిట్లనిచెప్పె జనవిభుండు

తే. సజ్జనులు దిక్కు సూవెయీ సర్వమునకు, నభము ధరణియుజలము నన్నమ్ము మధ్ధ
వించునెలవులు, విషమగు విప్రధనము, లనఘుశ్రాద్ధకాలము బ్రాహ్మణాగమంబు.

వ. అని తెలిపిన నయ్యక్షుండు ధర్మనందనుతో మనుజుం డెయ్యది పరిత్యజించి
సర్వజనప్రియుండును నిశ్శోకుండును నర్థవంతుండును సుఖియును నగుననిన
నమ్మహీపతి యతని కిట్లనియె.

తే. సర్వజనసమ్మతుండగు గర్వ ముడిగి, క్రోధమడఁచి శోకమునకుఁగొలువుగాఁడు
వినవెయర్థాధ్యుఁడగులోభ మొనరవిడిచి, తృష్ణవర్జించి సౌఖ్యంబు తెరువుఁగాంచు.

వ. అనిన యనంతరంబ యద్దివ్యుండతనితోఁ బురుషశబ్దవాచ్యుండెట్టివాఁడు మఱియు
సర్వధని యగువాఁడెవ్వండు నిశ్చయింపు మనినఁబాండవజ్యేష్ఠుం డిట్లనియె

క. దివి ముట్టిధరణి యంతట, నివిడి మెఱయు చుండు నెవ్వనియశోరమ యట్టి విశిష్ట చరిత్రుడు యక్షవరా పురుషుండు నాఁ బ్రకాశత నొందున్ 454

ఆ. ప్రియము నప్రియంబుఁ బెల్లగు సౌఖ్య దుఃఖములు భూతభావికార్యములును నెవ్వనికి సమంబు లిల సర్వధని యనఁ, బరఁగుఁ జువ్వె యట్టిభవ్యుఁ డనఘు

వ. అని వివరించిన విని యుధిష్ఠిరు డెసఁ బ్రసాదమధురం బైనయాలోకనంబు నిగుడ నయ్యక్షవరుండు మహాత్మా మదీయంబు లైన ప్రశ్నంబులన్నింటికి సదుత్తరంబు లిచ్చితివి నీవలనం బ్రీతుండ నైతి నీతమ్ములం దొక్కని ప్రాణంబు లిచ్చెద వేఁడు మనిన నతండు

పీ. శ్యామాంగు నారక్తజలరుహనేత్రు సాలప్రాంశు మున్నతలలితబాహు నకులుని బ్రదికింపు నావుడు యక్షుండు భీమఫల్గును లతిభీమబలులు ప్రియులు నీ కెంతయుఁ బృథివీశ వీరిలో నొకనిఁగోరక యిట్లు నకులుఁగోరి తనుడు ధర్మాత్మజుఁడనియెను మా తండ్రి యగు పాండువిభునకు మగువలిరువు

ఆ. రండు గొంతికొడుకు లైనమువ్వురిలోన, నేను బ్రదికినాఁడ నింక మాద్రి తనయు లిరువు రండుఁదగ నిప్పు డొక్కఁడు, బ్రతుకవలదె చెపుమ పాడితెఱఁగు

ఆ. ధర్మనందనుండు ధర్మాత్ముఁడని యెప్డు, దగిలి జనము నమ్మఁ బొగడుచుండు నట్టియేను ధర్మహానికి నోర్వఁజుమ్మెంత వచ్చె నేనినింత నిజము 458

వ. అనిన నతండు నీ దైన ధర్మజ్ఞతకు మెచ్చితి నీతమ్ములందఱు లబ్ధజీవితులయ్యెదు మనిన, తత్ క్షణంబ విగత ప్రాణులై పడియున్న యన్నలువురు నిద్రవోయిమేల్కనినట్లు సముల్లితు లైనం జూచి విస్మితుండై ధర్మజుం డిట్లనియె 459

చ. నిను నొక యక్షమాత్రుఁడుగ నే మది నమ్మఁగ నేర నయ్యెదన్
జననుత నీవు నిక్కముగ శక్రుఁడవో యలకాధిపుండవో
యనలుఁడవో సమీరుఁడవొ యట్టులు గాక జగన్నుతుండు మ
జ్జనకుఁడు ధర్మదేవతవొ సత్కృపఁ జెప్పుము నాకు నేర్పడన్ 460

వ. అనిన నమ్మహాత్ముండు మందస్మితాననుండై 461

మత్త. నీను ధర్ముఁడఁ జువ్వె రాజకులేంద్ర సత్యము శౌచమున్
దానముం దపమున్ శమంబును దాంతియున్ యశముం బరి

జ్ఞానయుక్తియు నాదుమూర్తులు సమ్మదంబున నిపు డు
త్సాను నుత్తమధార్మికున్ నినుఁ జూచు వేడుక వచ్చితిన్ 462

వ. నన్ను నాశ్రయించినజనంబులు దుర్గతిం బొరయరు గావున నభిమతవరం
బిచ్చెద వేఁడు మనినఁ బాండవాగ్రజుండు సంభ్రమభక్తిభరితుండగుచు దండ
ప్రణామంబు నేసి యద్దేవోత్తముం బ్రస్తుతించి దేవా మదీయాశ్రమవాసుం
డైన భూసుర ముఖ్యునరణి యొక్క హరిణంబుచేత నపహృతం బయ్యె నతనికిం
గర్మ లోపంబు గాకుండ నయ్యరణిం గరుణింపవే యనినఁ బ్రీతచిత్తుం డగుచు
ధర్మ దేవుండు 463

క. వినుఁ మేను నీమనోగతి, యనఘా యెఱుఁగంగ వేఁడి యరణీహరణం
బొనరించితి మృగ మెక్కడి, దని యమ్మహనీయవస్తు వతనికి నిచ్చెన్ 464

వ. ఇచ్చి మఱియు నిట్లను నిదె పదుమూఁడవయేఁడు సనుచెంచె నింకమీకు
నజ్ఞాతవాసంబు సలుపవలయు నందు మీ రెవ్వ రెక్కడ నేరూపంబునం జరి
యింపం గోరిన వయ్యెరూపంబు లలవడియెడు నెట్లున్నను మిమ్ము నెవ్వరు
నెఱుంగ కుండునట్లుగా వరం బిచ్చితి నింక నొం డెయ్యది వలసిన నడుగుమనిన
నమ్మనుజేశ్వరుం డిట్లనియె 465

మత్త. ఆది దేవుఁడ వైననీవు దయామతిం బొడసూపి న
న్నాదరించుటఁజేసి ధన్యుఁడనైతి నింతకు నెక్కుడొం
డేది గల్గెడు సైన నామది యెల్ల నాఁడును గ్రోధమో
హాదులం బెడఁబాసి ధర్మువునందు నెక్కొనఁ జేయవే 466

వ. అనిన నద్దేవుఁ డతనికి నవ్వరం బొసంగి యనంతరంబ యంతర్హితుం డయ్యెఁ
గొంతేయులు గ్రమ్మఱి నిజాశ్రమంబున కరిగి ధరణీదేవునకు నరణీప్రదానంబు
నేసి తత్ప్రయుక్తాశీర్వాదశతంబులు గైకొని పరమానందంబునుం బొంది రని
యిట్లు పాండుతనయుల వనవాస ప్రకారంబు సవిస్తరమధురంబుగా నుపన్యసించి

క. అవఘుఁడు గృష్ణద్వైపా, యనశిష్యుఁడు బోధనిధి సమంచితమేధా
ఘనునకుఁ బారిక్షితునకు, ననవరతానంద సుఖసమగ్రత యొసఁగెన్ 468

❀ ❀ ❀

యక్ష యుధిష్ఠిర ప్రశ్నోత్తర మాలిక

	ప్రశ్న	సమాధానము
1.	ఆదిత్యుని ఉదయింపచేయునది ఎవరు?	బ్రహ్మము
2.	సూర్యునిచుట్టు తిరుగు వారెవరు?	దేవతలు
3.	ఆదిత్యుని అస్తమింపజేయునది ఎవరు?	ధర్మము
4.	సూర్యునికి దేనియందు ప్రతిష్ఠ?	సత్యమునందు
5.	దేనివలన శ్రోత్రియుడు అగును?	శ్రుతమువలన
6.	దేనిచేత బ్రహ్మమును పొందును?	తపస్సు చేత
7.	దేనిచేత సహాయవంతుడగును?	ధృతి చేత
8.	దేనిచేత బుద్ధిమంతుడగును?	వృద్ధసేవ చేత
9.	బ్రాహ్మణుల దేవత్వము దేని వలన?	వేదాధ్యయనము వలన
10.	సత్పురుషులగు వారికి ఏది ధర్మము?	తపస్సు
11.	వారికి సాధారణ మనుష్య లక్షణము అనగానేమి?	మరణము
12.	వారిలో దుష్ట లక్షణము ఏమి?	నింద పొందుట
13.	క్షత్రియులకు దేవత్వము ఏమి?	దనుర్విద్య
14.	వారిలో మంచి లక్షణము ఏమి?	యజ్ఞము
15.	వారిలో సాధారణ మనుష్య లక్షణము?	భయము
16.	వారిలో చెడు లక్షణము?	ఆర్తులను రక్షింపక పోవుట
17.	యజ్ఞ సంబంధమైన సామము ఒక్కటి ఏది?	ప్రాణము
18.	యజ్ఞ సంబంధమైన యజుస్సు ఒక్కటి ఏది?	మనస్సు
19.	ఏది యజ్ఞమును వరించును?	ఋక్కు
20.	యజ్ఞముదేనిని మీరి ప్రవర్తింపదు?	ఋక్కును
21.	దేవతలను తృప్తిపరచు వానిలో శ్రేష్ఠమైన దేది?	వర్షము
22.	పితృ దేవతలను తృప్తిపరచువానిలో ఏది మిన్న?	విత్తనము
23.	ప్రతిష్ఠ పొందువారికి ఏది శ్రేష్ఠము?	ఆవులు
24.	సంతానము కోరు వారికి ఏది శ్రేష్ఠము?	పుత్రసంతానము
25.	జీవన్మృతుడెవ్వడు?	పంచ యజ్ఞములు చేయనివాడు
26.	భూమికంటె గొప్పది ఏది?	తల్లి
27.	ఆకాశముకంటె ఎత్తయినదెవరు?	తండ్రి

28. వాయువుకంటె శీఘ్రతరమయినది ఏది?.....మనస్సు
29. తృణము కంటె గొప్పది ఏది?.....చింత
30. నిద్రించి కన్ను మూయనిది ఏది?..... .చేప
31. పుట్టియు కదలనిది ఏది?..... .గ్రుడ్డు
32. హృదయము లేనిది ఏది?..... రాయి
33. వేగముతో వృద్ధి పొందునది ఏది?..... .నది
34. ప్రయాణము చేయుచున్నవానికి మిత్రమేది?..... .యాత్రికుల గుంపు
35. ఇంటనున్న వానికి మిత్రమెవరు?..... భార్య
36. రోగికి మిత్రమెవరు?..... వైద్యుడు
37. చనిపోవుచున్నవానికి మిత్రము ఎవరు?..... దానము
38. సర్వ భూతములకు అతిథి ఎవరు.....అగ్ని-సోమము-గవామృతము
39. సనాతన ధర్మము ఏది?.....అమృతము
40. అమృతము ఏది?.....సనాతన ధర్మము
41. ఈ సర్వజగత్తు ఏది?.....వాయువు
42. ఒక్కటిగా సంచరించునది ఏది?.....సూర్యుడు
43. పుట్టి మరల పుట్టునది ఏది?..... చంద్రుడు
44. మంచునకు మందు ఏది?..... .అగ్ని
45. బీజముల స్థానము ఏది?..... .భూమి
46. ధర్మములలో పరమైనది ఏది?..... దక్షత
47. పరమమైన యశస్సు ఏది?..... దానము
48. పరమమైన స్వర్గ్యము ఏది?..... .సత్యము
49. పరమమైన సుఖము ఏది?.....శీలము
50. మనుష్యునికి ఆత్మ ఎవరు?.....కొడుకు
51. దైవమిచ్చిన మిత్రము ఎవరు?.....భార్య
52. మనుష్యునకు బ్రదుకుతెరువు ఏది?..... వర్షాదిదేవత
53. ఆతని పరమ కర్తవ్యమేమి?..... దానము
54. ధన్యములలో ఉత్తమమేమి?..... ఉద్యోగము
55. ధనములలో ఉత్తమమేమి?.....విద్య
56. లాభములలో మేలైనది ఏమి?.....ఆరోగ్యము
57. సుఖములలో ఉత్తమమైనది ఏమి?..... తుష్టి

58. లోకమున పరమమైన ధర్మము ఏది?.....సర్వభూతములయందు కరుణ
59. నిత్యఫలమునిచ్చు ధర్మమేది?.....వేదమంత్రము
60. దేనిని నిగ్రహించి జనులు శోకింపకుందురు?..... మనస్సును
61. ఎవరితోడి సంధి చెడదు?.....సజ్జనులతోడి సంధి
62. జనుడు దేనిని వదలి ప్రియుడగును?.....దురభిమానమును
63. దేనిని వదలి శోకింపకుండును?.....క్రోధమును
64. దేనిని వదలి ప్రయోజనవంతుడగును?.....కామమును
65. దేనిని వదలి సుఖవంతుడగును?.....లోభమును
66. బ్రాహ్మణునకు ఏల దానము చేయవలెను?.....ధర్మము కొఱకు
67. నట నర్తక్షులయందు దానమేల చేయవలయును?..... కీర్తి కొఱకు
68. సేవకులయందు దానమేల చేయవలెను?.....పోషణ కొఱకు
69. రాజులయందు దానమేల చేయవలెను?.....భయము తొలగించుకొనుట కొఱకు
70. ఏది లోకమును కప్పివేసినది?.....అజ్ఞానము
71. దేని వలన లోకము ప్రకాశించుట లేదు?.....చీకటి వలన
72. దేనివలన మిత్రులను లోకము త్యజించును?.....లోభము వలన
73. లోకము దేని వలన స్వర్గమునకు పోదు?.....సంగము వలన
74. పురుషుడు ఎట్లు మృతుడగును?.....దారిద్ర్యము వలన
75. రాష్ట్రము చచ్చినది యెట్లగును?.....రాజు లేని కారణమున
76. శ్రాద్ధము మృత మెట్లగును?..... శ్రోత్రియులు లేని కారణమున
77. యజ్ఞ మెట్లమృతమగును?.....దక్షిణలు లేని కారణము వలన
78. ఏది దిక్కు?.....సజ్జనులు
79. జలమేది?..... ఆకాశము
80. ఏది అన్నము?..... గోవు
81. ఏది విషము?..... వేడుకొనుట
82. శ్రాద్ధమునకు కాలమేది?..... బ్రాహ్మణుని రాక
83. తపము అనగా నేమి?..... తన ధర్మమున ప్రవర్తించుట
34. దమము అనగా నేమి?..... మనస్సును అణచుట
85. గొప్ప క్షమ ఏమి?..... ద్వంద్వములను సహించుట
86. 'హ్రీ' అని దేని నందురు?..... పాడు పనులనుండి మరలుట
87. జ్ఞానమనగా నేమి?..... తత్త్వము సమగ్రముగా ఎరుగుట

88. శమమనగా నేమి?..... చిత్తమునందు అలజడి లేకుండుట
89. 'దయ' అనగా నేమి?..... సర్వ ప్రాణుల సుఖమును కోరుట
90. ఆర్జవ మనగా నేమి?..... సమచిత్తత్వము
91. జయింపనలవికాని శత్రువేది?..... క్రోధము
92. అంతము కాని రోగము ఏది?..... లోభము
93. సాధువనగా నెవరు?..... ఎల్లప్రాణులకు మేలు చేయువాడు
94. అసాధువెవడు?..... దయలేని వాడు
95. మోహము అనగా నేమి?..... ధర్మ స్వరూపము నెఱుగకుండుట
96. 'మానము' అనగా నేమి?..... తన్నుతాను గొప్పగా భావించుట
97. ఆలస్య మనగా నేమి?..... ధర్మమును ఆచరింపకుండుట
98. శోకము అనగా నేమి?..... అజ్ఞానము
99. స్థైర్యము అని ఋషులు దేని నందురు?..... తన ధర్మమునందు నిశ్చలముగా ఉండుటను
100. ధైర్యము అని దేని నందురు?..... ఇంద్రియములను పట్టి నిలుపుటను
101. స్నానము అని దేనినందురు?..... మనసునందలి మాలిన్యమును తొలగించుటను
102. దానము అని దేనినందురు?..... భూతములను రక్షించుటను
103. పండితుడు ఎవడు?..... ధర్మమెఱిగినవాడు
104. నాస్తికుడెవడు?..... మూర్ఖుడు
105. మూర్ఖుడెవడు?..... నాస్తికుడు
106. కామము అనగా నేమి?..... సంసారమునకు కారణమైనది
107. మత్సరము అనగా నేమి?..... హృదయము కుములుట
108. అహంకారము అనగా నేమి?..... గొప్ప అజ్ఞానము
109. దంభము అనగా నేమి?..... లోకము మెప్పునకు చేయు ధర్మము
110. పరదైవము అనగా నేమి?..... దానఫలము
11. నీచత్వము అనగా నేమి?..... ఇతరులను దూషించుట
112. పరస్పర విరుద్ధములైన ధర్మార్థకామములకు ఒక చోట కలయిక ఎట్లు?..... ఎవనికి భార్యయు ధర్మమును ఒక దానికొకటి వశమై యుండునో అచట ధర్మార్థ కామముల కలయిక ఉండును
113. నశింపని నరకము ఏది?..... దరిద్రుడు, తిరిపెము ఎత్తుకొనువాడు అగు బ్రహ్మజ్ఞానిని స్వయముగా పిలిచి 'లేదు' అని చెప్పుట

114. బ్రాహ్మణ్యము దేని వలన సిద్దించును?.....నడవడి వలన

115. ప్రియమును పలుకువాడు ఏమి పొందును?.....ప్రియత్వము

116. విమర్శించి పనులు చేయువాడు దేనిని పొందును?.....అధిక జయమును

117. పెక్కండ్రు మిత్రులు కలవాడు దేనిని పొందును?..... సుఖమును

118. ధర్మప్రీతి కలవాడు దేనిని పొందును?..... సుగతిని

119. ఎవడు ఆనందము నందును?.....ఉన్నదానితో తృప్తి పడుచు అప్పుచేయక పరస్థలమునందు నివసింపక ఉండువాడు

120. ఆశ్చర్యమైన విషయమేమి?....ప్రతిదినము ఎన్నో ప్రాణులు యమునింటికి పోవుచున్నవి. తక్కినవారు స్థిరముగా ఉండుటను కోరుచున్నారు. ఇదియే ఆశ్చర్యము.

121. ఏది మార్గము?.....మహాజనులు నడచినదియే మార్గము

122. ఏది వార్త?.....ఈ మహామోహముతో నిండిన జగత్తునెడు బానయందు సూర్యుడు, చంద్రుడు, రాత్రిని పగటిని వంట చెఱకుగా చేసికొని నెలలు, ఋతువులు అను తెడ్డుతో కలియ బెట్టు కాల పురుషుడు ప్రాణులను వండుచున్నాడు-ఇదియే వార్త.

123. పురుషుడు ఎవడు?.....తన కీర్తి భూమ్యాకాశములు స్పృశించువాడు

124. సర్వధని ఎవడు?....ప్రియము-అప్రియము, సుఖము-దుఃఖము, భూతము భవిష్యత్తు అనునవి ఎవనికి సమానమో వాడు.

❀ ❀ ❀